

www.andhrajyothy.com

విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 23

శుక్రవారం | 9-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి మ.2.57 తదుపరి త్రయోదశి; నక్షత్రం: హస్త రా.12.09 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ.6.34-8.22; దుర్ముహూర్తం: ఉ.8.22-9.13, మ.12.37-1.28; అమృతఘడియలు: సా.5.23-7.11; రాహుకాలం: ఉ.10.30-మ.12.00; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.34

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సిద్ధమా?

నిరంతరం అప్రమత్తంగా ఉండండి

ఎప్పుడు ఎక్కడ ఏమి జరిగినా సమాచారం క్షణాల్లో తెలిసిపోవాలి

ప్రజల భద్రత ముఖ్యం.. జాగ్రత్త

తప్పుడు సమాచారాన్ని అడ్డుకోండి

సైనిక స్థావరాల భద్రతకు చర్యలు తీసుకోండి

కీలక శాఖల కార్యదర్శులకు మోదీ నిర్దేశం

100 మందిని హతమార్చాం

అఖిలపక్షంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

పాక్‌కు చావుదెబ్బ!

కరాచీ, ఓమ్రారా పోర్టులపై భారత్ భీకర దాడి.. రంగంలోకి ఐఎన్ఎస్ విక్రాంత్

దాని వెంట 26 యుద్ధ నౌకలు.. బ్రహ్మోస్ క్షిపణులతో మెరుపుదాడులు?

పాక్‌కు చెందిన 10-12 నౌకలు ధ్వంసం.. 1971 పునరావృతం?

గోడ దెబ్బ.. చెంప దెబ్బ.. ఒకేసారి గట్టిగా.. ఘాటుగా తగిలితే! పాకిస్థాన్ పరిస్థితి ఇప్పుడు ఇదే! పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలనే భారత సైన్యం ధ్వంసం చేసింది! పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగానే దాడులు చేశామని స్పష్టం చేసింది! అయినా.. పాకిస్థాన్ కయ్యానికి సై అంది! సమరానికే సిద్ధమంది! యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతూ.. మన సైనిక స్థావరాలు, పౌర ఆవాసాలపై గురి పెట్టింది! బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచే.. భారత్‌లోని 15 నగరాల్లోని సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడికి విఫల యత్నం చేసింది! ఆ దాడులను మన 'సుదర్శన చక్రం' (ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్) తుత్తునియలు చేసింది! ప్రతిగా.. లాహోర్ సహా పాకిస్థాన్‌కు చెందిన తొమ్మిది ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలపై భారత్ భీకర దాడులు చేసింది. దాంతో, మరింత రెచ్చిపోయిన పాకిస్థాన్.. డ్రోన్లు, రాకెట్ల వర్షం కురిపిస్తోంది! భారత్ వాటన్నిటినీ గాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేస్తోంది! వెరసి, సరిహద్దు గ్రామాల్లో ఇప్పుడు యుద్ధ వాతావరణం నెలకొంది! దీంతో, అటు పాకిస్థాన్, ఇటు భారత్‌తో అమెరికా సంప్రదింపులు జరిపింది. ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని సూచించింది! ఆ చర్చలు విఫలమైన మరు క్షణంలోనే పాకిస్థాన్‌కు చావు దెబ్బ తప్పలేదు! అటు క్వెట్టాను బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ స్వాధీనం చేసుకుంది. దాంతో, అక్కడి నుంచి పాక్ ఆర్మీ పలాయనం చిత్తగిస్తోంది! ఆ వెంటనే.. కరాచీ పోర్టుపై భారత నావికా దళం భీకర దాడి చేసింది! అరేబియా సముద్రంలో ఉన్న ఐఎన్ఎస్ విక్రాంత్ గ్రూపు నుంచి బ్రహ్మోస్ క్షిపణుల వర్షం కురిపించింది! ఇరు దేశాల మధ్య ఇక.. సమరమే!!

న్యూఢిల్లీ, మే 8: యుద్ధం మొదలైంది! పాకిస్థాన్ వాణిజ్యానికి అత్యంత కీలకమైన కరాచీ పోర్టుపై భారత నావికా దళం భీకర దాడి చేసింది. అరేబియా సముద్రంలోని ఐఎన్ఎస్ విక్రాంత్ బ్యాటిల్ గ్రూప్ నుంచి బ్రహ్మోస్ క్షిపణుల వర్షం కురిపించింది. ఈ దెబ్బకు పోర్టు మంటల్లో చిక్కుకుంది. అక్కడి 10-12 భారీ నౌకలు ధ్వంసమయ్యాయి. 1971 తర్వాత కరాచీ పోర్టుపై భారత్ దాడి చేయడం ఇదే తొలిసారి. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత వార్తా కథనాలు వెలువడ్డాయి. దీనికి సంబంధించి అటు పాక్, ఇటు భారత సైనిక వర్గాల నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. కానీ, నావికా దళంలోని ఉన్నతస్థాయి వర్గాలను ఉటంకిస్తూ పలు టీవీ చానళ్లు, వెబ్‌సైట్లు కథనాలను ప్రసారం చేశాయి. అలాగే, పాకిస్థాన్‌లోని కీలక నావికా స్థావరాలపైనా భారతీయ నావికా దళం దాడులు చేసినట్లు సమాచారం. ఓవైపు.. అత్యంత కచ్చితత్వంతో ఉగ్ర స్థావరాలపై దాడులు చేసిన భారతీయ వైమానిక దళం.. ఆ తర్వాత పాకిస్థాన్ రాకెట్, డ్రోన్ దాడులనూ సమర్థంగా అడ్డుకుంటోంది. తాజాగా, భారత నావికా దళం కూడా రంగంలోకి

మిగతా 11వ పేజీలో...



ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రతీకాత్మక చిత్రం



పాక్ చేజారిన క్వెట్టా నగరం?

బలూచ్ లిబరేషన్ ఆర్మీ చేతికి?

భారత్‌తో యుద్ధమే అదనుగా రెచ్చిపోయిన బలూచ్ వేర్పాటువాదులు

పాక్ ఆర్మీపై భీకర దాడులు

క్వెట్టా వదిలి పరారవుతున్న పాక్ సైన్యం



బలూచ్ లిబరేషన్ ఆర్మీ నేత బషీర్ జైబ్

యుద్ధ బీభత్సం!

బుధవారం అర్ధరాత్రి నుంచి భారత్‌పై పాక్ దాడులు

క్షిపణులు, డ్రోన్లతో 15 నగరాలపై గురి

సైనిక స్థావరాలను ధ్వంసం చేసే ప్రయత్నం

తిప్పికొట్టిన భారత గగనతల రక్షణ వ్యవస్థ

ఎస్400, ఇతర వ్యవస్థలతో పాక్ క్షిపణుల కూల్చివేత

పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని

డ్రోన్లు, క్షిపణులతో ప్రతీకార దాడికి దిగిన భారత్

లాహోర్, కరాచీ, రావల్పిండి సహా 9 నగరాలపై గురి

సియాల్‌కోట్, లాహోర్‌లో ఎయిర్ డిఫెన్స్ ధ్వంసం!

రెచ్చిపోయిన పాక్.. సరిహద్దుల్లో డ్రోన్లు, రాకెట్ల వర్షం

జమ్ము, పఠాన్‌కోట్, ఉధంపూర్‌లో పేలుళ్లు, సైరన్లు

అమృత్‌సర్ సహా పలు నగరాల్లో కమ్ముకున్న చీకట్లు


పహల్గాం దాడితో ఉద్రిక్తతలకు తెరలేపింది పాకే!

భారత్ దాడులు కేవలం ప్రతిస్పందన మాత్రమే

ఉగ్రవాదులకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలా?: విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ

జమ్మూ, శ్రీనగర్, చండీగఢ్, మే 8: భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం! సైరన్లు మోగుతున్నాయి! సరిహద్దు ప్రాంతాల్లో చిమ్మ చీకట్లు కమ్ముకున్నాయి! ఉగ్ర స్థావరాలపై భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ దాడిని జీర్ణించుకోలేని పాకిస్థాన్.. సరిహద్దు ప్రాంతాలపై రాకెట్లు, డ్రోన్ల వర్షం కురిపిస్తోంది. భారత్‌కు చెందిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు వీటిని సమర్థంగా, సంపూర్ణంగా అడ్డుకుంటున్నాయి. పఠాన్‌కోట్, జమ్మూ నగరం, ఉధంపూర్‌లో మూడు పాక్ డ్రోన్లను భారత గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయి. జమ్ము యూనివర్సిటీ వద్ద రెండు డ్రోన్లను కూల్చివేశాయి. అలాగే.. సత్వారీలోని జమ్మూ విమానాశ్రయం సహా సరిహద్దు ప్రాంతాలే లక్ష్యంగా గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ పాకిస్థాన్ ఎనిమిది క్షిపణి దాడులు చేసింది. వీటిని భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు సమర్థంగా అడ్డుకున్నాయని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. హమాస్ ఉగ్ర సంస్థ తరహాలో 'చవకబారు' రాకెట్లను ప్రయోగిస్తోందని, సత్వారీ (జమ్మూ విమానాశ్రయం), సాంబ, ఆర్ఎస్ పుర, అర్నియా తదితర

మిగతా 11వ పేజీలో...



భారత ఎస్400 క్షిపణి వ్యవస్థ

3 పాక్ విమానాల కూల్చివేత

రెండు జేఎఫ్17 విమానాలు కూలిపోయాయి.. పాక్ అంగీకారం

ఎఫ్ 16ను కూడా కూల్చిన భారత్.. ప్రముఖ మీడియా సంస్థల కథనాలు

భారత్ చేతికి చిక్కిన జేఎఫ్17 పైలట్.. పలు డ్రోన్లు కూడా కూల్చివేత



న్యూఢిల్లీ, మే 8: ఉద్రిక్తతల వేళ భారత సైన్యం దీటుగా స్పందిస్తోంది. సరిహద్దు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో దాడులకు యత్నించిన పాకిస్థాన్‌కు గట్టిగా బదులిస్తోంది. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు చెందిన రెండు జేఎఫ్-17 ఫైటర్ జెట్ విమానాలను, ఒక ఎఫ్-16 జెట్ విమానాన్ని గగనతల రక్షణ వ్యవస్థతో కూల్చేసింది. రాజస్థాన్‌లోని లాఠీ ప్రాంతంలో కూల్చేసిన జేఎఫ్-17 ఫైటర్ జెట్ పైలట్‌ను భారత సైన్యం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తమ దేశానికి చెందిన రెండు జేఎఫ్-17 ఫైటర్ జెట్ విమానాలను భారత్ కూల్చేసిందని పాక్ సైన్యం కూడా అంగీకరించింది. పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి ఈ విషయాన్ని నిర్ధారిస్తూ ప్రకటన చేశారు. పాక్‌కు చెందిన అనేక డ్రోన్లను కూడా భారత్ కూల్చివేసినట్లు సమాచారం.

పాక్ క్షిపణులపై సుదర్శన చక్రం

ఎస్400లతో అడ్డుకున్న భారత్

సమగ్ర కథనాలు 11, 12, 13లో

గంగోత్రికి వెళ్తూ కూలిన హెలికాప్టర్

అనంత టీడీపీ ఎంపీ సోదరి దుర్మరణం

మరో ఐదుగురు కూడా...

ఆమె భర్తకు తీవ్ర గాయాలు

3



మూడు ముక్కలాటకు ఇక చెల్లు!

అమరావతే ఏకైక శాశ్వత రాజధాని


విభజన చట్టంలో చేర్చాలని కేంద్రానికి వినతి

సెక్షన్-5ను సవరించాలని అభ్యర్థన

సదరు తీర్మానానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం

రాజధాని పునర్నిర్మాణ పనులను ప్రారంభించిన ప్రధానికి ధన్యవాదాలు

2



రాజధానిపై వైసీపీ దుష్ప్రచారం

ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతోంది.. బలంగా తిప్పికొట్టాలి

అమరావతి స్వయంసమృద్ధి నగరం.. కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు

నూతన పోప్‌గా రాబర్ట్ ప్రివోస్ట్

చరిత్రలో తొలిసారి ఓ అమెరికన్ ఎన్నిక

13



మద్యం స్కామ్‌పై ఈడీ కేసు

హవాలా గుట్టు తేల్చేందుకు రంగంలోకి..

అప్పట్లో దుబాయ్, ఆఫ్రికాకు సొమ్ములు

షెల్ కంపెనీల్లోకి భారీగా డబ్బు మళ్లింపు

వీటన్నింటి 'లెక్క' తేల్చనున్న కేంద్ర సంస్థ

కేసును వేగంగా ఛేదిస్తున్న సిట్

33 మందిని నిందితులుగా తేల్చిన వైనం

మద్యం కేసు వివరాలివ్వాలంటూ సిట్‌కు ఈడీ రహస్య లేఖ

14

సంచలన చర్యలకు రంగం సిద్ధం!

తాడేపల్లి ప్యాలెస్‌కు ఇక వణుకే

మీ రక్షణ మీరే చూసుకోండి

మధ్యంతర రక్షణ కల్పించడం కుదరదు

ఆ ముగ్గురికీ సుప్రీంలో చుక్కెదురు

ముందస్తు బెయిల్‌కు నిరాకరణ

కేసు విచారణ 13కి వాయిదా

గ్రూప్-1 పేపర్లు 'దిద్దిన' వెల్డర్!

మూల్యాంకనం చేసినట్లు పేపర్‌పై సంతకం

ఏపీపీఎస్సీ సిబ్బంది మెడకు 'పునఃపరిశీలన'

రీచెక్ చేయకుండానే సంతకం పెట్టి, స్టాంపు

ఐదుగురి అరెస్టుకు పోలీసులు సన్నద్ధం



ఎల్జీ ప్రతినిధులతో కలిసి భూమి పూజలో పాల్గొన్న మంత్రి లోకేశ్

ఏపీలో ఎల్జీ అడుగు

రూ.5 వేల కోట్లతో భారీ పరిశ్రమ ఏర్పాటు

శ్రీసిటీలో యూనిట్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన

రాష్ట్ర భవిష్యత్‌కు పునాదులు.. ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్‌గా ఏపీ

మేడిన్ ఆంధ్రా నుంచి మేడ్ ఫర్ వరల్డ్ వరకు జైత్రయాత్ర

యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం: లోకేశ్

8

చంద్రబాబు సహకారంతో ఏపీకి కొరియా కంపెనీలు

గతంలో కియ, ఇప్పుడు ఎల్జీ రాక: కొరియా రాయబారి

తయారీ పరిశ్రమలకు హబ్‌గా ఏపీకి ఇది ప్రారంభం: సీఎం

దానిని బలంగా తిప్పికొట్టాలి.. అమరావతి స్వయంసమృద్ధి నగరం.. రాష్ట్రానికి ఆదాయ వనరు ఉద్యోగావకాశాల గని కూడా

ఇతర ప్రాంతాల నిధులు మళ్లించాల్సిన అవసరమే లేదు

ప్రొటోకాల్‌పై అధికారులు దృష్టి పెట్టాలి

ప్రధాని సభలో డిప్యూటీ సీఎంకు సీటింగ్ సరిగా లేదు

జిల్లాల అభివృద్ధిలో మంత్రులు, ఎమ్మెల్యేలు భాగస్వాములవ్వాలి

పీ-4ను వినియోగించుకోండి కేబినెట్ భేటీలో సీఎం సూచన

రాజధానిపై వైసీపీ దుష్ప్రచారం



గురువారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు

ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతోంది: చంద్రబాబు

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో విద్వేషాలను రెచ్చగొట్టేలా వైసీపీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు మంత్రివర్గ సహచరులకు సూచించారు. గురువారం సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో.. అమరావతిపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారం.. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలపై చర్చ జరిగింది. అమరావతి అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చిస్తూ మిగిలిన ప్రాంతాలను విస్మరిస్తున్నారన్న ప్రచారాన్ని బలంగాతిప్పికొట్టాలని చంద్రబాబు సూచించారు. 2014-19 మధ్య కూడా వైసీపీ నేతలు ఇదే తరహాలో ప్రచారం చేశారని, ఆనాడు ఆ ప్రచారాన్ని సరిగా తిప్పికొట్టలేకపోయామన్నారు. అమరావతి స్వయంసమృద్ధి నగరమని, దానికి ఇతర ప్రాంతాల నిధులు మళ్లించాల్సిన అవసరం లేదన్న విషయాన్ని జనంలోకి తీసుకెళ్లాలని తెలిపారు. అమరావతి నిర్మాణ దశ నుంచే రాష్ట్రానికి ఆదాయ వనరుగా మారుతుందని.. ఉద్యోగవకాశాల గనిగా మారుతుందనే విషయాలను వారికి స్పష్టం చేయాలన్నారు. అమరావతి నిర్మాణ వ్యయంలో అధిక శాతం రాజధాని భూముల నుంచే సమకూరుతుందని, ఇతర ప్రాంతాల నిధులను మళ్లించాల్సిన అవసరం లేదనే అంశాన్ని అర్థమయ్యేలా వివరించాలని సీఎం కోరారు.

ప్రొటోకాల్‌పై దృష్టి పెట్టండి

ముఖ్యమైన అధికారిక కార్యక్రమాల్లో తలెత్తుతున్నప్రొటోకాల్ ఇబ్బందులపై కేబినెట్‌లో చర్చ జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఈ సమస్య లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ప్రధాని మోదీ హాజరైన సభావేదికపై కేంద్రమంత్రులు ఓవైపు.. రాష్ట్రమంత్రులు ఇంకోవైపు కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లు చేసి ఉండాల్సిందని.. అలా చేయకపోవడంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంత్రుల మధ్యలో కూర్చోవలసి వచ్చిందని తెలిపారు. ప్రధానికి చెరోవైపు గవర్నర్, సీఎం కూర్చోగా.. చంద్రబాబు పక్కన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఆయన పక్కన పవన్ కూర్చున్నారు. ఉపముఖ్యమంత్రి తన పక్కనే కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లు ఉండాల్సిందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు.

పథకాల పేర్లూ జనంలోకి వెళ్లాలి

ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పెద్దఎత్తున పథకాలను అమలుచేస్తున్నా వాటిపేర్లు ప్రజల్లోకి వెళ్లేలా లేవని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. పథకాల పేర్లు ఆకర్షణీయంగా.. ఆకట్టుకునేలా ఉంటే ఎలాంటి ప్రచారం లేకున్నా ప్రజల్లోకి వెళ్తాయని వ్యాఖ్యానించగాసీఎం, మంత్రులు ఏకీభవించారు. ఉగ్ర శిబిరాలపై దాడికి 'ఆపరేషన్ సిందూర్' పేరు చాలా బాగుందని, ప్రజల మూడ్‌ను.. సెంటిమెంట్‌ను టచ్ చేసేలా ఉందని కేబినెట్ ఏకగ్రీవంగా అభిప్రాయపడింది. మంత్రులు, ఎమ్మెల్యేలు పీ4 కార్యక్రమంపై దృష్టి సారించాలని సీఎం సూచించారు. దీనిని వారి వారి జిల్లాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. పేదకుటుంబాలను పైకి తీసుకురావడానికే కాకుండా జిల్లాల్లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికీ వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లాల అభివృద్ధిలో మంత్రులు, ఎమ్మెల్యేలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసి, మౌలిక వసతులు కల్పిస్తామని.. అక్కడకు పరిశ్రమలను తీసుకొచ్చే బాధ్యతను వారు తీసుకోవాలని సూచించారు.

లోకేశ్ కార్యక్రమంపై చర్చ

మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి లోకేశ్ చేపట్టిన 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. పేదలకు ఇంటి హక్కు కల్పించేలా చేపట్టిన ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపడితే బాగుంటుందని సీఎం అన్నారు. పేదలకు ఆస్తి హక్కు కల్పించే ఇలాంటి కార్యక్రమాలపై మంత్రులు దృష్టి సారించాలని సూచించారు.

మూడు ముక్కలాటకు ఇక చెల్లు!

ప్రభుత్వం మారినప్పుడల్లా రాజధాని మారుస్తామనకుండా.. ఆ పేరుతో మూడు ముక్కలాట ఆడకుండా అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అమరావతినే ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక, శాశ్వత రాజధానిగా పేర్కొంటూ రాష్ట్ర విభజన చట్టాన్ని సవరించాల్సిందిగా కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం తీర్మానం ఆమోదించింది. కేంద్రం ఈ దిశగా చర్యలు తీసుకుంటే.. రాష్ట్రానికి చట్టబద్ధమైన రాజధానిగా అమరావతి ఆవిర్భవిస్తుంది. విభజన చట్టం-2014లోని సెక్షన్-5, సబ్‌సెక్షన్-2లో.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు హైదరాబాద్ పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని, ఆ తర్వాత తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా ఉంటుందని.. ఏపీకి కొత్త రాజధాని ఏర్పాటవుతుందని పేర్కొన్నారు. కేంద్రం ఏపీ కొత్త రాజధాని అమరావతి అని పేర్కొంటూ సదరు సెక్షన్‌ను సవరిస్తే అమరావతి చట్టబద్ధమవుతుంది. రాజధాని మార్పు నాటకాలకు దాంతో తెరపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. దీనిపై ఇప్పుడు కేబినెట్‌లో చర్చించి తీర్మానం ఆమోదించారు. అలాగే అమరావతికి వచ్చి రాజధాని పున్నర్నిర్మాణ పనులను ప్రారంభించిన ప్రధాని మోదీకి మంత్రిమండలి ధన్యవాదాలు తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు తెలిపారు. 'గత ఐదేళ్లలో ఏపీ రాజధాని ఏదీ అనడిగితే చెప్పలేని దౌర్భాగ్య పరిస్థితి ఉన్న విషయం తెలిసిందే. వాళ్ల ఇష్టం వచ్చినట్లు 3రాజధానులు, రకరకాల పేర్లు పెట్టి ఏ రాజధానినీ నిజం చేయలేదు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి తలెత్తకూడదనే ఉద్దేశంతో.. రాష్ట్రానికి గర్వించదగిన రాజధానిని నిర్మించాలని సీఎం సంకల్పించారు. అమరావతిని రాజధానిగా పేర్కొంటూ కేంద్రం సదరు చట్టంలో సవరణ చేయాలనే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇక భవిష్యత్‌లో ఎవరూ రాజధానితో పిచ్చి ఆటలు ఆడకుండా, ప్రజల్లో గందరగోళం సృష్టించకుండా ఉండడానికి ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాం' అని కొలుసు వివరించారు.

చిన్న, మధ్య తరహా కాలువల నిర్వహణకు టెండర్లు

» 344 కోట్లతో పిలిచేందుకు మంత్రివర్గం ఓకే

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చిన్న, మధ్యతరహా ఇరిగేషన్ కాలువల యాజమాన్య నిర్వహణ కోసం రూ.344.39కోట్ల అంచనా వ్యయంతో స్వల్పకాలిక టెండర్లు పిలిచేందుకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. సాగునీటి సంఘాల ద్వారా రూ.పది లక్షలలోపు పనులననామినేషన్ విధానంలో చేసుకోవచ్చని.. రూ.పది లక్షలు దాటిన పనులకు ఏడు రోజుల వ్యవధిలో షార్ట్‌టెర్మ్ కింద టెండర్లు పిలవాలని జల వనరులశాఖ గతంలో మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిప్రకారం వర్షాకాలంలోపు సాగునీటి కాలువల అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.344.39 కోట్లు ఇవ్వాలని ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపింది. అయితే ఈ సంవత్సరం 150కోట్లతో సరిపెట్టుకోవాలని.. మిగతా మొత్తాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసుకోవాలని ఆ శాఖ సూచించింది. నిధులు పొదుపుగా వాడుకోవాలంటూ ఉచిత సలహాలు ఇచ్చింది. దీంతో విసిగిపోయిన జలవనరుల శాఖ చంద్రబాబుకు ఫిర్యాదు చేసింది. సదరు ఫైలును కేబినెట్ ముందుకు తీసుకురావాలని ఆయన ఇటీవల ఆదేశించారు. దరిమిలా మీడియం, మైనర్ ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు రూ.344.39 కోట్లు విడుదల చేయాలని ఆ శాఖ మంత్రివర్గాన్ని ఆశ్రయించగా.. ఆమోదం తెలిపింది. అలాగే చెరువులు, కుంటల్లో మట్టిని రైతులు సొంత వినియోగానికి ఉచితంగా తవ్వుకునేందుకూ ఆమోద ముద్ర వేసింది.

కాంట్రాక్టు సంస్థల బ్లాక్ పీరియడ్ పదేళ్లకు పెంపు..

పనులు చేయని కాంట్రాక్టు సంస్థల బ్లాక్ పీరియడ్‌ను పదేళ్లకు పెంచుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. జగన్ హయాంలో అభివృద్ధి కార్యక్రమాలేవీ చేపట్టలేదు. పనులకు టెండర్లు పిలవలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనుల టెండర్లలో కాంట్రాక్టు సంస్థలు పాల్గొనాలంటే.. గడచిన ఐదేళ్లలో (2019-24 మధ్య) చేసిన పనులు, అనుభవం, ఆర్థిక లావాదేవీల సమాచారం ఇవ్వాలి. ఆ ఐదేళ్ల కాలాన్ని బ్లాక్ పీరియడ్‌గా పేర్కొంటారు. గత ఐదేళ్లలో పనులు జరుగకపోవడంతో కాంట్రాక్టు సంస్థలు సదరు ఆర్థిక వివరాలను ఇవ్వలేకపోతున్నాయి. ఫలితంగా పెద్ద పెద్ద కాంట్రాక్టు సంస్థలు కూడా అనర్హత జాబితాలోకి వెళ్లిపోతున్నాయి. దీంతో.. జల వనరుల శాఖ 2014 నుంచి చేసిన పనులు, అనుభవం చెప్పే వెసులుబాటు కల్పించాలని నిర్ణయించింది.

లోకం తీరు



ఉద్రిక్తతలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

అమరావతి/పొన్నూరు టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో శాంతి భద్రతలపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సమీక్షించారు. కేంద్ర హోంశాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు ఇంటెలిజెన్స్ చీఫ్, ఇతర సీనియర్ ఐపీఎస్‌లతో సమావేశమయ్యారు. తీరప్రాంతంలో పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలు, ప్రజల భద్రత, వీఐపీల రక్షణపై ఉన్నతస్థాయి సమీక్ష చేశారు. సీఎం చంద్రబాబు జిల్లాల పర్యటనల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, వీఐపీల ప్రొటోకాల్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అధికారులకు సూచించారు. ప్రజలు, వీఐపీలు, పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టుల రక్షణలో రాజీవద్దని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీలకు డీజీపీ ఆదేశాలిచ్చారు.

ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలి

ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న అన్ని హైఅలర్ట్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు హోంమంత్రి అనిత తెలిపారు. ప్రభుత్వానికి స్థానికులు కూడా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌పై భారతీయులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగానే ప్రధాని మోదీ ఆధ్వర్యంలో భారత సైన్యం ఈ ఆపరేషన్ చేపట్టి ఆత్మస్థైర్యం నింపిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో మహిళలు కూడా పాలు పంచుకోవడం గర్వంగా ఉందన్నారు.

రాజధానిలోకి మరో నాలుగు గ్రామాలు

» ఎన్టీఆర్ జిల్లా నుంచి ఎంపిక.. స్పోర్ట్స్ సిటీ కోసం నిర్ణయం

» భూములివ్వడానికి రైతుల ఆమోదం

విజయవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మాణం కోసం వేగంగా అడుగులు పడుతున్నాయి. కృష్ణానదిని ఆనుకుని ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న నాలుగు గ్రామాలను రాజధాని పరిధిలోకి తీసుకువచ్చేందుకు నిర్ణయించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని త్రిలోచనాపురం, మూలపాడు, కొటికలపూడి, జమీమాచవరం గ్రామాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాల పరిధిలో భూములను భూ సమీకరణ విధానంలో తీసుకునేందుకు వీలుగా గురువారం గ్రామసభలను నిర్వహించారు. నాలుగు గ్రామాల్లోని గ్రామసభల్లో రైతులు భూములు ఇవ్వటానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. స్పోర్ట్స్ సిటీ కోసం ఇంతకుముందు కృష్ణానదిలో ఉన్న చినలంక, పెదలంక దీవులను పరిశీలించారు. ఇవి వరదకు మునిగిపోయే అవకాశం ఉండటంతో వాటిని వద్దనుకున్నారు. వీటికి సమీపంలోనే ఉన్న నాలుగు గ్రామాలను ఎంపిక చేశారు. మూలపాడులో ఇప్పటికే రెండు క్రికెట్ స్టేడియాలు ఉన్నాయి. ఈ ప్రాంతం స్పోర్ట్స్ సిటీకి అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. మూలపాడు నుంచే అమరావతికి గ్రాండ్ ఎంట్రన్స్‌వే ఏర్పాటు చేయాలని, కృష్ణానది మీదుగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో ఈ నాలుగు గ్రామాలను ఎంచుకున్నట్లు సమాచారం. మూలపాడులోనే అంతర్జాతీయ క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా ఉన్నట్టుగా తెలిసింది.


ప్రయోజనకరమైన మద్యం పాలసీ

» మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ఉత్తమ మద్యం విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వం ఎక్సైజ్‌పై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. మంగళగిరిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో గురువారం మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. మంత్రులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, కొండపల్లి శ్రీనివాస్, గొట్టిపాటి రవికుమార్ ఈ సమావేశంలో పాల్గొని రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న ఎక్సైజ్ విధానంపై సమీక్షించారు. గతంతో పోలిస్తే మద్యం నాణ్యత పెరిగిందని, 99శాతం మంది వినియోగదారులు సంతృప్తిగా ఉన్నారని మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిపాదిత కొత్త బార్ పాలసీతోపాటు వివిధ విధాన ప్రతిపాదనలపై సుదీర్ఘంగా చర్చించారు. పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న మైక్రో బ్రూవరీ విధానాలపై సమీక్షించారు. మద్యంషాపుల లైసెన్సుదారులంద రూ మార్గదర్శకాలు పాటించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

గాలి శాసనసభ్యత్వం రద్దు

బళ్లారి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ కేసులో గాలి జనార్దన్‌రెడ్డికి నాంపల్లి సీబీఐ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించిన నేపథ్యంలో ఆయన శాసనసభ్యత్వం రద్దయింది. కొప్పళ జిల్లా గంగావతి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు కర్ణాటక విధాన సభ కార్యదర్శి ఎంకే విశాలాక్షి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రాజ్యాంగంలోని 191(1) అధికరణ, ప్రజాప్రాతినిధ్యం చట్టం(1951)లోని సెక్షన్ 8 ప్రకారం ఈ చర్య తీసుకున్నారు.



సైనికులకు సంఘీభావంగా న్యాయవాదుల ర్యాలీ

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్న సైనికులకు సంఘీభావంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం హైకోర్టు వద్ద ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి వద్ద ఉన్న 3 బిల్లులు ఉపసంహరణ

రాష్ట్రవ్యాప్తంగా పలు సంస్థలకు భూకేటాయింపులు

భీమిలిలో బీచ్ రిసార్ట్, కన్వెన్షన్ సెంటర్ కోసం టూరిజం అథారిటీకి 18.70 ఎకరాలు బదిలీ

అమరావతి, మే 8 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపిన మూడు బిల్లులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. పారిశ్రామిక వివాదాల సవరణ బిల్లు-2019, కార్మిక చట్టాల సవరణ బిల్లు-2019, ఫ్యాక్టరీల చట్టం సవరణ బిల్లు-2019ను ఉపసంహరించుకోవాలన్న ప్రతిపాదనలను ఆమోదించింది. వీటిని మళ్లీ కేంద్ర చట్టాల నిబంధనలకు అనుగుణంగా సవరించి కేంద్రానికి పంపనుంది. గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకం అమలుకోసం జలహారతి కార్పొరేషన్ పేరిట స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేస్తూ గత నెలలో జారీచేసిన జీవో 16లో సవరణలకు కూడా ఆమోదదముద్ర వేసింది. గురువారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు తెలియజేశారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు అందజేసే సాయాన్ని రూ.10 వేల నుంచి 20వేలకు పెంచుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.258.35 కోట్ల మేర లబ్ధి చేకూర్చే విధంగా జారీచేసిన జీవోను మంత్రిమండలి ఆమోదించిందని చెప్పారు. ఈ పథకం పేరును 'మెరైన్ ఫిషింగ్ బ్యాన్ రిలీఫ్'గా పునరుద్ధరించే ప్రతిపాదనను కూడా అంగీకరించిందన్నారు.

మరిన్ని నిర్ణయాలివీ..


- విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలం, అన్నవరం గ్రామంలో 18.70 ఎకరాల ప్రభుత్వ భూమిని బీచ్ రిసార్ట్, కన్వెన్షన్ సెంట ర్ నిర్మాణం కోసం ఏపీ టూరిజం అథారిటీకి బదిలీకి ఆమోదం.
- పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం చిత్తూరు జిల్లా కుప్పం మండలం పొలర్లపల్లె గ్రామ సర్వే నంబర్ 221లో 18.70 ఎకరాల ప్రభుత్వ భూమి ఏపీఐఐసీకి ఉచితంగా కేటాయింపు.
- అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ద్వారా 1,000 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు స్థాపించడానికి కడప జిల్లా కొండాపూర్ మండలం కె బొమ్మేపల్లిలో 41.64 ఎకరాలు, ఆ ప్రాంతంలోనే 191.64 ఎకరాల భూమిని నెడ్‌క్యాప్‌కు కౌలు ప్రాతిపదికన కేటాయింపు. ఎకరానికి ఏడాది రూ.31 వేలు. ప్రతి రెండేళ్లకు 5 శాతం పెంపు. లీజు గడువు 46 ఏళ్లు.
- కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్ర యానం గ్రామంలో 5 ఎకరాల ప్రభుత్వ భూమి బురద పీతల హ్యాచరీ స్థాపించడానికి ప్లూటస్ ఆక్వా ఎల్ఎల్‌పీకి కేటాయింపు. ఏడాదికి ఎకరానికి రూ.2.50 లక్షల లీజు. కాలపరిమితి 15 ఏళ్లు.
- కర్నూలు రూరల్ మండలం బి తండ్రపాడులో సర్వే నంబర్ 277/7బీలో ఒక ఎకరా95 సెంట్ల భూమిని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టు కోసం ఇవ్వడానికి ఆమోదం. ఎకరానికి రూ.61.23 లక్షలు చెల్లించాలి.
- టీటీడీ ఐటీ విభాగంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఐటీ) పోస్టును జనరల్ మేనేజర్ (ఐటీ)గా అప్‌గ్రేడ్ చేయడానికి ఆమోదం. టీటీడీలో అర్బన్ డిజైన్, ప్లానింగ్ (యూడీపీ) సెల్ ఏర్పాటు చేయడానికి, దానికి నూతనంగా 8 పోస్టుల కల్పనకు ఆమోద ముద్ర.
- ఏపీ పర్యాటక విధానాని(2024-29)కి అనుబంధంగా తీసుకొచ్చిన ఎంప్లాయిమెంట్ ఇన్‌సెంటివ్ పాలసీకి ఆమోదం.
- 2025-26లో కార్యక్రమాలు, ఈవెంట్ల నిర్వహణకు ఏపీ పర్యాటక అథారిటీకి గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద రూ.78 కోట్లు కేటాయింపు.
- కృష్ణపట్నంలోని దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్కేంద్రం ఆస్తులను నిరర్థక ఆస్తి (ఎన్‌పీఏ)గా ప్రకటించకుండా ఉండేందుకు ఏపీ జెన్‌కో రూ.650 కోట్లు మధ్యకాలిక రుణం.
- అమరావతిలో ప్యాకేజీ ఈ-15 రోడ్డు విస్తరణ మంగళగిరి పాత జాతీయ రహదారి వరకు (రూ.72.79 కోట్లు), ప్యాకేజీ ఈ-13 రోడ్ విస్తరణ (రూ.400.56 కోట్లు) పనులను ఎల్-1 బిడ్డర్లకు అప్పగించడానికి కార్యాదేశాలు జారీచేసే అధికారం ఏడీసీఎల్ ఛైర్‌పర్సన్-మేనేజింగ్ డైరెక్టర్‌కు అప్పగింత.
- ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులతో అమలవుతున్న రాజధాని నగర అభివృద్ధి కార్యక్రమంలో ప్యాకేజీ-43 కింద డిజైన్ నిర్మాణం, నిర్వహణ(డీబీవో) పద్ధతిలో పనులు చేపట్టడానికి, అదనపు అనుబంధ పనులు సహా నిర్వహణకు రూ.560.57 కోట్లు కేటాయించేందుకు పరిపాలనా మంజూరు. ప్యాకేజీ-44 కింద ఇతర అనుబంధ పనులు, ఏఐ ఆధారిత నీటి సరఫరా వ్యవస్థ మొదలైనవాటి నిర్వహణకు రూ.494.86 కోట్లు మంజూరు. ప్యాకేజీ 45 కింద జాతీయ రహదారి-16కి అనుసంధానమయ్యే ఇంటర్ చేంజ్‌తోపాటు వంతెనలు, అండర్‌పాస్‌లు, యుటిలిటీలతో కూడిన 6 లైన్ల ఎలివేటెడ్ కారిడార్‌తో ఈ-3 రోడ్డు విస్తరణ కోసం 593.03 కోట్లకు ఆమోదం.
- 'వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్, దాని కన్సార్టియం' బదులుగా 'వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్' పేరు మీద అమ్మకం ఒప్పందం కుదుర్చుకోవడానికి ఆమోదం.
- హయత్ బ్రాండ్‌తో అనుబంధం ఉన్న 'ఓం శ్రీ భావన సాయి అసోసియేట్స్ ఎల్ఎల్‌పీ' బదులుగా 'ఓం శ్రీ భావన సాయి అసోసియేట్స్' పేరు మీద అమ్మకం ఒప్పందానికి ఆమోదం.
- నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం రావూరులో ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా పారిశ్రామిక హబ్ నిర్మాణం కోసం జరుపుతున్న భూసేకరణకు పరిహారాన్ని ఎకరాకు మరో రూ.4 లక్షలకు పెంచుతూ నిర్ణయం. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా ఎకరాకు రూ.16 లక్షలు మాత్రమే ఉన్న పరిహారం రూ.20 లక్షలకు పెంపు. దీనివల్ల పారిశ్రామికవాడ ఏర్పాటు ఊపందుకుని పోర్టు ఆధారిత పరిశ్రమలు వస్తాయని.. ఉద్యోగావకాశాలు కూడా ఏర్పడతాయని.. ఈ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని కేబినెట్ పేర్కొంది.
- ఏపీ మారిటైమ్ బోర్డు పారిశ్రామిక ప్రయోజనాల కోసం వాడ్రేవుకు సమీపంలోని భూములను, బోర్డు సేకరించే ప్రక్రియలో ఉన్న భూములను, భవిష్యత్‌లో సేకరించబోయే భూములను, ప్రభుత్వ ఉప్పు భూములను ఏపీఐఐసీకి బదిలీకి ఆమోదం.
- నెల్లూరు జిల్లా నెల్లూరు బిట్-2 గ్రామంలోని సర్వే నంబర్ 2062-3లో గల 36 ఎకరాల భూమి వర్గీకరణను పెన్నానది పోరంబోకు నుంచి ఏడబ్ల్యూ డ్రై(అసెస్డ్ వేస్ట్ డ్రై)గా మార్చడానికి, కొత్త సర్వే నంబర్ 2224ని సృష్టించి భగత్ సింగ్ కాలనీ నివాసితులకు పట్టాలు మంజూరు చేసే సులభతర ప్రక్రియ చేపట్టేందుకు నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు అనుమతి మంజూరు.
- అమృత్-2.0 కింద పురపాలక సంస్థల్లో 281 మౌలిక వసతుల పనులను 'ఎస్ఎన్ఏ-స్పర్శ్' ప్లాట్‌ఫాం ద్వారా కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హామ్) కింద చేపట్టడానికి ఆమోదం.

ప్రజల సంతృప్తే ప్రధానం!

» రేషన్, దీపం-2, ధాన్యం సేకరణలో అవకతవకలకు ఆస్కారం ఉండొద్దు

» 15 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కొత్త కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

» పౌరసరఫరాల శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. రేషన్ సరుకులు, దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రజాపంపిణీ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలన్నారు. మొత్తంగా ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా సేవలందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థ పనితీరుపై సీఎం చంద్రబాబు గురువారం సమీక్ష నిర్వహించారు. రేషన్ కార్డుల్లో పేర్లు నమోదైనప్పటికీ జీఎస్‌డబ్ల్యూఎస్ డేటాలో లేని 79,173 మంది వివరాలపై పరిశీలన చేసి, సరిచేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇతర సేవల కోసం ఈనెల 15 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర) ద్వారా దరఖాస్తులు స్వీకరించి, సకాలంలో పారదర్శకంగా సేవలందించాలని సూచించారు. కాగా, 'రాష్ట్రంలో ప్రస్తుతం 1,46,21,223 రైస్ కార్డులు ఉండగా.. అందులో 4,24,59,028 మంది సభ్యులున్నారు. వీరిలో ఇప్పటి వరకు 3.94 కోట్ల మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 23 లక్షల మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది' అని అధికారులు సీఎంకు వివరించారు. గడచిన ఖరీఫ్ సీజన్‌లో 35.94 లక్షల టన్నులు, రబీలో 14.28 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించామని పౌరసరఫరాల అధికారులు సీఎంకు తెలిపారు. సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీకి సచివాలయాల ఇంజనీరింగ్ సిబ్బంది!

» ఏఈలుగా 304 మంది సేవల వినియోగానికి సీఎం గ్రీన్‌సిగ్నల్

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనేక కొత్త రహదారి ప్రాజెక్టులను చేపట్టిన రోడ్లు భవనాల శాఖలో సిబ్బంది కొరతను తీర్చాలని సర్కారు నిర్ణయించింది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న సివిల్ ఇంజనీరింగ్ సిబ్బందిని ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆర్‌అండ్‌బీలో అసిస్టెంట్ ఇంజనీర్ల(ఏఈల) కొరత తీవ్రంగా ఉంది. కనీసం 304 పోస్టులు తక్షణ అవసరమని సీఎం దృష్టికి ఆర్‌అండ్‌బీ తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న 304 మంది ఏఈలను ఆర్‌అండ్‌బీ ఉపయోగించుకొనేలా ముఖ్యమంత్రి అనుమతి ఇచ్చారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను త్వరలో ఖరారు చేయనున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ పనితీరుపై గురువారం సచివాలయంలో సీఎం సమీక్ష చేశారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీకి చేతినిండా పని ఉంది. రూ.860 కోట్లతో రహదారి మరమ్మతులు 97 శాతం పూర్తిచేశారు. కొత్తగా మరో రూ.3200 కోట్లతో రహదారి విస్తరణ, అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టబోతున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఏఈల కొరత తీవ్రంగా ఉందని సీఎంకు ఆ శాఖ నివేదించింది. సచివాలయాల ఇంజనీరింగ్ సిబ్బందిని ఆర్‌అండ్‌బీలో వినియోగించుకోవడం వల్ల క్షేత్రస్థాయి సిబ్బంది కొరత తగ్గుతుందని, ప్రాజెక్టులను వేగంగా చేపట్టవచ్చని సీఎం చెప్పారు. కాగా, రాష్ట్రంలో రహదారి మరమ్మతులు, విస్తరణ, అభివృద్ధి పనుల కోసం ఏటా ఆర్‌అండ్‌బీకి 2వేల కోట్ల నిధులివ్వాలని ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డి కోరారు.

నేడు అనంతలో సీఎం చంద్రబాబు పర్యటన

అనంతపురం. మే 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శుక్రవారం అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. వజ్రకరూరు మండలం ఛాయాపురంలో జరుగుతున్న హంద్రీనీవా కాలువ విస్తరణ, లైనింగ్ పనులను సీఎం పరిశీలిస్తారు. ఛాయాపురం గ్రామ ప్రజలతో ముఖాముఖి మాట్లాడతారు.

గంగోత్రికి వెళ్తూ కూలిన హెలికాప్టర్

- అనంత టీడీపీ ఎంపీ సోదరి దుర్మరణం
- మరో ఐదుగురు కూడా
- ఆమె భర్తకు తీవ్రగాయాలు



భాస్కర్, వేదవతి కుమారి దంపతులు (ఫైల్)


గుంతకల్లు, మే 8(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అనంతపురం టీడీపీ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోదరి వేదవతి కుమారి దుర్మరణం పాలయ్యారు. ఆమె భర్త ముప్పూరు భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను మెరుగైన చికిత్స కోసం రుషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. గురువారం ఉదయం ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం జరిగినపుడు హెలికాప్టర్‌లో కెప్టెన్‌తో సహా మొత్తం ఏడుగురు ఉన్నారు. వారిలో ఆరుగురు... కళా చంద్రకాంత్ సోనీ (61), విజయారెడ్డి (57), రుచి అగర్వాల్ (56), రాధా అగర్వాల్ (79), వేదవతి కుమారి (48), కెప్టెన్ రాబిన్ సింగ్ (60) మృతి చెందారు. మరణించిన వారిలో ముగ్గురు ముంబయికి చెందిన వారు. యూపీ, ఆంధ్రకు చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నారు. కెప్టెన్ గుజరాత్‌కు చెందిన వ్యక్తి. కాగా, ఎంపీ సోదరి కుటుంబం గుంతకల్లులో నివాసం ఉంటోంది. వేదవతి భర్త భాస్కర్ స్థానికంగా నర్సింగ్ హోం నిర్వాహకుడిగా సుపరిచితుడు. మూడు రోజుల క్రితం ఆ దంపతులు చార్‌దామ్ తీర్థయాత్రకు వెళ్లారు. వాళ్లు గంగోత్రికి హెలికాప్టర్‌లో బయలుదేరారు. ఆ హెలికాప్టర్ డెహ్రాడూన్‌లోని సహస్రధార హెలీప్యాడ్ నుంచి ఖర్సాలీ హెలీప్యాడ్‌కు గురువారం ఉదయం బయలుదేరింది. గంగోత్రికి వెళ్తుండగా ప్రతికూల వాతావరణంతో ఉదయం సుమారు 8.45 గంటలకు రుషికేశ్-గంగోత్రి జాతీయ రహదారిపై పడిన హెలికాప్టర్... 200-250 మీటర్ల లోతు లోయలోకి జారిపోయింది. ఈ ప్రమాదంలో భాస్కర్ ఒక్కరే తీవ్ర గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆయన కుమారుడు విక్కీ, భాస్కర్ కుమారుడు సాయి బెంగళూరు నుంచి విమానంలో హుటాహుటిన బయలుదేరారు. భాస్కర్ మరో కుమారుడు అభిషేక్, సమీప బంధువులు హైదరాబాద్ నుంచి విమానంలో వెళ్లారు. గాయపడిన భాస్కర్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

సూర్యలంక-వాడరేవు మధ్య బీచ్ కారిడార్!

- ప్రభుత్వానికి ఏపీ చాంబర్స్ ప్రతిపాదన

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా సూర్యలంక-ప్రకాశం జిల్లా చీరాల సమీపంలోని ఓడరేవు మధ్య ప్రత్యేక కోస్టల్ బీచ్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య(ఏపీ చాంబర్స్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు గురువారం రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌కు ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.సూర్యలంక-ఓడరేవు మధ్య సహజసిద్ధమైన తెల్లని ఇసుక తిన్నెలతో ఉన్న 20 కిలోమీటర్ల తీరప్రాంతం ఆతిథ్య పెట్టుబడులకు అనువుగా ఉందని, ప్రీమియం రిసార్ట్‌లకు హాట్‌స్పాట్‌గా మారుతుందని వివరించారు. ఇక్కడ బీచ్ రోడ్డును అభివృద్ధి చేసి పాండురంగాపురం బీచ్ మీదుగా విజయవాడ, హైదరాబాద్‌లకు అనుసంధానం చేస్తే అనేక హై-ఎండ్ రిసార్ట్‌లతో ఈ ప్రాంతం మినీ గోవాగా అవతరిస్తుందని తెలిపారు.

కమనీయం సత్యదేవుడి దివ్యకల్యాణం



అన్నవరం, మే 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దివ్యక్షేత్రంలో కొలువుదీరిన సత్యదేవుడి వార్షిక కల్యాణం గురువారం రాత్రి కనులపండువగా జరిగింది. సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను గ్రామోత్సవం అనంతరం రాత్రి 9 గంటలకు కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన వేదికపై దంపతులను.. మరో వేదికపై పెళ్లి పెద్దలైన సీతారాములను ఆశీనులు గావించి పండితులు కల్యాణతంతుకు శ్రీకారం చుట్టారు. సుముహూర్త వేళ జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని ఒకరి శిరస్సుపై ఒకరు ఉంచారు. స్వామి, అమ్మవారి మెడలో మూడుముళ్లు వేశారు. కల్యాణం వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలలనుంచి అధికసంఖ్యలో భక్తులు విచ్చేశారు.



సత్యదేవుడి కల్యాణోత్సవ దృశ్యం (ఇన్‌సెట్) విద్యుత్ వెలుగుల్లో అన్నవరం ఆలయం

ఎయిమ్స్‌లో బోన్‌మారో మార్పిడి

- మంగళగిరిలో త్వరలోనే అందుబాటులోకి
- రక్తమార్పిడి కోసం ల్యూకో డిప్రెషన్ ఫిల్టర్ల పంపిణీ
- విశాఖ కేజీహెచ్‌లో జెనెటిక్ టెస్టింగ్ సెంటర్
- రాష్ట్రంలో 2,129 మంది తలసీమియా చిన్నారులు
- 'ఆంధ్రజ్యోతి'తో ఎన్‌హెచ్‌ఎం కన్సల్టెంట్ సోనియా మోహన్



డాక్టర్ సోనియా మోహన్

గుంటూరు మెడికల్, మే 8 (ఆంధ్రజ్యోతి): తలసీమియా బాధితుల కోసం మంగళగిరి ఎయిమ్స్ (అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ)లో బోన్‌మారో మార్పిడి (బీఎంటీ) శస్త్ర చికిత్సలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నేషనల్ హెల్త్ మిషన్ ఏపీ స్టేట్ కన్సల్టెంట్ (బ్లడ్ సెల్ పెథాలజీ) డాక్టర్ సోనియా మోహన్ తెలిపారు. 'వరల్డ్ తలసీమియా డే'ను పురస్కరించుకొని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సోనియా మోహన్ కొద్దిసేపు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారం 2,129 మంది తలసీమియా వ్యాధిగ్రస్తులు ఉండగా, అర్హులైన 1,598 మంది నెలకు రూ.10 వేలు పెన్షన్ పొందుతున్నారని చెప్పారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సతో వ్యాధి నుంచి శాశ్వత విముక్తి కలిగించవచ్చన్నారు. దీని కోసం ఒక్కో రోగికి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ల ద్వారా 25 మంది బాధిత చిన్నారులకు స్క్రీనింగ్ జరిపి, ఏడుగురిని బీఎంటీ శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో వీరికి ఆపరేషన్లు జరుగుతాయని డాక్టర్ సోనియా మోహన్ తెలిపారు. న్యూఢిల్లీ, ముంబై, చెన్నై, లఖ్‌నవూ, లూధియానా, చండీగఢ్ వంటి నగరాల్లో 11 ఎంప్యానల్ ఆస్పత్రుల్లో మాత్రమే బీఎంటీ సర్జరీలు చేస్తున్నట్లు వివరించారు. మన రాష్ట్రంలో ప్రైవేటు వైద్య రంగంలో ఈ ఆపరేషన్లు చేస్తున్నారని, మంగళగిరి ఎయిమ్స్‌లో వీటిని తొలిసారిగా అందుబాటులోకి తెస్తున్నామని వెల్లడించారు.

రాష్ట్రంలో తొలి జెనెటిక్ టెస్టింగ్ సెంటర్ విశాఖలో

తలసీమియా బాధిత చిన్నారుల తల్లిదండ్రులకు మరుసటి సంతానానికి కూడా ఆ జబ్బు వస్తుందనే ఆందోళన సహజంగానే ఉంటుందని సోనియా మోహన్ తెలిపారు. గర్భస్థ శిశువుకు తలసీమియా ఉందో లేదో తెలుసుకొనేందుకు గర్భిణీకి ఉమ్మనీరు, బయాప్సీ పరీక్షలు చేస్తారని ఆమె వివరించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఈ పరీక్షలు అందుబాటులో లేవని, నేషనల్ సికిల్‌సెల్ ఎనీమియా ఎలిమినేషన్ ప్రోగ్రామ్ కింద విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో త్వరలోనే జెనెటిక్ టెస్టింగ్ సెంటర్ (సెంటర్ ఆఫ్ కాంపిటెన్స్)ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. తలసీమియా రోగులకు తరచూ రక్త మార్పిడి అవసరమని, అయితే దీనివల్ల పలురకాల వైరల్ ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంటుందని అన్నారు. దీన్ని నిరోధించేందుకు నేషనల్ హెల్త్ మిషన్ కింద ఏపీలో ప్రభుత్వాస్పత్రులకు ల్యూకో డిప్రెషన్ ఫిల్టర్లను సరఫరా చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ ఫిల్టర్లు తెల్ల రక్త కణాలను అడ్డుకొంటాయని సోనియా మోహన్ తెలిపారు.

జంట హత్యల కేసులో 11 మందికి జీవిత ఖైదు

- కర్నూలు కోర్టు సంచలన తీర్పు
- 2017లో చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య
- ఎనిమిదేళ్ల తర్వాత తుది తీర్పు
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు



ముద్దాయిలను పోలీస్ వాహనంలో జైలుకు తరలిస్తున్న దృశ్యం

కర్నూలు లీగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల క్రితం నాటి జంట హత్యల కేసులో కర్నూలు జిల్లా కోర్టు సంచలన తీర్పునిచ్చింది. వైసీపీ నాయకుడు, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భర్త కంగాటి లక్ష్మీనారాయణరెడ్డి అలియాస్ చెరుకులపాడు నారాయణరెడ్డి, అతడి అనుచరుడు బోయ సాంబశివుడుల జంట హత్యల కేసులో 11 మంది నిందితులపై జీవిత ఖైదు విధించింది. ఈమేరకు కర్నూలు ప్రిన్సిపల్ సెషన్స్ న్యాయాధికారి జి.కబర్థి గురువారం సంచలన తీర్పు చెప్పారు. 2017 మే 21న చెరుకులపాడు నారాయణరెడ్డి తన అనుచరులతో కలిసి ఓ వివాహానికి వెళ్తుండగా.. వెల్దుర్తి మండలం కృష్ణగిరి సమీపంలో కాపు కాసిన నిందితులు రెండు ట్రాక్టర్లలో మారణాయుధాలతో వచ్చి ఆయన ప్రయాణిస్తున్న కారును వెనుకవైపు, ముందు నుంచి ఢీ కొట్టారు. దీంతో కారు నుజ్జునుజ్జయింది. నిందితులు నారాయణరెడ్డిని బయటకు లాగి కొడవళ్లు, కత్తులతో నరికి, ఆపై నాటు బాంబులతో దాడి చేసి హత్య చేశారు. అదే కారులో ప్రయాణిస్తున్న అతని అనుచరుడు సాంబశివుడును కూడా నిందితులు మారణాయుధాలతో కిరాతకంగా హత్య చేశారు. నారాయణరెడ్డి కారు డ్రైవర్ గొల్ల కృష్ణమోహన్ ఫిర్యాదు మేరకు కృష్ణగిరి పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో 19 మందిపై చార్జ్‌షీటు దాఖలు చేశారు. వీరిలో ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, వాల్మీకి ఫెడరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మలపై ఇటీవల కోర్టు కేసును కొట్టివేసింది. ఇదే కేసులో ఏ4గా ఉన్న కోతుల రామాంజనేయులు కేసు విచారణలో ఉండగానే మృతి చెందాడు. మిగిలిన 16 మందిపై విచారణ చేపట్టగా తాజాగా ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. మిగిలిన 11 మంది నిందితులు కురువ రామాంజనేయులు, రామనాయుడు, కురువ రామకృష్ణ, కోతుల బాలు, కోతుల చిన్న ఎల్లప్ప, కోతుల పెద్ద ఎల్లప్ప, గంటల వెంకట్రాముడు, గంటల శ్రీను, బీసన్నగారి రామాంజనేయులు, లక్ష్మన్న కుమారుడు బీసన్నగారి రామాంజనేయులు, బీసన్నగారి పెద్ద బీసన్నలపై నేరం రుజువు కావడంతో వారికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ వెంకటరెడ్డి వాదనలు వినిపించారు. కాగా, జంట హత్య కేసులో 11 మందికి జీవిత ఖైదు పడిందని తెలియడంతో ఒక్కసారిగా కోర్టు ఆవరణ నిందితుల బంధువులు, కుటుంబీకుల రోదనలతో మార్మోగింది.

శ్రీవారి సేవలో జస్టిస్ లక్ష్మణరావు



తిరుమల ఆలయం ముందు జస్టిస్ లక్ష్మణరావు

తిరుమల, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుమలలో రాష్ట్రస్థాయి ఫుడ్ లాబొరేటరీ

- రూ.19.84 కోట్లు కేటాయిస్తూ నోటిఫికేషన్ విడుదల

తిరుమల, మే 8(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక ల్యాబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తిరుమలలో స్టేట్ ఫుడ్ లాబొరేటరీ ఏర్పాటుకు కేంద్ర సహాయంతో రూ.19.84 కోట్లు కేటాయించి గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. తిరుమలలో అన్నప్రసాదాల నాణ్యతను పరీక్షించేందుకు ప్రత్యేక విభాగం లేదని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగానే ఫుడ్ సేఫ్టీ నియమావళి పాటించేందుకు ప్రత్యేకంగా ఓ తనిఖీ వ్యవస్థ ఉండాలని టీటీడీ బోర్డు భావించి గతేడాది డిసెంబరులోనే తీర్మానంచేసి ప్రభుత్వానికి లేఖ పంపింది. దీనికి అనుగుణంగా 2024-25 ఆర్థిక సంవత్సరం కోసం భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)తో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న రూ.88.41 కోట్ల ఒప్పందంలో భాగంగా తిరుమలలో స్టేట్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్ కోసం రూ.19.84 కోట్లు కేటాయించింది. తిరుమలలోని టీటీడీ మార్కెటింగ్ గోదాం ఎదురుగా ఉన్న ఫ్లోర్ మిల్ ప్రాంగణంలో ఈ ప్రయోగశాల నిర్మాణం చేయనున్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమలకు 26.33 కోట్లు

- మొదటి క్వార్టర్ ఇన్సెంటివ్ నిధుల విడుదలకు అనుమతి

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆహార శుద్ధి పరిశ్రమలకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన ఇన్సెంటివ్ నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. నాలుగు సమాన త్రైమాసిక వాయిదాలలో ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించేందుకు 2025-26 బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయింపులు చేసింది. ఇందులో మొదటి క్వార్టర్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు రూ.18.75 కోట్లు, ఆక్వా ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లకు రూ.7.5 కోట్లు, నేషనల్ మిషన్ ఆన్ ఫుడ్ ప్రాసెసింగ్ రూ.8,33,750 కలిపి మొత్తం రూ.26,33,33,750 సర్దుబాటు చేయడానికి పరిపాలనపరమైన అనుమతినిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

పీసీబీలో అనధికార సభ్యుల నామినేషన్‌కు కమిటీ

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలిలో అనధికార సభ్యులను నామినేట్ చేసేందుకు ప్రభుత్వం అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా పీసీబీ సభ్య కార్యదర్శి, మత్స్య, పరిశ్రమలు, రవాణా శాఖల కమిషనర్లను నియవించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు ఉత్తరాంధ్రలో వడగాడ్పులు, వర్షాలు

అమరావతి, విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. శుక్రవారం 42-43.5 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. మన్యం జిల్లా పాలకొండ, తూర్పుగోదావరి జిల్లా గోకవరం, కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలాల్లో తీవ్రంగా, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని మరో 21 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు ప్రభావం చూపుతాయని పేర్కొంది. అలాగే అల్లూరి జిల్లాలో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది. గురువారం సాయంత్రం వరకు కాకినాడ జిల్లా కాజులూరులో 49.5, కడప జిల్లా బెస్తవేములలో 43, చిత్తూరు జిల్లా పెదపంజానిలో 39.7, కృష్ణా జిల్లా గుడివాడలో 21, అల్లూరి జిల్లా గంపరైలో 20.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పల్నాడు జిల్లా క్రోసూరులో 41.6, ప్రకాశం జిల్లా దరిమడుగులో 41.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రవేశ పరీక్షల సమయంలో అంతర్గత పరీక్షలు వాయిదా వేయండి

అమరావతి, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రవేశ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఆయా యూనివర్సిటీలు అంతర్గత పరీక్షలను వాయిదా వేయాలని ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 6 నుంచి జూన్ 13 వరకు వివిధ ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. ఆ సమయంలో అంతర్గత పరీక్షలు నిర్వహిస్తే ప్రవేశ పరీక్షలకు ఇబ్బంది అవుతుందని గుర్తించిన ఉన్నత విద్యాశాఖ అంతర్గత పరీక్షలను ఆ తర్వాత నిర్వహించుకోవాలని స్పష్టం చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రక్షాళన ప్రయత్నాలు

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ ఆస్తిపాస్తుల వివరాలను వెల్లడించి మంచిపనిచేశారు. ఏప్రిల్ 1న జరిగిన ఫుల్‌కోర్టు సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు, ముప్పైమూడు మంది న్యాయమూర్తుల్లో అత్యధికులు నెలరోజుల్లోనే ఆ వివరాలను ప్రధాన న్యాయమూర్తికి అందించారు. వాటిని సుప్రీంకోర్టు తన వెబ్ సైట్‌లో ఉంచి పారదర్శకతకు అగ్రప్రాధాన్యం ఇచ్చింది. ఒకరిద్దరివి తప్ప మిగతావారి వివరాలు అంత ఆకర్షించే రీతిలో ఏమీ లేవు. న్యాయమూర్తుల ఆస్తుల వివరాలు ఇలా ప్రజాక్షేత్రంలో ఉంచడంతో పాటు, గత రెండున్నరేళ్ళుగా హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన విస్తృత సమాచారాన్ని కూడా సర్వోన్నత న్యాయస్థానం బహిర్గతపరచింది. కొలీజియం విధానంలో అస్మదీయులకు అగ్ర తాంబూలం ఇస్తున్నారని, న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారితో పోస్టులు నింపేసుకుంటున్నారని ఇటీవల కొందరు నాయకులు దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ప్రజలకు నిజానిజాలు తెలియచేసే ప్రయత్నం ఇది.

పారదర్శకంగా వ్యవహరించడం ద్వారా న్యాయవ్యవస్థపై విశ్వాసం పెంచాలన్నది జడ్జీల ఆశయం. ఢిల్లీ హైకోర్టు జడ్జిగా విధులు నిర్వహించిన జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో ఇటీవల భారీమొత్తంలో నగదు లభ్యమై, న్యాయవ్యవస్థ విశ్వసనీయతమీద అనుమానాలు రేగిన నేపథ్యంలో ఈ స్వచ్ఛంద ఆస్తుల ప్రకటన జరిగింది. న్యాయమూర్తుల నియామకాలను కొలీజియం గుప్పిట్లోనుంచి తప్పించి, ఎన్‌జేఏసీ అధీనంలోకి తీసుకురావాలని మోదీ ప్రభుత్వం తన తొలివిడత పాలన తొలి ఏడాదిలోనే చేసిన ప్రయత్నానికి సుప్రీంకోర్టు అడ్డంకొట్టి పాలకపెద్దల ఆగ్రహానికి గురైంది. న్యాయవ్యవస్థ ఆత్మరక్షణలోకి జారిన ప్రతీ సందర్భంలోనూ బీజేపీ నాయకులంతా ఎన్‌జేఏసీని గుర్తుచేస్తూనే ఉన్నారు. జస్టిస్ వర్మ ఉదంతం వెలుగులోకి రాగానే ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఏ విధంగా స్పందించారో చూశాం. మొన్నటికి మొన్న బిల్లుల ఆమోదం విషయంలో సుప్రీంకోర్టు రాష్ట్రపతికి కాలపరిమితి విధించినందుకు ధన్‌ఖడ్, నిశికాంత్ దూబే వంటివారు అంతర్యుద్ధాలు, బ్రహ్మాస్త్రాలు ఇత్యాది పదజాలంతో అమితాగ్రహంతో ఊగిపోయారు. ఇటువంటి సంక్షోభాలను, సవాళ్ళను ఎదుర్కొంటూ, రాజ్యాంగాశయానికి అనుగుణంగా బలంగా నిలబడేందుకు సుప్రీంకోర్టు చేస్తున్న ప్రయత్నం ప్రశంసనీయమైనది.

సచ్ఛీలత, రుజువర్తన, ఉన్నత విలువలే న్యాయవ్యవస్థకు బలం. ప్రజాస్వామ్య మూలస్తంభాల్లో మిగతావాటి మాదిరిగా న్యాయవ్యవస్థ నియంత్రణలో ప్రత్యేక బలగాలు, యంత్రాంగాలు లేవు. అయినప్పటికీ, న్యాయవ్యవస్థపట్ల ప్రజల్లో విశ్వాసం, గౌరవం అధికంగా ఉండటానికి కారణం దాని నైతికతే. పేద, ధనిక భేదాలు లేకుండా సర్వులను సమానంగా చూస్తూ, బాధితులకు న్యాయం చేయాలన్న దాని ప్రతీ ప్రయత్నమూ ప్రజల్లో గౌరవాన్ని ఇనుమడింపచేస్తుంది. కొన్ని వివాదాస్పద కేసుల్లో ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు భిన్నంగా తీర్పులు వెలువడినప్పుడు ప్రజాగ్రహంతో పాటు అవినీతి ఆరోపణలను కూడా న్యాయవ్యవస్థ ఎదుర్కోవాల్సి రావచ్చు. రాజ్యాంగ విహితంగా వ్యవహరిస్తూ, ప్రభుత్వాల నిర్దాక్షిణ్యమైన చర్యలనుంచి పౌరులను, వారి హక్కులను పరిరక్షించినప్పుడల్లా న్యాయవ్యవస్థ కీర్తిప్రతిష్ఠలు పెరిగిపోవడం చూస్తూనే ఉన్నాం. అయితే, ఈ వ్యవస్థలో అవినీతి ఉన్నదని ఇప్పుడే కాదు, ఎప్పటినుంచో ఆరోపణలు ఉన్నాయి. సాక్షాత్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తే సగానికి సగం జడ్జీలు అవినీతిపరులని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అవినీతి అంటే కేవలం డబ్బుతో ముడిపడింది కాదు. మిగతా అన్ని రంగాల్లోనూ ప్రమాణాలు, నీతినియమాలు నశించిపోతున్న నేపథ్యంలో, ఈ వ్యవస్థ కూడా జారిపోకుండా కాపాడుకోవడం న్యాయమూర్తుల బాధ్యత. బురద అంటుతోందనీ, విశ్వాసం కరుగుతోందని తెలిసినా నిమ్మకునీరెత్తినట్టు ఉండిపోకుండా సమూల ప్రక్షాళనకు నడుంబిగించాల్సిన తరుణం ఇది. ఆస్తిపాస్తుల వివరాలను వెల్లడించడం ద్వారా తాను అందుకు సిద్ధపడుతున్న సంకేతాన్ని న్యాయవ్యవస్థ సమాజానికి ఇచ్చింది.

ఏ వెలుగులకీ లెక్కలు!

కొన్ని నిర్ణయాలను.. తాత్కాలిక ఆవేశంతోనో, స్పందనతోనో, చిరకాల కోరిక నెరవేరుతుందన్న ఆశావహ దృష్టితోనో చూస్తే చరిత్రాత్మకం అనిపిస్తాయి. సమకాలీన చరిత్రను కొత్త మలుపు తిప్పే శక్తి వాటికి ఉన్నదని భావించేలా మనపై ప్రగాఢ ముద్రవేస్తాయి. 14 ఏళ్ల కిందట సామాజిక, ఆర్థిక కులగణనను (ఎస్ఈసీసీ) చేపడతామని ఆనాటి యూపీయే ప్రభుత్వం ప్రకటించినప్పుడు అన్నిరంగాల్లో సామాజిక న్యాయం, రిజర్వేషన్ల పరిధి బాగా విస్తరించాలని కోరుకుంటున్న వారందరూ అలాగే భావించారు. కులగణన అనేది కులనిర్మూలనకు దారితీస్తుందని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్‌పాండే ఘనంగా ప్రకటించారు. మరో ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త గేల్ ఆమ్‌వెట్ సమానత్వానికి అవసరమైన విధానాల రూపకల్పనకు కులగణన ఎంత అవసరమో వివరించారు. దాన్ని వ్యతిరేకించే వారందరూ కళ్లముందున్న సామాజిక అసమానతలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కులగణన అనేది సంక్లిష్టమైనది కానేకాదనీ, ప్రతివ్యక్తి దగ్గరికి వెళ్లి నీ కులం ఏమిటి? అని అడిగి దాన్ని నమోదు చేస్తే సరిపోతుందనీ ఆమ్‌వెట్ సూచించారు. అట్లా సేకరించిన సమాచారాన్ని ఇతరత్రా వాటిని ఆధారం చేసుకుని నిపుణులు నింపాదిగా విశ్లేషణ చేసి వివిధ కులాల ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా ఏ వర్గానికి చెందుతారో నిర్ణయించవచ్చని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా చెప్పే కులాల పేర్లను జనాభా సేకర్తలు యథాతథంగా రాసుకోవాలనీ, ముందుగా నిర్దేశించుకున్న కొన్ని కేటగిరీల్లో చేర్చేలా ఫలానా విధంగా సమాచారం చెప్పాల్సిందిగా నిర్బంధం పెట్టకూడదని కూడా సూచించారు.

ఎన్నో తర్జనభర్జనల అనంతరం ఆనాడు సామాజిక, ఆర్థిక, కులగణను ఆమ్‌వెట్ లాంటి వాళ్లు సూచించిన పద్ధతిలోనే చేపట్టారు. 6.4 లక్షల 'టాబ్స్'తో 640 జిల్లాల్లో డిజిటల్‌గా సమాచారాన్ని సేకరించారు. జనాభా సేకరణ చట్టం పరిధిలో కాకుండా ఆ కులగణనను వేరుగా నిర్వహించారు. అందుకే జనాభా లెక్కలతో పాటు ఆ సమాచారాన్ని వెల్లడించలేదు. విడిగా కూడా కులాల సమాచారాన్ని బహిరంగపరచలేదు. అంతలోనే ఎన్నికలు వచ్చాయి. యూపీయే ప్రభుత్వం ఓడిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 2015లో పాక్షికంగా కొంత సమాచారాన్ని వెల్లడించింది. అది కూడా గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన ఆర్థిక సమాచారాన్ని మాత్రమే ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లోని 17.91 కోట్ల కుటుంబాల్లో 7.05 కోట్ల కుటుంబాలు ప్రభుత్వ చేయూత అవసరం లేనివిగా గుర్తించారు. 16 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ నిర్ణయానికి వచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితులపై 2011కు ముందు కూడా అవసరమైన సమాచారం ఉంది. కానీ దేశవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులను ఏకకాలంలో సర్వే చేయటంతో అంతకుముందు లేనంత స్థాయిలో సమగ్రంగానే సమాచారం లభ్యమైంది. కులగణన కోసం పట్టుపట్టిన వాళ్లకు ఆ సమాచారం సంతృప్తిని ఇవ్వలేదు. వెనుకబడిన కులాల జనాభా ఎంత ఉందో స్పష్టంగా వెల్లడి కావాలనీ దాంతో పాటు వారి విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక పరిస్థితి గురించి స్పష్టమైన గణాంకాలు ఉండాలనీ వారు కోరుకున్నారు. ప్రభుత్వం 2018లో వెల్లడించిన తుది నివేదికలో కూడా కులాల సమాచారాన్ని పొందుపర్చలేదు. రిజర్వేషన్ల కోసం మరాఠాలు చేస్తున్న ఆందోళనలతో సతమతమవుతున్న మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్రం తన వద్దనున్న కులాలవారీ గణాంకాలను ఇవ్వాలని కోరింది. కేంద్రం తిరస్కరించింది. దీంతో సుప్రీంకోర్టులో మహారాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలుచేసింది.

తన దగ్గరున్న కులాల సమాచారం చాలా గందరగోళంగా ఉందనీ, దానికి ప్రామాణికత లేదనీ కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహారాష్ట్రలో కులాలు 4,28,677గా తేలాయనీ, ఇక దేశవ్యాప్తంగా అవి 45 లక్షల దాకా నమోదయ్యాయని పేర్కొంది. గందరగోళాన్ని సృష్టించే అటువంటి సమాచారాన్ని వెల్లడి చేయలేమని తేల్చిచెప్పింది. అప్పటికి మహారాష్ట్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీల జాబితాలో 494 కులాలు మాత్రమే ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ ఈ తరహా జాబితాలు ఉన్నాయి. వాటిని ప్రాతిపదికగా తీసుకుని కులాల జనసంఖ్య లెక్కించినా కొంత ఫలితం ఉండేది. ఎవరికి వారు తమది ఫలానా కులమని చెబితే మారుమాట్లాడకుండా దాన్ని నమోదు చేయాలనే నిర్ణయం మొదటికే మోసం తెచ్చింది. ఈ పరిస్థితిని అధికార యంత్రాంగం ఎందుకు ఊహించలేకపోయిందన్నది ఇప్పటికీ జవాబులేని ప్రశ్నగానే మిగిలిపోయింది. రాష్ట్రాలవారీగా కులాలపై ఎన్నో అధ్యయనాలు అప్పటికే వెలువడిన నేపథ్యంలో ఇదెందుకు జరిగిందన్న విషయాన్ని కూడా ఎవరూ గట్టిగా లేవనెత్తలేదు. అప్పటి సర్వేని వేనోళ్ల పొగిడిన చాలామంది ఆ వైపరీత్యంపై మౌనం పాటించారు.



> ఈసారి చేపట్టబోయే జనాభా లెక్కల్లో కులాన్ని ఒక అంశంగా చేర్చినంత మాత్రాన అద్భుతాలు జరుగుతాయని చెప్పలేం. ప్రతి కులానికి సంబంధించి సమగ్ర సమాచారం సేకరించటమే లక్ష్యమైతే జనాభా సేకరణలో చాలా మార్పులను చేపట్టాల్సి వస్తుంది. ఆస్తులు, ఆదాయాలు, ఉద్యోగాలు, వ్యాపారాలు, హోదాల సమాచారాన్ని కచ్చితంగా సేకరించాలి. అట్లాంటి సమాచారాన్ని సాధారణ జనాభా లెక్కలతో పాటు సేకరించిన సందర్భం ఇప్పటివరకూ లేదు. 2011లో చేసిన కసరత్తు ఆశించిన ఫలితాన్నీ ఇవ్వలేదు. పోనీ సాధారణ జనాభాలెక్కల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించి సేకరిస్తోన్న సమాచారం మాదిరిగానే ఇతరకులాల విషయంలో జరిపితే లక్ష్యం నెరవేరుతుందని చెప్పలేం.



■ రాహుల్ కుమార్

కులాల లెక్కల విషయంలో ఆ గతం పునరావృతం కాకుండా ఏం చేయబోతున్నారన్న దానిపై ఇప్పటికైతే స్పష్టత లేదు. జనాభా సేకరణ చట్టాన్ని సవరించి కులాల లెక్కలను సాధికారికంగా తేల్చుతామని కేంద్రమంత్రుల నుంచి ప్రకటనలు మాత్రం వెలువడుతున్నాయి. ఆ లెక్కలు రాజకీయాల్లో పావులుగా మారకుండా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న కులగణన నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తన ఘనతగానే భావిస్తోంది. రాహుల్ గాంధీ చేసిన పోరాటంతోనే కేంద్రం దిగివచ్చిందనే ప్రచారాన్ని ముమ్మరం చేసింది. దాంతోనే ఆగలేదు. తెలంగాణలో తమ పార్టీ ప్రభుత్వం చేసిన కుల సర్వే సర్వసమగ్రమైందనీ దాన్ని దేశవ్యాప్తంగా అనుసరిస్తే అద్భుత ఫలితాలు వస్తాయని చెబుతోంది. తెలంగాణ కుల సర్వేలో వెల్లడైన విద్య, ఉద్యోగ, ఆర్థిక పరిస్థితులకు సంబంధించి కీలక సమాచారాన్ని బయటపెట్టకుండా అద్భుత ఫలితాల గురించి పదేపదే మాట్లాడటం అసంబద్ధంగా అనిపిస్తుంది. ఆ సమాచారం ఏమిటో తెలిస్తేనే దేశవ్యాప్తంగా అనుసరించతగ్గ నమూనాగా తెలంగాణ సర్వే పనికొస్తుందో లేదో చెప్పగలిగే అవకాశం ఉంటుంది.

ఈసారి చేపట్టబోయే జనాభా లెక్కల్లో కులాన్ని ఒక అంశంగా చేర్చినంత మాత్రాన అద్భుతాలు జరుగుతాయని చెప్పలేం. ప్రతి కులానికి సంబంధించి సమగ్ర సమాచారం సేకరించటమే లక్ష్యమైతే జనాభా సేకరణలో చాలా మార్పులను చేపట్టాల్సి వస్తుంది. ఆస్తులు, ఆదాయాలు, ఉద్యోగాలు, వ్యాపారాలు, హోదాల సమాచారాన్ని కచ్చితంగా సేకరించాలి. అట్లాంటి సమాచారాన్ని సాధారణ జనాభా లెక్కలతో పాటు సేకరించిన సందర్భం ఇప్పటివరకూ లేదు. 2011లో చేసిన కసరత్తు ఆశించిన ఫలితాన్నీ ఇవ్వలేదు. పోనీ సాధారణ జనాభాలెక్కల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించి సేకరిస్తోన్న సమాచారం మాదిరిగానే ఇతర కులాల విషయంలో జరిపితే లక్ష్యం నెరవేరుతుందని చెప్పలేం. ఉదాహరణకు 2011 నాటి జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ప్రతి కులం, తెగ విషయంలో సంఖ్యాపరమైన సమాచారం ఉంది. కానీ కులాలవారీగా ఆర్థిక, విద్యా, ఉద్యోగపరమైన సమాచారం లేదు. ఎస్సీల్లో డిగ్రీ ఎంత మంది చదివారో తెలుస్తుంది. ఎంతమంది నిరక్షరాస్యులు ఉన్నారో వెల్లడవుతుంది. ఎంతమంది భూమిలేని వారున్నారో కనుక్కోవచ్చు. ఎంతమంది ఏ వృత్తుల్లో ఉన్నారో కూడా అంచనాకట్టొచ్చు. కానీ ఏ కులం వాళ్లు నిర్దిష్టంగా ఎక్కడున్నారో తెలుసుకోలేం. ఎవరికి ఉద్యోగాలు ఎక్కువ ఉన్నాయో, ఎవరికి తక్కువ ఉన్నాయో తెలుసుకోలేం. స్థూల చిత్రమే తప్ప విడి కులం పరిస్థితి కనపడదు. జనాభా లెక్కల్లో అటువంటి నిర్దిష్ట కుల సంబంధిత సమాచారమే ఉండి ఉంటే ఎస్సీ వర్గీకరణ సమస్య అంత జటిలమయ్యేది కాదు. కళ్లముందు కనపడే వాస్తవాలతో ఎవరు ఎక్కడ ఉన్నారో తెలిసిపోయేది. వర్గీకరణ వివాదం ఎప్పుడో ముగిసేలా రాజకీయ ఒత్తిళ్లు వచ్చి ఉండేవి. న్యాయస్థానాలూ వాస్తవాలను తొందరగా పరిగణనలోకి తీసుకుని ఉండేవి!

పరిస్థితి ఇలా ఉన్న నేపథ్యంలో ఇతర కులాలకు సంబంధించి కూడా ఆ తరహా సమాచారాన్నే సేకరిస్తే అది పరిమితంగానే ఉంటుంది. దాన్ని సైతం చేపట్టకుండా కేవలం కులాలవారీ జనాభాను మాత్రమే లెక్కిస్తే అది మరింత పరిమితమైన ప్రయోజనాన్నే ఇస్తుంది. కీలక విషయాల్లో ఎవరు.. ఎక్కడున్నారో తెలియని పరిస్థితి వల్ల ఆశిస్తున్న మార్పులు వచ్చే అవకాశాలు తక్కువ. భవిష్యత్తులో రాజకీయ ప్రయోజనాలు ఎటువైపు లాగుతాయో చెప్పలేం. మార్గదర్శకాలు రూపొందితే గానీ స్పష్టత రాదు. అయితే పైన ప్రస్తావించిన రెండు మార్గాల్లో ఏదో ఒకదాన్ని అనుసరించే అవకాశాలే ఎక్కువ!

వలసపాలనలో కులాలు, తెగల వారీగా జరిగిన జనాభా లెక్కలకు అవసరానికి మించి ప్రాధాన్యతనూ, విపరీత శాస్త్రీయతను ఆపాదించటం ఇటీవల ఎక్కువైపోతోంది. కులం ఆధారంగా 1931లో జరిపిన జనాభా లెక్కలు చివరివే గానీ అవి సర్వసమగ్రమని చెప్పలేం. చాలా కులాలను అప్పుడు లెక్కించలేదు. కొన్ని కులాలను కలిపి చూపారు. పాలనా అవసరాల కోసం మార్పులూ చేర్పులూ చేశారు. 1921 నాటి లెక్కలతో పోల్చితే 1931లో మార్పులు కొట్టొచ్చినట్లు కనపడతాయి. 1931లో వృత్తుల ఆధారంగా కులాలను వర్గీకరించారు. 1891లో మొదటగా అలా చేశారు. మధ్యలో రెండు సార్లు వేరేరకంగా చేశారు. 1901లో అయితే కులాలకు ఎక్కువ తక్కువ హోదాలనూ సూచిస్తూ జాబితాను రూపొందించారు. విమర్శలు రావటంతో దాన్ని వదిలేశారు. కులాల జాబితాలు ఎలా మారిపోతాయో తెలుసుకోవాలంటే మద్రాసు రాష్ట్ర లెక్కలను బట్టి తేలికగా గ్రహించొచ్చు. 1931లో ఆ రాష్ట్రంలో 156 కులాలకు లెక్కలు ఇచ్చారు. 1921లో 351 కులాలవారీ జనాభాను ప్రచురించారు.

> కుల, మత అస్తిత్వాలనూ, ఆలోచనలనూ దాటలేని పరిస్థితే దేశంలో ఇంకా బలంగా ఉంది. ప్రజాస్వామ్యాన్ని కులలెక్కల ఆధారంగా పరిపుష్టం చేయాలన్న భావనపై జాతీయపార్టీలు ఏకాభిప్రాయానికి రావటమే ఇందుకు నిదర్శనం. 21వ శతాబ్దపు భారత విశిష్టతగా దాన్ని చెప్పుకోవచ్చు!


కులాలు, తెగలు, మత సమూహాలుగా మాత్రమే భారత ప్రజలను బ్రిటిషు పాలకులు ప్రధానంగా చూశారు. అందరినీ ఏకంచేసే జాతీయభావన భారత్‌లో లేదన్న ఆలోచనే బ్రిటిషు పాలకుల విధానాలను ప్రభావితం చేసింది. కులలెక్కలను కూడా ఆ దృష్టితోనే చేపట్టారు. ఆ లెక్కలు కులాలు సంఘటితం కావటానికీ, పదవుల కోసం పోటీపడటానికి దారితీశాయి. ఈ రెండు పరిణామాలు ఇప్పటికీ ఏదో రూపంలో కొనసాగుతున్నాయి. ఇవి మరింత ఉధృతం అవుతాయా లేదా అన్నది కులగణన ఫలితాలను, వాటి ఆధారంగా చేపట్టే విధానాలు బట్టి ఉంటుంది. కుల, మత అస్తిత్వాలనూ, ఆలోచనలనూ దాటలేని పరిస్థితే దేశంలో ఇంకా బలంగా ఉంది. ప్రజాస్వామ్యాన్ని కులలెక్కల ఆధారంగా పరిపుష్టం చేయాలన్న భావనపై జాతీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావటమే ఇందుకు నిదర్శనం. 21వ శతాబ్దపు భారత విశిష్టతగా దాన్ని చెప్పుకోవచ్చు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

జనగణన 'హోం' ఆధ్వర్యంలో ఎందుకు?

జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేపట్టాలని నిర్ణయం తీసుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అభినందించాలి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో జాతీయ భద్రత వ్యవహారాలలో తలమునకలై ఉండి కూడా కులగణనపై నిర్ణయం తీసుకోవడం ప్రధానమంత్రి విలక్షణ నాయకత్వ శైలికి ఒక తార్కాణం. జమిలి ఎన్నికల (లోక్‌సభ, శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం) విషయంలో వలే కాకుండా కులగణనపై అనూహ్య నిర్ణయం తీసుకోవడం ప్రశంసనీయం. ఈ నిర్ణయం ద్వారా, కులగణనపై భారతీయ జనతా పార్టీ వైఖరిలో ఒక సమూల మార్పు సంభవించినట్టు స్పష్టమయింది.

బ్రిటిష్ వలసపాలకులు 1872లో జనాభా లెక్కల సేకరణను ప్రారంభించిన నాటి నుంచి అందులో భాగంగా కుల జన గణన కూడా చేస్తూవచ్చారు. ఈ ఆనవాయితీ 1931 దాకా కొనసాగింది. ఆ తరువాత కులగణన ప్రక్రియ నిలిచిపోయింది. స్వతంత్ర భారతదేశంలో కూడా దానిని చేపట్టలేదు. ఇంచుమించు ఎనిమిది దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేపట్టడం ఇదే మొదటిసారి. స్వపరిపాలనలో భారతీయ సమాజంలో పెను మార్పులు సంభవించిన నేపథ్యంలో కులగణన అవసరమూ, ప్రాధాన్యమూ సంతరించుకుంది. ఇది ఎట్టకేలకు ఒక నిర్దిష్ట రూపం పొందనున్నది. చరిత్ర ముందుకు నడుస్తూనే ఉంటుంది కదా. జనాభా లెక్కల సేకరణ, కులగణన చాలా బృహత్ కార్యాలు. అంతేకాదు అవి బృహత్ బాధ్యతలు కూడా. అందునా ఏక కాలంలో నిర్వహిస్తున్నందున అవి పారదర్శకంగా జరగాలి. అది వాస్తవం కావాలంటే ఆ ప్రక్రియల నిర్వహణ వృత్తి నైపుణ్యంతో జరగవలసి ఉంటుంది. మరి ఈ కార్యనిర్వహణ ఏ మేరకు వృత్తి నిబద్ధతతో జరుగుతుందనే విషయమై సూచనలు స్పష్టంగా లేవు. 'ప్రభుత్వ సంక్షేమ ఎజెండాలో భాగంగా కులగణన' నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం ప్రకటించినందున అనుమానాలకు తావివ్వని రీతిలో ఆ ప్రక్రియను పూర్తిచేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనాభా లెక్కల సేకరణ, అందులో భాగంగా కులాలవారీ జనగణన ప్రక్రియలో ఆ పారదర్శకత ఎటువంటి మినహాయింపులు లేకుండా కన్పించి తీరాలి.



> జనాభా లెక్కల సేకరణ, అందులో భాగంగా కులగణన హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కాకుండా స్వతంత్రంగా, వృత్తి నిపుణుల ఆధ్వర్యంలో జరిగేలా విధాన నిర్ణయం తీసుకోవాలి. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ లేదా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్స్ ఇత్యాది అకడమిక్, పరిశోధనా సంస్థలకు ఆ బాధ్యతలు అప్పగించాలి.

దీక్షా దక్షతలు దండిగా ఉన్న నాయకుడుగా ప్రజల గౌరవాదరాలు పొందుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జనాభా లెక్కల సేకరణ విషయంలో ఒక సాహసోపేత నిర్ణయం తీసుకోవడం సముచితంగా ఉంటుంది. జనాభా లెక్కల సేకరణ బాధ్యతను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ విధుల నుంచి విడదీయాలి. ఇది కాలానుగుణ్యమైన మార్పుగా అర్థం చేసుకుని ప్రధాని మోదీ తన విలక్షణ రీతిలో నిర్ణయం తీసుకోవాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే జనాభా లెక్కల సేకరణ, అందులో భాగంగా కులగణనను హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కాకుండా స్వతంత్రంగా, వృత్తి నిపుణుల ఆధ్వర్యంలో జరిగేలా విధాన నిర్ణయం తీసుకోవాలి. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ లేదా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్స్ ఇత్యాది అకడమిక్, పరిశోధనా సంస్థల ఆధ్వర్యంలో జనాభా గణన, కులగణన జరగాలి. 2021లోనే నిర్వహించాల్సిన ప్రక్రియను నాలుగు సంవత్సరాలకు పైగా వాయిదా వేయడంపై విమర్శలు వెల్లువెత్తిన దృష్ట్యా జనాభా గణన నిర్వహణకు ఒక స్వతంత్ర సలహామండలిని ప్రధానమంత్రి ఏర్పాటు చేయాలి. ఒక ప్రభుత్వ విభాగం ఆధ్వర్యంలో జనాభా లెక్కల సేకరణను నిర్వహించాల్సిన అవసరమేమీ లేదు. సెన్సస్ డైరెక్టరేట్ ఇన్ని దశాబ్దాలుగా హోం మంత్రిత్వ శాఖలో భాగంగా ఎందుకు ఉండి పోయిందన్నది ఒక అంతుపట్టని విషయమే. ఆసేతు హిమాచలం సమస్త ప్రజల గౌరవాదరాలు నిండుగా పొందుతున్న ప్రధానమంత్రి జనాభా లెక్కల సేకరణ కార్యకలాపాలను ప్రభుత్వ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యం నుంచి పూర్తిగా తొలగించాలి. అయితే ప్రతిపాదిత సలహా మండలిలో ఆయా మంత్రిత్వశాఖలకు విధిగా ప్రాతినిధ్యం కల్పించాలి. జనగణన, కులగణనకు అవసరమైన నిధులను కేటాయించి, ఆ బాధ్యతల నిర్వహణను 'స్పేస్ కమిషన్' తరహా స్వతంత్ర సంస్థకు వదిలివేయాలి. సదరు సంస్థ షెడ్యూలు ప్రకారం ఆ బాధ్యతల నిర్వహణను ప్రారంభించి ముగించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు, సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం సమకూర్చాలి. ఇలా జరిగినప్పుడే జనాభా గణన, కులగణన విశ్వసనీయతను సాధించుకుంటాయి. ఏ సంకల్పంతో వాటిని నిర్వహించడం జరిగిందో అది నెరవేరుతుంది. 2026 జనాభా లెక్కల సేకరణ వర్తమాన భారతదేశ ప్రస్థానంలో చరిత్రాత్మక ప్రాముఖ్యమున్న సంఘటనగా నిలిచిపోతుంది.

— డాక్టర్ ఎన్.భాస్కరరావు (ఛైర్మన్, సీఎంఎస్)

'పహల్గాం' మథనంలో కశ్మీరీలు



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

> పహల్గాం హతులకు నివాళిగా శ్రీనగర్ నడిబొడ్డున కొవ్వొత్తుల ప్రదర్శనలు జరుగుతున్నాయి; సోపోర్ లాంటి పట్టణాలలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రజల నిరసనలు వెల్లువెత్తుతున్నాయి; కశ్మీర్ లోయలో సర్వత్రా పాకిస్థాన్‌కు మద్దతు తగ్గిపోతోంది. ఇటువంటి సానుకూల పరిస్థితులలో భారత ప్రభుత్వమూ, పౌర సమాజమూ కశ్మీరీలతో అర్థవంతమైన రీతిలో ఆత్మీయ అనుబంధాలను పెంపొందించుకోవాలి. భారత జాతీయ జీవన ప్రవంతిలో తామూ భాగమేనన్న భావన కశ్మీరీలలో సుస్థిరంగా నెలకొల్పాలి.

'కశ్మీరీలుగా మేము ఎవరం? సంఘర్షణ వల్ల గుర్తింపు పొందాలని మేము కోరుకోవడం లేదు. మా సామర్థ్యాలతో మేము ఎవరమో నిర్ణయింపబడాలని కోరుకుంటున్నాం. ప్రపంచం నుంచి వేరుపడాలని మేము ఆశించడం లేదు. మేము కేవలం రాజకీయ పరిస్థితులకు బాధితులం మాత్రమే కాదు, డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, శాస్త్రవేత్తలుగా, ఇంకా సమున్నత వృత్తి నిపుణులుగా పేరుగాంచాలని మేము ప్రగాఢంగా కోరుకుంటున్నాం.'– ఇవి సోపోర్ పట్టణానికి చెందిన ఒక 17 ఏళ్ల విద్యార్థిని మాటలు.

రక్త కాసారమై పోయిన కశ్మీర్ లోయలో ఆశాభావం, నైరాశ్యం ఎనలేని వ్యాకులతతో సహజీవనం చేస్తున్నాయి. కశ్మీరీ ముస్లిం గురించి గతానుగతమైన భావనల నుంచి బయటపడి జీవన ఉన్నతికి తోడ్పడే ఆకాంక్షాభరిత సమాజంలో భాగమయ్యేందుకు యువ కశ్మీరీలు ఆరాటపడుతున్నారు. ఆ ఆరాటం వారిని కొత్త ఆలోచనలకు పురిగొల్పుతోంది. నైరాశ్యాన్ని వీడి తెగింపుతో వ్యవహరించేలా ప్రోత్సహిస్తోంది. అయితే తీవ్రవాద కార్యకలాపాల వైపు ఆకర్షితులవుతున్నవారూ కచ్చితంగా ఉన్నారు. ఇది కొట్టివేయలేని వాస్తవం. కశ్మీరీ సమాజం సంక్లిష్టమైనది. సోపోర్ విద్యార్థిని శాంతి కోసం చేసిన విజ్ఞప్తికి సమాంతరంగా ప్రతీకారానికి పాల్పడి తీరాలని కర్కశంగా ఇస్తున్న పిలుపులూ మీకు కశ్మీర్ లోయలో వినబడతాయి. సంఘర్షణలు ఎడతెగకుండా జరుగుతున్న ప్రదేశంలో చాలా మంది బహిరంగంగా వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను వారిలో అంతర్గతంగా ఉన్న భయమే నిర్దేశిస్తుందనడం సత్యదూరం కానేకాదు. పహల్గాంలోని బైసరన్ హరిత మైదానంలో ఉగ్రవాదుల ఘాతుకం, దాని పర్యవసానాల ప్రభావంతో కశ్మీరీలు మళ్లీ మథనంలో పడ్డారు. పాత, కొత్త సమస్యలు అన్నిటినీ పరిగణనలోకి వివిధ దృక్కోణాలలో ఆ మథనం సాగుతోంది. సుడిగాలి వేగంతో కశ్మీర్ లోయలో విస్తృతంగా చేసిన పర్యటనలో నేను గ్రహించిన పది అంశాలను వివరంగా తెలియజేస్తాను.

మొదటిది. పహల్గాం ఘటనపై కశ్మీరీ సమాజంలోని అన్ని వర్గాలలో ఆగ్రహం, ఆవేదన వ్యక్తమవుతున్నాయి. అవి నిర్నిబంధమైనవి. మనసు లోతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. అమాయక పర్యాటకులను ఉగ్రవాదులు కిరాతకంగా కాల్చివేయడం పట్ల సమస్త కశ్మీరీలు స్వతస్సిద్ధమైన భావోద్వేగాలతో ప్రతిస్పందించారు. గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు వాటిని తాము ఖండించకపోవడం గురించి చాలా మంది పరితాపం చెందుతున్నారు. భయంతో తాము మౌనంగా ఉండిపోవడం వల్లే ఉగ్రవాదులు మరింతగా తెగించుతున్నారని కశ్మీరీలు భావిస్తున్నారు.

రెండవది. పహల్గాం పర్యాటకులలో హిందువులు ఎవరో గుర్తించి మరీ వారిని కాల్చివేయడం పట్ల కశ్మీరీలు తీవ్ర వేదనతో ప్రతిస్పందించారు. మత విద్వేషంతో జరిగిన ఘాతుకాన్ని వారు నిరసిస్తున్నారు. ఇస్లామిక్ తీవ్రవాదం ఇటీవలి దశాబ్దాలలో కశ్మీర్ లోయలోకి ప్రవేశించిన ఇస్లామిక్ తీవ్రవాదం కశ్మీరీ పండిట్‌లను స్వస్థలాల నుంచి వెళ్లగొట్టింది. ఇది, ఉదాత్త 'కశ్మీరియత్' భావనకు పూర్తిగా విరుద్ధమైనది. ఆ వెలివేత కశ్మీర్ చరిత్రకు ఒక తీరని కళంకం.



మూడవది. పహల్గాం ఘటన కశ్మీర్ లోయలోని పాకిస్థాన్ మద్దతుదారులకు విద్యుద్ఘాతమయింది. కశ్మీరీ ప్రయోజనాలను కాపాడే శక్తిగా పాకిస్థాన్‌ను కశ్మీరీలు ఇంకెంత మాత్రం భావించడం లేదు. ఇంటెలిజెన్స్ వర్గాల వారి వైఫల్యం వల్లే పహల్గాం ఘటన సంభవించిందని విశ్వసిస్తున్నవారు సైతం పాకిస్థాన్ నాయకులు తమ బాధ్యతను కప్పిపుచ్చుకునేందుకు చేస్తున్న వాదనలు పూర్తిగా మోసపూరితమైనవని ఖండిస్తున్నారు.

నాల్గవది. స్థానిక మిలిటెంట్లకు దశాబ్దం క్రితం ఉన్న ఆదరణ, మద్దతు ఇప్పుడు లేనేలేదు. 2016లో హిజ్బుల్ కమాండర్ బుర్హాన్ వనీని కొత్త మిలిటెన్సీకి ఒక పోస్టర్ బాయ్‌గా పరిగణించేవారు ఆ ఏడాది అతడు భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయినప్పుడు ప్రజలు వీధుల్లోకి వచ్చి తీవ్ర నిరసనలు తెలిపారు. స్వతంత్ర కశ్మీర్ కోసం పోరాడుతున్న వర్గాలలో మినహా ప్రజల్లో విస్తృత స్థాయిలో స్థానిక మిలిటెంట్లకు ఆదరణ, మద్దతు లభించడంలేదు.

ఐదవది. కశ్మీర్ లోయలో పాకిస్థాన్‌కు మద్దతు గణనీయంగా తగ్గిపోయినప్పటికీ దానికి సమతుల్యంగా భారత రాజ్య వ్యవస్థతో సాన్నిహిత్యం పెరగలేదు. నిజమేమిటంటే మోదీ ప్రభుత్వం ముస్లిం–వ్యతిరేకి అని కశ్మీరీలు భావిస్తున్నారు. ఏకైక ముస్లిం మెజారిటీ రాష్ట్రమైన జమ్మూ కశ్మీర్‌కు 2019లో రాత్రికి రాత్రే రాష్ట్ర ప్రతిపత్తిని రద్దు చేసి కేంద్రపాలిత ప్రాంతంగా కుదించివేసిన అనంతరం కశ్మీరీలలో ఆ భావన మరింత ప్రగాఢమయింది. తమను ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉంచేందుకే తమ రాష్ట్రానికి రాష్ట్ర హోదా రద్దు చేశారని కశ్మీరీలు భావిస్తున్నారు.

ఆరవది. కేంద్రం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని మనస్తాపం చెందుతున్న కశ్మీరీలకు 2024 ఎన్నికలు ఎటువంటి ఊరట నివ్వలేదు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పట్ల సదభిప్రాయం ఉన్నప్పటికీ ఆయన తమ ప్రయోజనాలను కాపాడ గల నాయకుడుగా కశ్మీరీలు భావించడం లేదు. న్యూఢిల్లీ పాలకులు అనుసరిస్తున్న కశ్మీర్ వ్యతిరేక విధానాలపై పోరాడే పటిమ, చొరవ ఆయనకు లేవనే అసంతృప్తి కశ్మీరీలలో బాగా ఉన్నది.

ఏడవది. కశ్మీర్ లోయలో అడుగడుగునా భద్రతా దళాల మోహరింపు కనిపిస్తుంది. తమను అడుగడుగునా నియంత్రించడాన్ని కశ్మీరీలు నిరసిస్తున్నారు. ఆ అణచివేత నుంచి బయటపడేందుకు వారు ఆరాటపడుతున్నారు. నిత్యం ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు, గాలింపు చర్యలు వారిని క్రుంగదీస్తున్నాయి. ఉగ్రవాద దాడి జరిగిన ప్రతిసారీ మిలిటెంట్ కార్యకలాపాలతో ఎటువంటి సంబంధం లేని వారిని నానా వేధింపులకు గురి చేయడాన్ని వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పహల్గాం ఘటన అనంతరం ఉగ్రవాదులతో ఎటువంటి సంబంధాలు లేని వారి గృహాలను సైతం కూల్చివేయడాన్ని వారు గర్హించారు.

ఎనిమిదవది. భారత రాజ్యవ్యవస్థ నిరంకుశ పాలనకు తాము శాశ్వత బాధితులమనే భావన కశ్మీరీలలో ఉన్నది. ఈ కారణంగానే విశాల భారతదేశంలోని ఏ విశ్వవిద్యాలయంలోనైనా ఒక కశ్మీర్ విద్యార్థి వేధింపులకు గురవుతున్నాడన్న వార్త కశ్మీర్ లోయ అంతటా దావానలంలా వ్యాపిస్తోంది. 'ప్రధానస్రవంతి' భారతీయులు తమను ఉద్దేశపూర్వకంగానే 'జాతి–వ్యతిరేకులు'గా ప్రచారం చేస్తున్నారని కశ్మీరీలు చాలా మంది వాపోతున్నారు. ఉగ్రవాద చర్యలు చోటుచేసుకున్న ప్రతిసారీ తమను ఏదో ఒక విధంగా ఉమ్మడి శిక్షకు గురి చేస్తున్నారని కశ్మీరీలు కలత చెందుతున్నారు.

తొమ్మిదవది. కశ్మీరీలకు శాంతి, ఐశ్వర్యాల లబ్ధి సమకూరేందుకు అవకాశాలు అధికంగానే ఉన్నాయి. ఇటీవలి కాలంలో కశ్మీర్ లోయకు పర్యాటకులు వెల్లువెత్తడం ప్రారంభమయింది. కశ్మీర్ పర్యాటక ఆర్థిక వ్యవస్థ బాగా పుంజుకుంది. సరిగ్గా ఈ తరుణంలో చోటుచేసుకున్న పహల్గాం ఉగ్రదాడి ఆ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసింది. తక్కువ తలసరి ఆదాయం, అత్తెసరు ఉద్యోగ అవకాశాలతో కునారిల్లుతున్న కశ్మీరీలు తమ విలక్షణ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ విశాల భారత ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు ఆరాటపడుతున్నారు.

కశ్మీరీల ఆకాంక్ష పదవ, చివరి పరిశీలనకు తీసుకువస్తుంది. బైసరన్ హత్యాకాండ ఎంత భీతావహాన్ని సృష్టించినప్పటికీ కశ్మీర్ లోయలో శాంతి స్థాపనకు అదొక కొత్త అవకాశాన్ని కల్పించింది! విడ్డూరమే అయినప్పటికీ ఇదొక వాస్తవం. ఉగ్ర దాడితో కశ్మీర్ లోయ స్తబ్దమైపోయింది. హింసాకాండను నిర్ద్వంద్వంగా ఖండిస్తున్న వారితో సంబంధాలు నెలకొల్పుకోవడం, వారి ఆందోళనలకు మద్దతునివ్వడం చాలా ముఖ్యం. బైసరన్ హతులకు నివాళిగా, ఇతర బాధితులకు సంఘీభావంగా శ్రీనగర్ నడిబొడ్డున కొవ్వొత్తుల ప్రదర్శనలు జరుగుతున్నాయి; సోపోర్ లాంటి పట్టణాలలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రజల నిరసనలు వెల్లువెత్తుతున్నాయి; బైసరన్ హత్యాకాండకు పాల్పడినవారికి గరిష్ఠ శిక్ష విధించాలని కశ్మీర్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు; కశ్మీర్ లోయలో సర్వత్రా పాకిస్థాన్‌కు మద్దతు తగ్గిపోతోంది. ఇటువంటి సానుకూల పరిస్థితులలో భారత ప్రభుత్వమూ, పౌర సమాజమూ కశ్మీరీలతో అర్థవంతమైన రీతిలో ఆత్మీయ అనుబంధాలను పెంపొందించుకునేందుకు హృదయపూర్వకంగా ప్రయత్నించాలి. హిందూ–ముస్లిం ఉద్రిక్తతలు పెచ్చరిల్లే విధంగా వ్యవహరించకూడదు. కశ్మీరీలను లక్ష్యంగా చేసుకునే చర్యలు చేపట్టకూడదు; నిర్ణయాలు తీసుకోకూడదు. దుష్ట, విఫల పాకిస్థాన్ రాజ్య వ్యవస్థకు విరుద్ధంగా నిజమైన లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థకు నెలవుగా వర్థిల్లుతున్న భారత్ ఆదర్శ స్ఫూర్తి ప్రాతిపదికన కశ్మీరీలకు సన్నిహితమవ్వాలి. భారత జాతీయ జీవన ప్రవంతిలో తామూ భాగమేనన్న భావన వారిలో సుస్థిరంగా నెలకొల్పాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)





నగరంలో ముస్లింల సంఘీభావ ర్యాలీ



ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నగరంలో ముస్లింల ర్యాలీ

● భారత్ మాతాకీ జై

ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తూ, భారత సైన్య ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ జిల్లా అంతటా ప్రత్యేక కార్యక్రమాలు, ర్యాలీలు జరుగుతున్నాయి. దేశ సరిహద్దులో గురువారం నాటి పరిస్థితుల నేపథ్యంలో హిందువులతో పాటు ముస్లింలు సైతం ఒక్కటిగా కదిలి రోడ్డెక్కారు. దాయాది పాక్ దొంగదాడులపై మండిపడుతూ భారత సైన్యానికి మద్దతుగా నినాదాలు చేస్తున్నారు. నగరంలో ముస్లింల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరగగా, జ్యూయలరీ పార్కు ప్రతినిధుల ఆధ్వర్యంలో మచిలీపట్నంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.



లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు నిరూపించండి

లేదంటే సీబీఐ విచారణ కోరండి

- కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు..!
- పది రోజుల కిందటే హైదరాబాద్‌లో గ్రూపు చర్చలు
- నాడు మాట్లాడని నాని ఇప్పుడెందుకు ప్రశ్నిస్తున్నారు?
- జగన్‌కు పాలేరుగా మారి డైవర్షన్ పాలిటిక్స్..
- స్థలాల విషయంలో మాత్రమే కసిరెడ్డితో సంబంధం
- జగన్ వెంట ఉన్నాడని తెలిసి బయటకొచ్చేశా..
- ఈ స్కామ్‌లో ఉన్నది జగన్ దంపతులే..
- మీడియా సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ స్కామ్‌లో తనపై చేసిన ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని, సీబీఐ విచారణ జరిపించాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సవాల్ విసిరారు. జగన్ పాలనలో జరిగిన రూ.3,600 కోట్ల స్కామ్ నుంచి దృష్టి మరల్చేందుకు వైఎస్ జగన్‌తో పాటు ఆయన వద్ద పాలేరుగా పనిచేస్తున్న మాజీ ఎంపీ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గురునానక్ కాలనీలోని తన కార్యాలయంలో గురువారం ఆయన



జగన్ పత్రికలో వచ్చిన తప్పుడు కథనాన్ని మీడియాకు చూపిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

మిగతా 6లో..

జాతీయ రహదారులపై సోలార్ వెలుగులు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మూడు జాతీయ రహదారుల గుర్తింపు

- 104 ప్రాంతాల్లో దీపాల ఏర్పాటుకు రూ.13 కోట్లతో టెండర్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు వీలుగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్‌లలో సోలార్ విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) నిర్ణయించింది. రెండు జిల్లాల పరిధిలోని ఎన్‌హెచ్-16, 216, 216ఏలో మొత్తం 104 ప్రాంతాల్లో సోలార్ విద్యుద్దీపాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఎన్‌హెచ్ అధికారులు రూ.13.18 కోట్లతో టెండర్లు పిలిచారు. విజయవాడ ఆర్వో కార్యాలయ పరిధిలో ఈనెల 20న బిడ్లను తెరుస్తారు. సౌర విద్యుద్దీపాలు జాతీయ రహదారులపై ప్రకాశవంతమైన కాంతులు వెదజల్లుతాయి. విద్యుత్ సదుపాయం లేని ప్రాంతాల్లోనూ ఈ వెలుగులు ప్రసరిస్తాయి. ప్రమాదకర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయటం వల్ల ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుంది.

ఆ 4 గ్రామాలు

రాజధాని పరిధిలో కలపడానికి సన్నాహాలు


ఇబ్రహీంపట్నం మండలం త్రిలోచనాపురం, మూలపాడు, కొటికలపూడి, జమీమాచవరం

రాజధానిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇందులో భాగంగానే ఇప్పటివరకు సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న ఇబ్రహీంపట్నం మండలంలోని త్రిలోచనాపురం, మూలపాడు, కొటికలపూడి, జమీమాచవరం గ్రామాలను రాజధాని పరిధిలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- అమరావతిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయడం కోసమే..
- నాలుగు గ్రామాల్లో 5 వేల ఎకరాల సేకరణకు యత్నాలు
- గ్రామసభలు పెట్టి వివరించిన రెవెన్యూ అధికారులు
- భూ సమీకరణ కింద భూములివ్వడానికి రైతుల అంగీకారం
- ఇప్పటికే మూలపాడులో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం
- ఐకానిక్ బ్రిడ్జి ప్రతిపాదన.. త్వరలో స్పోర్ట్స్ వర్శిటీ కూడా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాలోని మరో నాలుగు గ్రామాలను రాజధాని పరిధిలోకి తీసుకొచ్చేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ గ్రామాలు సీఆర్‌డీఏ పరిధిలో ఉన్నాయి. వీటిని రాజధానిలోకి తీసుకురావాలన్న ఆలోచనలు జరుగుతున్నాయి. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు కోసం ఈ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం ఇబ్రహీంపట్నం మండలంలోని కొటికలపూడి, మూలపాడు, త్రిలోచనపురం, కేతనకొండ గ్రామాలను ప్రాథమికంగా ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లోని భూములను భూ సమీకరణ కింద తీసుకుని రాజధానిలో ప్యాకేజీ కల్పించాలన్న ఆలోచన చేస్తున్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు నాలుగు గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. భూ సమీకరణ కింద భూములు ఇవ్వడానికి అక్కడి రైతులు అంగీకరించారు. అయితే, తమకు ఇచ్చే ప్యాకేజీ గురించి సమాచారాన్ని అడిగారు. మరో సమావేశంలో వీటిపై స్పష్టత ఇస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు.

ఇబ్రహీంపట్నంలోని ప్రతిపాదిత నాలుగు గ్రామాలు



అనేక క్రీడా ప్రాంగణాల ఏర్పాటు

స్పోర్ట్స్ సిటీలో భాగంగా ఈ నాలుగు గ్రామాల్లో అనేక క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు కానున్నాయి. మూలపాడు గ్రామంలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు కానుంది. ఈ యూనివర్శిటీలో అన్ని క్రీడలకు సంబంధించిన శిక్షణ, క్రీడా గ్రామాలు, కోచ్‌లు, క్రీడా ప్రాంగణాలు, క్రీడానుబంధ పరిశ్రమలు, యూనిట్లు వంటివి ఎన్నో ఏర్పాటవుతాయి.

» స్పోర్ట్స్ సిటీ కోసమే..

అమరావతిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు 5 వేల ఎకరాల వరకు అవసరమవుతాయని సీఆర్‌డీఏ అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం మూలపాడులో క్రికెట్ స్టేడియం ఉంది. ఈ ప్రాంతంలోనే స్పోర్ట్స్ సిటీ ఉంటే బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కృష్ణానదిలో ద్వీప ప్రాంతాలైన చినలంక, పెదలంకలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాలని ఇంతకుముందు భావించారు. కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని చిన్ని ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ రెండూ రాజధానికి అత్యంత సమీపాన ఉండే దీవులు కావడంతో అప్పట్లో పరిశీలించారు. అయితే, వరదలు వచ్చినపుడు ఈ దీవులు మునిగిపోతాయన్న విషయం తెలియటంతో ఆ తర్వాత పరిగణనలోకి తీసుకోలేదు. ఈ నేపథ్యంలో రాజధానిలో స్పోర్ట్స్ సిటీకి అనువైన ప్రాంతాలను కొద్దిరోజులుగా అన్వేషిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కేతనకొండ, మూలపాడు, త్రిలోచనపురం, జమీమాచవరం ప్రాంతాలను గుర్తించారు. ఈ ప్రాంతాలన్నీ కృష్ణాతీరానికి సమీపాన ఉన్నాయి. మూలపాడులో

మిగతా 6లో..

ట్రాన్స్‌కో.. పెంచుకో..

గంగూరు-గుణదల విద్యుత్ లైన్‌కు భారీ అంచనాలు

- తెలంగాణాలో కిలోమీటరుకు రూ.50 వేలు
- మనకు మాత్రం రూ.2.50 లక్షలట..!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ట్రాన్స్‌కో రూటే సెపరేటు'గా ఉంది. భారీగా అంచనాలు పెంచడం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో తెలియదు కానీ, ఇటీవల కాలంలో తీవ్ర వివాదాల్లో చిక్కుకుంటోంది. కృష్ణాజిల్లా గంగూరు నుంచి ఎన్టీఆర్ జిల్లా గుణదల వరకు 132 కేవీ హైటెన్షన్ కండక్టర్స్ (లైన్లు) ఏర్పాటుకు పిలిచిన టెండర్లలో అధిక అంచనాలను పేర్కొనడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పొరుగు రాష్ట్రం తెలంగాణాతో పోల్చుకుంటే నాలుగు రెట్లు అధికంగా లైన్‌లాగే ఖర్చును నిర్ణయించటమే ఈ వివాదాలకు కారణం. గంగూరు నుంచి గుణదల వరకు ప్రస్తుతం పాత హైటెన్షన్ కండక్టర్ లైన్లు (హెచ్‌టీఎల్‌ఎస్) ఉన్నాయి. వీటిని పూర్తిగా అధునాతన హెచ్‌టీఎల్‌ఎస్‌లుగా మార్చాలని నిర్ణయించారు. దీనికోసం ఇటీవలే ట్రాన్స్‌కో అధికారులు

మిగతా 6లో..

మార్గదర్శనం

పీ4లో భాగంగా మార్గదర్శులకు జిల్లా యంత్రాంగం ఆహ్వానం

జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అమలుకు శ్రీకారం

- బంగారు కుటుంబాల కోసం మార్గదర్శుల వెతుకులాట
- సేవాభావం కలిగిన వారు ముందుకు రావాలని పిలుపు
- ఎన్ఆర్ఐలకు ఆహ్వానం పలకాలని కలెక్టర్ లక్ష్మీశ నిర్ణయం
- త్వరలో తానా, ఆటా, నాట్స్ తదితర సంఘాలతో చర్చ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పీ-4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు జిల్లా యంత్రాంగం మార్గదర్శులను ఆహ్వానిస్తోంది. పీ-4 మొదటి ప్రజా వేదిక సభ జిల్లాలోనే జరిగింది. ఈ కార్యక్రమాన్ని మొదట ఆచరణలోకి తీసుకొచ్చింది కూడా మన జిల్లాలోనే. ఇటీవలే బంగారు కుటుంబాలకు మార్గదర్శుల ద్వారా సహాయ సహకారాలను అందించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఆదరణను దృష్టిలో పెట్టుకుని యంత్రాంగం పీ-4 కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లో అమలు చేసేందుకు వీలుగా మార్గదర్శుల

మిగతా 6లో..

ఎన్ఆర్ఐలకు ఆహ్వానం

జిల్లాలో పెద్దసంఖ్యలో ఎన్ఆర్ఐలు ఉండటంతో వారిపై కలెక్టర్ దృష్టిపెట్టారు. తానా, ఆటా, టాసా, నాటా వంటి ఎన్ఆర్ఐ సంఘాలతో భాగస్వామ్యం కావాలని ఎన్టీఆర్ జిల్లా నాట్స్, సిలికానాంధ్ర, బే ఏరియా తెలుగు అసోసియేషన్ (బాటా), తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ హ్యూస్టన్, ట్రై స్టేట్ తెలుగు అసోసియేషన్ ఆఫ్ చికాగో, చికాగో తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్, గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సొసైటీ వంటి సంఘాలతో పాటు వీటికి అనుసంధానంగా ఉండే జయహో భారతీయం వంటి సంస్థలతోనూ కలెక్టర్ లక్ష్మీశ సమావేశం కావాలని భావిస్తున్నారు. అమెరికాలోని పలు తెలుగు సంఘాల ప్రతినిధులతో మాట్లాడి జన్మనిచ్చిన జిల్లా రుణం కొంతవరకైనా తీర్చుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ భావిస్తున్నారు.

నగరంలో అల్ట్రా మోడ్రన్ లాజిస్టిక్ కంపెనీ

- గన్నవరంలో ఎన్-16కు ఆనుకుని ఏర్పాటు
- ప్రముఖ లాజిస్టిక్ సంస్థ సేఫెక్స్‌ప్రెస్ వెల్లడి

6లో

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష

అన్నవరం సత్యదేవునికి పట్టువస్త్రాలు


సత్యదేవునికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దుర్గగుడి అర్చకులు

ఇంద్రకీలాద్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాల సందర్భంగా గురువారం సత్యదేవునికి దుర్గామల్లేశ్వర దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు లింగంబొట్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక బృందం, రమా సహిత సత్యనారాయణ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు తీసుకువెళ్లిన బృందానికి అన్నవరం దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామికి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.



విజయవాడలో ఆల్ట్రా లాజిస్టిక్ కంపెనీ

» గన్నవరంలో ఎన్-16కు ఆనుకుని ఏర్పాటు

విజయవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి) : చైన్ అండ్ లాజిస్టిక్స్ అత్యాధునిక పార్క్‌ను విజయవాడలో ప్రముఖ సేఫెక్స్ కంపెనీ ప్రారంభించింది. గన్నవరంలో ఎన్‌హెచ్-16 ఆనుకుని ఉన్న సవరగూడెంలో ప్రముఖ లాజిస్టిక్ కంపెనీ సేఫెక్స్‌ప్రెస్ తమ ఉత్పత్తులను తాజాగా ప్రారంభించారు. సుమారు 3.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సంస్థలో అధునాతన ట్రాన్స్‌షిప్‌మెంట్ పాటు థర్డ్‌పార్టీ లాజిస్టిక్స్ సామర్థ్యం కూడా ఉంది. వచ్చిన సరుకును నిల్వచేసి కాలయాపన చేయకుండా 100 కంటే ఎక్కువ వాహనాలను ఒకేసారి లోడ్, అన్‌లోడ్ చేయడానికి వీలుగా ఏర్పాటుచేశారు. దుస్తులు, వ్యవసాయ ప్రాసెసింగ్, ఆటోమొబైల్, ఫార్మా వంటి విభిన్న పరిశ్రమలకు నగరం ప్రసిద్ధి చెందడంతో ఐటీ, నిర్మాణ పరిశ్రమల అభివృద్ధితో పాటు ఆర్థిక, నగరాభివృద్ధికి దోహదపడుతుంది. గన్నవరం, పరిసర ప్రాంతాల్లో వ్యాపారాలు అభివృద్ధి చెందుతున్న క్రమంలో గిడ్డంగి, పంపిణీ అవసరాలకనుగుణంగా వేగంగా, సమర్థవంతంగా సరఫరా చేసే చైన్ కనెక్టవిటీని రూపొందిస్తున్నట్టు కంపెనీ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరం, రాజధానికి ఆనుకుని ఉండడంతో ప్రధాన వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అద్భుతమైన రహదారుల కనెక్టవిటీ ఉండడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి కార్యకలాపాలను గమ్యస్థానాలకు వేగంగా చేర్చడానికి సహాయపడుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సేఫెక్స్‌ప్రెస్ సీనియర్ అధికారులు హాజరయ్యారు.

సత్వరం గండ్లు పూడ్పించండి

» మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యే వసంత వినతి



ఇబ్రహీంపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గతేడాది బుడమేరు వరద మళ్లింపు కాలువకు, పలు చెరువులకు, వాగుకట్లకు పడిన గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చించాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కోరారు. గురువారం అమరావతి సచివాలయంలో మంత్రి నిమ్మలను ఎమ్మెల్యే కలిసి గండ్ల వివరాలను లిఖిత పూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు 168 వర్కులకుగాను రూ.4680.75లక్షలు అవసరముందన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం 41 వర్కులకుగాను రూ659.77లక్షలు నిధులు మాత్రమే కేటాయించిందని ఇంకా మిగిలిన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

నల్లూరి వెంకట జగదీష్‌కు

హైబిడ్ టీవీ లెజెండరీ అవార్డు


నల్లూరి వెంకట జగదీష్‌కి అవార్డు అందజేస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

వన్‌టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : హైబిడ్ టీవీ మీడియా2025 అవార్డుల్లో భాగంగా ఓటీఎస్ అడ్వర్టైజింగ్ ఎండీ నల్లూరి వెంకట జగదీష్ లెజెండరీ అవార్డు అందుకున్నారు. మీడియా, ప్రకటనల రంగంలో చేసిన అసాధారణ సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. బుధవారం నాడు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ అవార్డును అందజేశారు. ప్రాంతీయ ప్రకటన రంగంలో జగదీష్ కీలక పాత్ర పోషించారు. ఆయన ఆధ్వర్యంలో ఓటీఎస్ ప్రముఖ సంస్థగా ఎదిగింది. మౌలిక సదుపాయాలు, పరిపాలన, విద్య, ఆరోగ్య రంగాల్లో విస్తృత ప్రచారాలు చేయటంలో విజయవంతమయ్యారు. జాతీయ, ప్రాంతీయ ప్రాధాన్యత కలిగిన అనేక ప్రచారాలను ఆయన నడిపారు. ప్రభుత్వ సమాచారాన్ని సమర్థవంతంగా అందచేయటంలో కథనశైలి, బ్రాండ్ నాయకత్వం కీలకంగా ఉండేది. హైబిడ్ టీవీ నుంచి ఈ అవార్డును అందుకోవటం గౌరవంగా భావిస్తున్నట్టు, తన బృందానికి ఈ గౌరవం దక్కుతుందని జగదీష్ పేర్కొన్నారు.

గవర్నర్ పేటకు లేబర్ కార్యాలయం మార్పు

విజయవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రస్తుతం ఉన్న లేబర్ కార్యాలయాన్ని గవర్నర్‌పేటలోని స్వర్ణ కాంప్లెక్స్‌లో రెండో అంతస్తుకి తరలించినట్టు డిప్యూటీ లేబర్ కమిషనర్ పీవీఎస్ సుబ్రహ్మణ్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇకపై వినతులు, దరఖాస్తులు, అన్ని కార్యకలాపాలు కొత్త కార్యాలయంలోనే జరుగుతాయన్నారు. ఈ విషయాన్ని నగరంలోని షాపులు, సంస్థలు, ఫ్యాక్టరీలు, పరిశ్రమల యజమానులు సంబంధిత అవసరాలకు నూతన కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు

పకడ్బందీ ఏర్పాట్లు

» అధికారులతో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష



కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఇప్పటికే వివిధ పరీక్షలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, ఇదేవిధంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 12 నుంచి 20 వరకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరంపరీక్షలు జరుగుతున్నాయన్నారు. మొదటి సంవత్సరానికి సంబంధించి బెటర్‌మెంట్ రాసే విద్యార్థులతో కలిపి మొత్తం 28,909 మంది విద్యార్థులకు 73 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా 5,565 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 23 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, నాలుగు సిటింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరుగుతోందన్నారు. పరీక్షా పత్రాలను స్టోరేజ్ పాయింట్ల నుంచి పరీక్షా కేంద్రాలకు తరలింపు మొదలు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. బందోబస్తు ఏర్పాటు భద్రతా చర్యలు, సీసీ కెమేరాల నిఘా విషయంలో పోలీసుశాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకొనేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రం వద్ద తప్పనిసరిగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక చికిత్స కిట్లను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో వుంచుకోవాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలను నో సెల్‌జోన్లుగా ప్రకటించినందున, అందుకు తగ్గట్లు భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) బి.ప్రభాకరరావు, డీఈఓ యూవీ సుబ్బారావు, డీఈసీ సభ్యులు జి.ఝన్సీ, ఎన్.వెంకటరావు, టి.ఆర్యపతి, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, డీపీఓ పి.లావణ్య కుమారితో పాటు విద్యుత్, వైద్య ఆరోగ్యం, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాగరాజు

రోడ్డెక్కిన వైసీపీ వర్గపోరు!

» సీనియర్ నేత నరెడ్ల, సర్పంచ్ భర్త భూక్యా మాటల యుద్ధం

ఎ.కొండూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కొంతకాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న వైసీపీలోని అంతర్గత కలహాలు గురువారం ఒక్కసారిగా రోడ్డెక్కాయి. పార్టీ సీనియర్ నేత నరెడ్ల వీరారెడ్డికి, మాత్రియా తండా గ్రామ సర్పంచ్ భర్త భూక్యా నాగరాజు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ రాజకీయ వేడి పుట్టిస్తున్నారు. రెండురోజుల క్రితం మామిడితోటలో వైసీపీ నేతలు సమావేశం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడి ఎన్నికపై చర్చ జరగ్గా ఆ పదవి ఎస్టీలకు కేటాయించాలని నాగరాజు కోరారు. దీనిపై ఆగ్రహించిన వీరారెడ్డి వర్గీయులు పలుసార్లు జైలు జీవితం గడిపిన నాగరాజు ఎలా అధ్యక్ష పదవి అడుగుతారని ప్రశ్నించారు. దీనిపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని వీరారెడ్డి వర్గీయులు తెలిపారు. దీనికి ప్రతిగా నాగరాజు సోషల్ మీడియా వేదికగా వీరారెడ్డి తన వద్ద రూ.3లక్షలు తీసుకుని సర్పంచ్‌గా పోటీ చేయించారని, మరో రూ.12 లక్షలు ఖర్చు పెడితే సర్పంచ్‌గా తన భార్య ఝాన్సీ విజయం సాధించిదన్నారు. వీరారెడ్డి పార్టీని అడ్డుపెట్టుకొని అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వీరారెడ్డి హటావో వైసీపీ బచావో అంటూ మాత్రియాతండాలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ఘటనతో వైసీపీలో వర్గ పోరుపై చర్చ జరుగుతోంది.

వివాదాస్పద భూమిలో సర్వే

జగ్గయ్యపేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దుర్గాపురంలో జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానుకు చెందిన భూమిని జిల్లా సర్వేయర్ సీహెచ్ శర్మ ఆధ్వర్యంలో గురువారం సర్వే చేపట్టారు. గతనెల 19న దుర్గాపురం ఆర్ఎస్ నెం 345లోని 13.60 ఎకరాల భూమిలో కొంతభాగం చెరువు వైపు ఆక్రమణకు గురైందని, వాటితొలగింపునకు యంత్రాలను తీసుకురావటంతో కాలనీవాసులు అడ్డుకున్నారు. వార్డుకౌన్సిలర్ వేదులాపురి ఆలేఖ్య, సైదా తీవ్ర అభ్యంతరం చెప్పటంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఈ భూమిలో 20 సెంట్లకు పైగా ఆక్రమణకు గురైందని ఉదయభాను చెబుతున్నారు. గతంలో విలేజ్, మండల సర్వేయర్లు కొలతలు వేశారు. వివాదం


దుర్గాపురంలో సర్వే చేస్తున్న అధికారులు

తర్వాత బాధితులు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యను కలిసి తమకు న్యాయం చేయాలని, బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నం జరుగుతుందని ఫిర్యాదు చేశారు. ఆయన సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరడంతో నందిగామ నుంచి సర్వేయర్‌ను పంపి ఆక్రమణలపై మార్కింగ్ ఇచ్చారు. ఆ సర్వేపై ఉదయభాను సంతృప్తి చెందకపోవటంతో జిల్లా సర్వేయర్‌తో సర్వేకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు జిల్లా సర్వేయర్ సీహెచ్ శర్మ పర్యవేక్షణలో సిబ్బంది సర్వే చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై -2 వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఈహెచ్ఎస్ ద్వారా

ఉచిత వైద్యం అందించండి

» ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరిన ఏపీ జేఏసీ నేతలు

వన్‌టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్(ఈహెచ్ఎస్) కార్డుల వల్ల ఎటువంటి ప్రయోజనం కలగటం లేదని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఈ కార్డులకు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి నేతలు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను కోరారు. ఈ మేరకు పలు అంశాలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ మేరకు విజయానంద్ స్పందిస్తూ వీలైనంత త్వరగా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి తగుచర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన కార్యదర్శిని కలిసిన వారిలో కనపర్తి సంగీతరావు, జనకుల శ్రీనివాసరావు, రావిశెట్టి వెంకట రాజేష్, తిమ్మనత్తి నాగేశ్వరరావు కలిసినట్లుగా ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్యదర్శి పలిశెట్టి దామోదర్రావులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో, ముఖ్యంగా ప్రధాన ఎంఏబీహెచ్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలను కార్డు ద్వారా ఉచితంగా అందించాలని కోరారు. కార్డును అనుమతించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ చెక్‌కు అనుమతించాలన్నారు. కొత్త పింఛన్ విధానంలో విశ్రాంత ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఇప్పటికైనా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఈహెచ్ఎస్, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లలో ఇబ్బందులకు స్వస్తి పలకాలని కోరారు.



ముచ్చింతాల సభలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

అంబేడ్కర్, జగ్జీవన్‌రాంలు ఆదర్శం

» మంద కృష్ణమాదిగ

పెనుగంచిప్రోలు, మే 8 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ప్రధాని జగ్జీవన్‌రాం ఆశయాల సాధనకు ప్రతి దళితుడు చిత్తశుద్ధితో కృషిచేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ముచ్చింతాల గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన మహనీయుల విగ్రహాలకు, దండోరా విగ్రహాలను ఆయన గురువారం రాత్రి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత బచ్చలకూర పుష్పరాజ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, దేశంలో కులవ్యవస్థ రాజ్యమేలుతుందని ఆవేదన చెందారు. దళితులు చదువుకొని విజ్ఞానవంతులు కావాలని పిలుపునిచ్చారు. జ్యోతిరావ్‌పూలే తొలిసారిగా దళితులకు విద్య నేర్పి విజ్ఞానాన్ని అందించారని, ఆయన విగ్రహాన్ని ఇదేస్థలంలో మహనీయుల పక్కనే ఏర్పాటు చేయాలని సూచించారు. దళితుల అభ్యున్నతి కోసం నిస్వార్థంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రముఖులు జక్కులూరి రాంబాబు, మందా పిచ్చయ్య, కోటా దానియేలు, బెల్లంకొండ పరమయ్య, జిల్లేపల్లి సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు నిరూపించండి

(5వ పేజీ తరువాయి)

విలేకరులతో మాట్లాడారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా జగన్.. తన పాలేరుతో పాటు మరో నలుగురు కలిసి పది రోజుల క్రితం హైదరాబాద్‌లో కలిసి తనపై బురద చల్లేందుకు వ్యూహరచన చేశారన్నారు.

కసిరెడ్డిని అలా పక్కనపెట్టా..

కేశినేని ఇంటర్నేషనల్ లిమిటెడ్ (అమెరికా), కేశినేని ఎంటర్‌ప్రైజెస్ దుబాయ్ కంపెనీల ద్వారా తాను డబ్బు తరలించినట్లు జగన్‌రెడ్డి పత్రికలో తప్పుడు కథనం అల్లారని ఎంపీ మండిపడ్డారు. ఈ కంపెనీలు ఎవరి పేరుమీద ఉన్నాయో, లిక్కర్ స్కామ్ సూత్రధారులు ఎవరో నిగ్గు తేల్చటానికి దమ్ముంటే.. 24 గంటల్లో జగన్ సీబీఐ విచారణ కోరాలని డిమాండ్ చేశారు. అలాగే, ఈ విషయంలో సీబీఐ విచారణ జరపాలంటూ చిన్ని లేఖ కూడా రాశారు. సోషల్ మీడియా వేదికగా తనపై లిక్కర్ స్కామ్ ఆరోపణలు చేస్తూ వచ్చిన కథనాలను ఆయన ఖండించారు. జగన్ ఆలోచనలను కేశినేని నాని అమలు చేస్తూ తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని రాజ్ కసిరెడ్డి స్థలం పక్కనే తనకు కూడా స్థలం ఉందని, రాకపోకలు సాగించేందుకు తన స్థలం నుంచే అవకాశం ఉండటంతో ఇద్దరం కలిసి డెవలప్‌మెంట్ చేయటానికి ఓ కంపెనీని ఏర్పాటు చేశామని చెప్పారు. 2020-21లో నాలుగైదు సార్లు కసిరెడ్డిని కలిశానన్నారు. జగన్‌తో కసిరెడ్డికి సంబంధాలు ఉన్నాయని తెలియటంతో కోట్ల రూపాయల ఆదాయాన్ని కూడా వదులుకుని బయటకు వచ్చానని, నాటి నుంచి అతనితో ఎలాంటి లావాదేవీలు లేవని తెలిపారు. లిక్కర్ స్కామ్ నుంచి ప్రజల దృష్టి మరల్చటానికి జగన్ బ్యాచ్ చేస్తున్న కుట్రల్లో భాగంగా తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు.

స్కామ్‌లో జగన్ దంపతులు

గత ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.3,600 కోట్ల లిక్కర్ స్కామ్‌లో భాగస్వాములు ఎవరు, సూత్రధారులు, పాత్రధారులు ఎవరనేది అందరికీ అర్థమవుతోందని చెప్పారు. సుప్రీంకోర్టులో తాజాగా బెయిల్ నిరాకరణకు గురైన మాజీ ఐఏఎస్ ఆధ్వర్యంలో ఈ లిక్కర్ స్కామ్ జరిగిందన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో నాల్గో నెంబర్ గది వైపునకే వేళ్లు చూపిస్తున్నాయన్నారు. లిక్కర్ స్కామ్‌లో జగన్ దంపతులిద్దరూ ఉన్నారని ఎంపీ ఆరోపించారు. రాజ్ కసిరెడ్డికి, మాజీ ఐఏఎస్ అధికారికి మాత్రమే ఆ గదిలోకి ఎంట్రీ ఉందన్నారు. పదిరోజుల కిందట హైదరాబాద్‌లో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పతో సహా కేశినేని నాని సమావేశం జరిపారన్నారు. ఈ సమావేశంలో విజయవాడకు చెందిన మరో వ్యక్తి కూడా ఉన్నాడని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు. పబ్లిక్ డొమైన్‌లో ఉన్న తన వివరాలను సేకరించి నాని అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఐదారు ఏళ్ల కిందటే జగన్‌కు కేశినేని నాని అమ్ముడుపోయాడని ఆరోపించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో కూడా నిత్యం జగన్‌కు మెసేజ్‌లు పంపిస్తూ కోవర్టుగా పనిచేశాడన్నారు. జగన్ హయాంలోనే లిక్కర్ స్కామ్, శాండ్ స్కామ్ జరిగాయని, అప్పుడు కేశినేని నాని ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. ఆరోజు స్కామ్‌లో డబ్బు అందినందుకే ఆయన మాట్లాడలేదని మండిపడ్డారు. దుబాయ్, అమెరికాలో ఉన్న కంపెనీలు పాలేరుకు చెందినవా లేదా జగన్‌రెడ్డికి చెందినవా నిగ్గు తేలాలన్నారు. గతంలో చిరంజీవి పార్టీలోకి వెళ్లి బయటకు వచ్చిన కేశినేని నాని.. ఆ తర్వాత చిరంజీవినే విమర్శించారని గుర్తుచేశారు. వెదవ వేషాలను చూసే పార్టీ నుంచి తప్పించారన్నారు. తాను పార్టీలు మారలేదని, ఇకముందూ మారేది లేదని, జీవితాంతం టీడీపీలో ఉంటానని, తన నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల కోసం పాటుపడతానని స్పష్టం చేశారు.

దేశం గర్వించదగిన సైన్యం

దేశ ప్రజలు గర్వపడేలా ఉగ్రవాదుల స్థావరాలను భారత సైన్యం నేలమట్టం చేసిందని, ఇది దేశం గర్వించదగిన విషయమని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. పెహల్గాం దాడిలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఉపశమనం కలిగించే చర్య అని, ఇంతటి గొప్ప విజయాన్ని అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలి

» చంద్రబాబుకు కేశినేని నాని లేఖ

వన్‌టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మద్యం కుంభకోణంలో స్వయంగా పాత్రధారి, ఫిర్యాదిగా ఉన్న నేపథ్యంలో నిజాయతీగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలంటే ఈ కేసును సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు బదిలీ చేయటం అవసరమని మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) ముఖ్యమంత్రి చంద్రబాబుకు గురువారం లేఖ రాశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.3,600 కోట్ల మద్యం కుంభకోణంపై జరుగుతున్న దర్యాప్తు పట్ల తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్టు నాని లేఖలో పేర్కొన్నారు. ఎంపీ శివనాథ్‌కు మద్యం కుంభకోణానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో భాగస్వామ్యం ఉన్నట్టు, ఆయన సన్నిహితుడైన రాజ్ కసిరెడ్డి ద్వారా లావాదేవీలు జరిగాయని ఆరోపణలు వచ్చాయన్నారు. కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తే సీబీఐ దర్యాప్తును కోరడం, సిట్‌పై అనుమానం వ్యక్తం చేయటం, ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని తప్పక ప్రభావితం చేస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో నిజాయితీగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలన్నారు. ఏపీ ప్రజలకు పూర్తి పారదర్శకత, బాధ్యతాయుతమైన పాలనే కావాలి, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ తగిన చర్యలు తీసుకుంటారన్న నమ్మకంతో లేఖ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు.

మార్గదర్శనం

(5వ పేజీ తరువాయి)

అన్వేషణ సాగిస్తోంది.

మార్గదర్శులంటే ఎవరు?

మార్గదర్శులు అంటే.. తమ చేతిలో నుంచి డబ్బు తీసి ఖర్చు పెట్టడం కాదు. తనకు తెలిసిన పదిమందితో మాట్లాడైనా పదిమందికీ సాయం చేయాలనేది జిల్లా యంత్రాంగం భావన. పేదరికం కారణంగా అనేక రకాల సమస్యలతో, ఆర్థిక ఇబ్బందులతో అసహాయంగా ఉండే వారికి అండగా ఉండేలా, వారిని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లేలా మార్గదర్శులు ఉండాలి. ఒక కుటుంబం బాధ్యతను తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించాలని యంత్రాంగం భావిస్తోంది. ప్రతి మనిషికీ తోటి వారికి సాయం చేయాలనే ఆలోచన ఉంటుంది. తాను సహాయం చేయలేకపోయినా, పదిమందితో చేయించగలిగే నేర్పు మరికొందరికి ఉంటుంది. ఇలాంటి వారందరినీ జిల్లా యంత్రాంగం ఆహ్వానిస్తోంది. పేదవారిని బాగు చేయాలనుకునే వారిని మనస్ఫూర్తిగా ఆహ్వానించి వారికి బాధ్యతలు అప్పగిస్తామని కలెక్టర్ లక్ష్మీశ చెబుతున్నారు. ప్రభుత్వం తరఫున కొంత, జిల్లా యంత్రాంగం తరఫున కొంతమంది పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను గుర్తించి ఆ మేరకు వారికి బంగారు కుటుంబాల బాధ్యతను అప్పగిస్తారు.

ట్రాన్స్‌కో.. పెంచుకో..

(5వ పేజీ తరువాయి)

టెండర్లు పిలిచారు. టెండర్లలో మెటీరియల్ విలువలో పెద్దగా అభ్యంతరాలు లేనప్పటికీ, లైన్ లాగేందుకు నిర్దేశించిన ఖర్చు మాత్రం ఆక్షేపణీయంగా ఉంది. గంగూరు నుంచి గుణదల వరకు 60 కిలోమీటర్ల దూరానికి సంబంధించి 20 కిలోమీటర్ల దూరానికి లైన్ లాగేందుకు కిలోమీటరుకు రూ.2.50 లక్షలు నిర్దేశించారు. ఇదే తెలంగాణాలో అయితే, కిలోమీటరుకు కేవలం రూ.50 వేలు మాత్రమే ఉంది. అంటే తెలంగాణ కంటే రూ.2 లక్షలు అదనంగా ఖర్చును పెంచారు. ఈ లెక్కన 20 కిలోమీటర్ల దూరానికి రూ.40 లక్షల మేర అంచనాలు పెంచారు.

ఆ 4 గ్రామాలు

(5వ పేజీ తరువాయి)

అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ప్రైవేట్ స్టేడియం కూడా ఉంది. మూలపాడు నుంచి కృష్ణానది మీదుగా అమరావతికి ఐకానిక్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సీఆర్‌డీఏ ఇప్పటికే నిర్ణయించింది. పైగా ఈ ప్రాంతం హైదరాబాద్ నుంచి వచ్చే వారికి దగ్గరగా ఉండటంతో పాటు అమరావతికి గేట్‌వేగా మారుతుంది. దీంతో అమరావతికి గ్రాండ్ ఎంట్రన్స్ వే ఐకానిక్ బ్రిడ్జిని ఈ ప్రాంతం మీదుగానే నిర్మించాలన్న నిర్ణయానికి సీఆర్‌డీఏ వచ్చింది. మూలపాడులో క్రీడా స్టేడియాలు ఏర్పాటుకు అనువుగా ఉండటంతో కొటికలపూడి, జమీమాచవరం, త్రిలోచనాపురం గ్రామాలను కూడా అనువైన ప్రాంతాలుగా నిర్ణయించారు.

ఇటుక బట్టీలకు మంచిరోజులు!



అమరావతిలో నిర్మాణ పనులు తిరిగి ఊపందుకోవటంతో ఇటుక బట్టీ నిర్వాహకులు, కార్మికుల ఆశలు చిగురిస్తున్నాయి. నిర్మాణరంగం ఆశాజనకంగా లేకపోవటంతో దెబ్బతిన్న ఇటుక బట్టీల యజమానులు ఆ నష్టాన్ని ఎంత త్వరగా పూడ్చుకుందామా అని ఆశగా ఉన్నారు. ప్రస్తుతం పతాక స్థాయిలో బట్టీల్లో ఇటుకల తయారీ జరుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో ఊపందుకుంటున్న ఇటుక బట్టీలపైప్రత్యేక కథనం..
- (ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

- వందల సంఖ్యలో ఇటుక బట్టీలు.. రూ. కోట్లలో వ్యాపారం
- వేల సంఖ్యలో స్థానిక, వలస కూలీలకు ఉపాధి

కరోనా తర్వాత నిర్మాణ రంగంలో స్తబ్దత, 2019లో వైసీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేయడం, అమరావతి పనులు నిలిచిపోవడంతో ఇటుక బట్టీలు భారీ నష్టాలను చవిచూశాయి. ఇసుక ఖరీదైన భారంగా మారడంతో కార్మికుల జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి. 2024లో కూటమి ప్రభుత్వం తిరిగి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంతో నిర్మాణ రంగం కోలుకుంటోంది. అమరావతిలో పనులు ఊపందుకోవడంతో ఇటుకలకు గిరాకీ పెరిగే అవకాశం ఉంది.

జోరుగా తయారీ

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాల్లో వందల ఇటుక బట్టీలు కోట్ల సంఖ్యలో ఇటుకలను తయారు చేస్తున్నాయి. స్థానిక కూలీలతో పాటు ఒడిశా నుంచి వచ్చిన కార్మికులు రాయితీత పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ప్రస్తుతం ఇటుక ధర రూ.6గా ఉండగా, అమరావతిలో పనులు జోరందుకుంటే రూ.10 వరకు పెరిగే అవకాశం ఉంది. చెరువుల నుంచి సేకరించే సారవంతమైన మట్టి, ఎన్టీటీపీఎస్ బూడిద, రైస్ మిల్లుల నుంచి వరి పొట్టు, స్థానికంగా లభించే కలప వంటి ముడిసరుకులతో ఇటుకల తయారీ సాగుతోంది. ఈ బట్టీలు కుటీర పరిశ్రమలుగా వృద్ధి చెందుతున్నాయి.


ఇటుకల తయారీ

'జీవ వైవిధ్యం' అవార్డులకు 13లోగా ఎంట్రీలు

అమరావతి, మే8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా 'ప్రకృతితో సామరస్యం.. స్థిరమైన అభివృద్ధి' అనే అంశంతో ఈనెల 22న అమరావతిలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు, బహుమతుల కోసం వివిధ విభాగాల్లో ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్టు రాష్ట్ర జీవవైవిధ్య మండలి చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, సభ్య కార్యదర్శి పి.రామకృష్ణ గురువారం తెలిపారు. రాష్ట్రంలో జీవవైవిధ్యంపై కృషిచేస్తున్న, ఎంపిక చేసిన వ్యక్తులకు వ్యక్తిగత విభాగంలో ఏపీ జీవవైవిధ్య సంరక్షణ అవార్డులు, జీవవైవిధ్య ప్రచారంలో కృషి చేస్తున్న జర్నలిస్టులకు 'గ్రీన్‌జర్నలిస్ట్' అవార్డులు, గ్రామాల్లో జీవవైవిధ్య నిర్వహణ సంఘాల్లో పని చేస్తున్న వారికి రాష్ట్ర జీవవైవిధ్య సంరక్షణ అవార్డులు, సంప్రదాయ విజ్ఞానం ద్వారా జీవవైవిధ్యాన్ని సంరక్షించే వారికి అవార్డులు ఇస్తామన్నారు. ప్రకృతితో సామరస్యం.. స్థిరమైన అభివృద్ధి అనే అంశంతో వర్సిటీలు, కాలేజీలు, స్కూల్ విద్యార్థుల నుంచి వ్యాసరచన, చిత్రలేఖనం, ఛాయాచిత్రాలను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. 22న అమరావతిలో జరిగే జీవ వైవిధ్య దినోత్సవం కార్యక్రమంలో జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే స్టాల్స్ ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. అవార్డులకు జీవవైవిధ్యంలో సాధించిన విజయాలు, సంబంధిత పేపర్ కటింగ్‌లు, ఫోటోలను 'రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డ్, ప్లాట్ నంబరు 209, వాల్నట్ బ్లాక్, రెయిన్ ట్రీపార్కు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా, గుంటూరు జిల్లా-522508' చిరునామాకు ఈ నెల 13లోపు పంపాలని సూచించారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, మే 8(ఆంధ్రజ్యోతి) : రింగ్‌రోడ్డు సెక్షన్‌లో పరిధి లోని విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్ స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఐసీ కాలనీ, జయప్రకాష్‌నగర్, ఫిల్మ్ కాలనీ, క్రీస్తురాజపురం, మిథులా నగర్, వరలక్ష్మీనగర్, ప్రశాంతి నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

'ఇంటికో పారిశ్రామికవేత్త' లక్ష్యం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇంటికి ఒక వ్యాపారి, ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురువారం 14వ డివిజన్ దర్శిపేట పూజితా అపార్ట్‌మెంట్ ఏరియాలో ఆయన పర్యటించారు. స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డివిజన్‌లో రూ.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పలు రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు సంపద సృష్టించి అభివృద్ధి చేసి చూపడమే చంద్రబాబు లక్ష్యమని, ఉమ్మడి ఏపీలో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన విధంగానే ఇప్పుడు అమరావతిని అభివృద్ధి చేయనున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన 11 మాసాల్లో అనేక అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, రాదారపు ఎల్లబాబు, ముమ్మనేని ప్రసాద్, నర్రా కిషోర్, గరికపాటి శ్రీనివాసరావు, కర్నా కోటేశ్వరరావు, చెరుకూరి సాంబయ్య, కార్పొరేషన్ ఈఈ సామ్రాజ్యం, ఏఈ జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



దర్శిపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న గద్దె రామ్మోహన్




అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్‌లు

అగ్నిమాపక అధికారుల ఆకస్మిక తనిఖీలు

షాపింగ్ మాల్స్, షోరూమ్‌లలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

బెంజిసర్కిల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డు, గాయత్రినగర్‌లోని శుభమస్తు షాపింగ్ మాల్, జోసా లూక్కాస్, ఎలిన్‌సోలీ షోరూం తదితర షోరూమ్‌లలో గురువారం వీఎంసీ అగ్నిమాపక అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మాల్స్ షోరూమ్స్‌లోని ఫైర్ సేఫ్టీ పరికరాలను పరిశీలించారు. అనంతరం డెమానిస్ట్రేషన్ నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, నిరోధక పరికరాల వినియోగం, మంటలను ఎలా ఆర్పాలి, ఎటువంటి పరికరాలు వినియోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్ స్మోక్ డిటెక్టర్స్ ఎక్కడ అమర్చాలి, వాటి వల్ల స్మోక్ అలారం ఎలా మోగుతుంది తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీధి వ్యాపారస్తులకు ఐడీ కార్డులు జారీ చేయాలని, అదేవిధంగా ట్రేడ్ లైసెన్స్ ఉండాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర స్పష్టం చేశారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో గురువారం టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీలో 19మంది సభ్యులతో చైర్మన్‌గా ఉన్న కమిషనర్ ధ్యానచంద్ర ఈ సమావేశంలో వీధి వ్యాపారస్తుల సమస్యలు, కమిటీ పనితీరును వివరించారు. వీధి వ్యాపారస్తులు రెడ్‌జోన్, గ్రీన్‌జోన్, అంబర్‌జోన్ వంటి మూడు జోన్‌లలో వ్యాపారం చేసుకోవచ్చన్నారు. ఈ మూడు జోన్‌లో ఏప ప్రాంతాలు ఉండాలో వాటిని ఫీల్డ్ ఇన్‌స్పెక్టర్ ద్వారా అధికారులు పరిశీలించి కమిటీ ముందుకు నివేదిక సమర్పించాలని చెప్పారు. సర్వే చేసి ప్రస్తుతం ఉన్న వీధి విక్రయదారులను తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరపాలకసంస్థ తరపున ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా కమిటీ ద్వారా జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ శర్వాణి మూర్తి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి. వెంకటనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

వీధికుక్కల బెడద

● స్థానికుల ఇబ్బందులు



భారతీనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కాలనీ మెయిన్, అంతర్గత రోడ్లల్లో వీధికుక్కలు గుంపులుగా తిరగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడో డివిజన్ లోని శ్రీరామచంద్రనగర్ కాలనీ, కరెన్సీనగర్ కాలనీ, కనకదుర్గా నగర్, కామినేని నగర్ కాలనీలో వీధి కుక్కలు బెడద ఎక్కువగా ఉంది. ఈ కాలనీలో మెయిన్, అంతర్గత రోడ్లలో వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రి సమయంలో బయటకు రావాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాజీవ్‌నగర్‌లో చోరీ

పాయకాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి) : పాయకాపురం రాజీవ్‌నగర్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. కొయ్యాని శ్రీను ఈనెల 6న ఇంటికి తాళం వేసి భీమవరంలోని అత్తింటికి వెళ్లాడు. తిరిగి గురువారం ఉదయం వచ్చే సరికి గేటు తాళం పగులకొట్టి ఉండటం, ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గుర్తించి లోపలికి వెళ్లగా ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో తన ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో ఉండాల్సిన రూ. లక్ష నగదు, రూ. 50 వేలు విలువగల బంగారు నగలు చోరీకి గురైనట్లు పోలీసుల ఫిర్యాదులో శ్రీను పేర్కొన్నాడు.

విద్యుత్ శాఖ తనిఖీలు

● 132 మందికి రూ.3.92 లక్షల అపరాధ రుసుం

ప్రభుత్వాసుపత్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): గుణదలసెక్షన్ పరిధిలోని కరెన్సీనగర్, కామినేనినగర్, గణేష్‌నగర్, గుణదల, క్రీస్తురాజుపురం, లూర్దునగర్‌లలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం అధికారులు గురువారం తనిఖీలు చేశారు. 33 బృందాలుగా ఏర్పడి 2,855 సర్వీసులను తనిఖీ చేసినట్లు, 132 మంది అదనపు లోడు వాడుతున్న వారిని గుర్తించి రూ.3.92 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఈఈ డీపీఈ (విజిలెన్స్) పి.విజయకుమారి, ఆపరేషన్ ఈఈ పి.హరిబాబులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు ఇ.రామమూర్తి, బి.నవీన్ కుమార్, ఎం.శివకుమార్, ఏఈ డి.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఈ డీపీఈ (విజిలెన్స్) పి.విజయకుమారి

దుర్గగుడి అన్న ప్రసాద, శిఖర స్వర్ణ తాపడానికి విరాళాలు



దాతకు చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అన్నవితరణ నిమిత్తం విజయవాడ లబ్బీపేటకు చెందిన టి.హనుమంతరావు గురువారం ఆలయానికి విచ్చేసి రూ.1,11,116లు విరాళం అందించారు. గుంటూరుకు చెందిన బి.కోట్య నాయక్, గర్భాలయ శిఖర స్వర్ణతాపడానికి రూ.1,00,116లు విరాళం అందించారు.

ఈ సందర్భంగా దాతలకు, కుటుంబీకులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వారికి వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అధికారులు, అర్చకులు వీరికి లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. ఆదాయం పన్ను మినహాయింపు (80జి) స్వర్ణ శిఖరం పనులకు వర్తింపజేయడం సంతోషదాయకమని దాత బి.కోట్య నాయక్ పేర్కొన్నారు.



స్వర్ణతాపడ పనులకు విరాళం అందజేసిన దాత కుటుంబీకులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

స్కేటింగ్‌లో శాన్విక అరుదైన రికార్డు

ఇంటర్నేషనల్ బుక్ రికార్డ్స్‌లో స్థానం పొందిన రెండేళ్ల చిన్నారి

విజయవాడ(స్పోర్ట్స్), మే 8 (ఆంధ్రజ్యోతి): విజయాలు సాధించడంలో వయసుతో సంబంధం లేదని, ప్రతిభ ఉంటే ఎవరైన విజయాలు సాధించవచ్చని ఈ చిన్నారి నిరూపించింది. గొల్లపూడిలో నివసించే దేవతు శాన్విక(రెండేళ్ల 9నెలల వయస్సు) స్కేటింగ్‌లో ఇంటర్నేషనల్ బుక్ రికార్డ్స్ లో చోటు సంపాదించింది. అతిచిన్న వయస్సులో 400మీటర్లు స్కేటింగ్ చేసి ఈ ఘనత సాధించింది. ఈ ఘనత సాధించిన సమయంలో చిన్నారి వయస్సు కేవలం 2సంవత్సరాల 7నెలల 23రోజులు. గతంలో ఈ రికార్డ్ 3సంవత్సరాల 4నెలలు వయస్సున్న బాలుడు సాధించగా అతను నగరానికి చెందిన బాలుడే కావడం మరో విశేషం. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు సాయి రవితేజ, నవ్యసుధ లు మాట్లాడుతూ తమ పాప స్కేటింగ్‌పై ఆసక్తిని గమనించి నేర్పించినట్లు తెలిపారు. స్కేటింగ్ ప్రారంభించిన రెండు నెలలకే ఈ ఘనత సాధించిందని తమకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తమ పాప స్కేటింగ్‌ను రికార్డ్ చేసి ఇంటర్నేషనల్ రికార్డ్ సంస్థకు పంపగా వారు వివిధ పరీక్షల అనంతరం ఈ రికార్డ్‌ను నమోదు చేశారని తెలిపారు.




స్కేటింగ్ చేస్తున్న, రికార్డుతో చిన్నారి శాన్విక



కనకదుర్గ నగర్ కాలనీలో మెయిన్ రోడ్డులోని ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు

ఖాళీ స్థలాలతో ప్రజల ఆరోగ్యం ఖాళీ

భారతీనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గ నగర్ కాలనీలో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడో డివిజన్‌లోని పరిధిలోని శ్రీ రామ చంద్రనగర్ కాలనీ, గణేష్ నగర్, కనకదుర్గనగర్, తదితర కాలనీలోని అంతర్గత రోడ్లలో నివాసాల మధ్య అక్కడక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటి గురించి స్థల యజమానులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం పచ్చగడి, పిచ్చి మొక్కలు, చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ ఖాళీ స్థలాల్లో మురుగు, పచ్చగడ్డి వలన దోమలు బాగా వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల వలన చిన్నారులు, వృద్ధులు ఎక్కడ అనారోగ్యానికి గురవుతారోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే వర్షాకాలంలో ఆ ఖాళీ స్థలాల్లో వర్షం నీరు చేరి చెరువులా మారి ప్రమాదకరంగా ఉంటాయంటున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి ఎన్.మధుకర్

బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ

వన్‌టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన మన సైనిక సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతూ బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి ఎన్.మధుకర్ జాతీయ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకు సాగింది. ముస్లిం మహిళలు భారీ విజయోత్సవ ర్యాలీలో పాల్గొని దారి పొడవునా బాణసంచా పేల్చారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూ దేశం మొత్తం ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం చేసుకుంటుందన్నారు. ఇద్దరు భారతీయ వీర వనితలు సాహసోపేతంగా ఉగ్రశిబిరాలపై దాడులు చేయటంతో ఉగ్రవాదులు విలవిల లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శాసనసభా పక్ష నేత పెన్మత్స విష్ణుకుమార్ రాజు, మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బాషా, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, మైనార్టీ మోర్చా నేతలు ఖర్దూస్, రఫీ, షర్మిల, ఖాతూన్, దిలీప్, బొడ్డు నాగలక్ష్మి, ప్రవీణ్ జైన్, పీయూష్ దేశాయ్, నూతల పాటి బాల తదితరులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

చిట్టినగర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం మహంతిపురంకు చెందిన అగ్రహారపు పోతురాజుకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె స్రవంతి (23)కి 2020లో నగరంలోని కట్టా హేమంత్ కుమార్‌తో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు. స్రవంతి కూడా తల్లిదండ్రుల వీధిలోనే ఓ అద్దె ఇంట్లో కాపురం ఉంటుంది. బుధవారం భర్త డ్యూటీకి వెళ్లిన తర్వాత స్రవంతి అదేరోజు అర్ధరాత్రి ఇంట్లోని కొక్కేనికి చున్నీతో ఉరేసుకుంది. గురువారం ఉదయాన్నే పోతురాజు కూతురు కోసం వెళ్లగా వేలాడుతూ కనబడటంతో స్థానికుల సహాయంతో కిందకు దించగా కుమార్తె మృతిచెంది ఉంది. దీంతో పోతురాజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కంచి పీఠానికి నవ శకం

ఇష్టప్రాప్త్యనిష్ట పరిహారయోః అలౌకికముపాయం యో వేదయతి స వేదః...

మంచిని పెంపొందించడానికి, చెడును తొలగించడానికి అలౌకికమైన ఉపాయాన్ని తెలియజేసేది వేదం. వేదాలు భగవత్ప్రాప్తికి సోపానాలైన కర్మలనే కాకుండా... లౌకిక జీవితానికి తోడ్పడే సదాచారమనే ధర్మాన్ని కూడా బోధిస్తున్నాయి. అసలు వేదమంతా ధర్మాన్ని మాత్రమే ఉపదేశిస్తోందంటూ 'వేదోఖిలో ధర్మమూలమ్' అని ఋషులు నిర్ణయం చేశారు. అటువంటి వేద జ్ఞానం భారతదేశ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రభావితం చేసింది. ఈ జాతి ఖ్యాతిని ఇనుమడింపజేసింది. అందుకనే భారతదేశం 'వేదభూమి'గా, 'యోగభూమి'గా, 'కర్మభూమి'గా పిలుపులు అందుకుంటోంది.

మోక్షపురి... కాంచీపురి

ఈ యుగంలో దేశం నలుమూలలకూ సంచారం చేసి తన ఉపదేశాల ద్వారా, రచనల ద్వారా ధర్మాన్ని వ్యాప్తిచేసిన జగద్గురువు ఆది శంకరులు. జగత్తు ఉన్నన్ని రోజులు ఆయన బోధలు వ్యవహారంలో ఉంటాయి. ఆయన అపురూప సృష్టి... మఠాల స్థాపన. దక్షిణంలో శృంగేరి శారదా పీఠం, తూర్పున జగన్నాథ పూరీలో గోవర్ధన మఠం, పశ్చిమంలో సముద్ర తీరాన ద్వారకలో కాళికా మఠం, ఉత్తరాన బదరీనాథ్ సమీపాన జ్యోషిమఠ్ ఏర్పాటు చేశారు. ఆది శంకరులు తన అవతార సమాప్తి సమయాన... కాంచీపురంలో కామకోటి పీఠాన్ని నెలకొల్పి, ఆ క్షేత్రంలోనే శివైక్యం చెందారని తెలుస్తున్నది. కాంచీపురి మోక్షపురిగా వెలసింది. కంచి శివ క్షేత్రమూ, విష్ణు క్షేత్రమూ కూడా. కామాక్షీ విగ్రహం బిందు స్థానంగా అనేక ఇతర దేవాలయాలను కూడా ఆది శంకరులు నిర్మింపజేశారు. ఈ మఠాల నిర్వహణ నియమాలన్నీ శ్రీ శంకరులు చెప్పగా సుధన్వుడు రాసుకొని 'మహానుశాసనం' అనే పేరుతో గ్రంథం తయారు చేశాడు. ఆసక్తి రేకెత్తించే మరొక అంశం మనకు కాచీపురంలోని వరదరాజస్వామి వారి దేవాలయంలో దర్శనమిస్తోంది. 'కుడియాంతన్‌దళం' అనే గ్రామానికి 'శంకరాచార్యపురం', అలాగే 'సురుట్టిల్' అని పేర్లు ఉన్నట్టు అక్కడి శాసనాల అధ్యయనం వెల్లడయిన విషయాన్ని 1919లో ప్రచురితమైన ఒక నివేదిక పేర్కొంది. అలాగే క్రీస్తుశకం 1507 నాటి శ్రీవీర నరసింహదేవ కాలానిదైన రాగి రేకులోని వివరాల ప్రకారం... 'కుడియాంతండలం' అనే ప్రదేశాన్ని అప్పటి పీఠాధిపతి శ్రీ మహదేవ సరస్వతికి ఆనాటి విజయనగర ప్రభువు బహూకరించినట్టు తెలుస్తున్నది. ఆ గ్రామం... సురుట్టిల్‌కు పశ్చిమ దిక్కులో ఉంది. ఇంత ప్రాచీనత ఉన్న ఈ మఠ కార్యక్రమాలు ఇప్పుడు మన దేశంలోనే కాదు... అన్ని ప్రపంచ దేశాలకు విస్తరించాయి. ధార్మిక సేవలు నిర్వహిస్తూ, భక్తులకు మార్గ దర్శనం చేస్తున్నాయి.

సత్యనారాయణ క్షేత్రం నుంచి సత్యవ్రత క్షేత్రానికి

కాగా... ఈ ఏడాది ఏప్రిల్ 30న, శ్రీ ఆది శంకరుల 2534వ జయంతిని పురస్కరించుకొని... దుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశ్ ద్రావిడ్‌కు సన్యాస దీక్షను ప్రస్తుత కంచి పీఠాధిపతి అనుగ్రహిస్తున్నట్టు పీఠం శ్రీకార్యం (కార్యనిర్వహణాధికారి) గత నెల 25న ప్రకటించారు. వేదాధ్యయనం, శాస్త్ర పరిచయంలో శిష్య స్వామి అసమాన ప్రతిభ గురించి కూడా ఆయన ఆ ప్రకటనలో వెల్లడించారు. దీక్షా ప్రదానం రోజున చేసిన ఏర్పాట్లు అందరినీ మంత్రముగ్ధుల్ని చేశాయి. దీనికోసం ఎంపిక చేసిన ముహూర్తం అద్వితీయం. గురువు సమక్షంలో... శిష్యస్వామి ఎలాంటి జంకు లేకుండా, పంచభూతాల సాక్షిగా "ఓం సన్యస్తం మయ" అని ప్రకటన చేయగానే... భక్తుల ఆనందాతిశయం మిన్నంటింది. బ్రహ్మచర్యం నుంచి సన్యాస దీక్షకు సిద్ధమైన ఆ బాల 'పెరియవ' (స్వామి) వదనంలో శంకరుల దీక్షను దర్శించినవారికి... ఉత్తమానంద స్థితి అక్కడే సిద్ధించింది. ఈ సందర్భంగా ఒక ముఖ్యమైన విషయాన్ని ప్రస్తావించాలి. వరాలకు వ్రతాలకు సంబంధం ఉంది. అన్నవరంలో శ్రీసత్యనారాయణ వ్రతం చేస్తే వరాలు లభిస్తాయని పేర్కొంటూ, సత్యవ్రతం పాటించకపోతే వచ్చే కష్టాల గురించి వ్రత కథ చెబుతోంది. అలాగే ముక్తికి, సత్యవ్రతానికి ఉన్న విడదీయరాని సంబంధాన్ని 'ఛాందగ్యోపనిషత్తు' వివరించింది. కాంచీపురిలో సత్యవ్రతేశ్వరుడి ఆలయం ఉంది. ఆ ఊరికి 'సత్యవ్రత క్షేత్రం' అనే పేరు ఉంది. శ్రీ కంచి కామకోటి మఠం బిరుదావళిలో... సత్యవ్రత నామాన్ని 'కాంచి దివ్య క్షేత్ర' అని చెప్పడం జరిగింది. మహా సామ్రాజ్యాన్ని ఇచ్చినా కంచి క్షేత్ర వాసులు సత్యాన్ని విడనాడరని నాయనార్లు కీర్తించారు. అన్నవరం సత్యనారాయణ క్షేత్రం నుంచి సత్యవ్రత క్షేత్రమైన కంచికి వచ్చి సన్యాసం స్వీకరించిన శిష్య స్వామి నామం ముందు 'సత్యం' అని చేర్చడం ఎంతో సమంజసంగా ఉంది. అంతేకాదు... 'కచటపాది విధానం'లో 'సత్య' అనే పదం 71ని సూచిస్తుంది. శ్రీశిష్య స్వాములు కంచి కామకోటి పీఠాన్ని 71వ అధిపతిగా అధిష్ఠించబోతున్నారు. 'నడిచే దైవం'గా జగత్ ప్రసిద్ధి చెందిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు... ప్రస్తుత స్వామి వారికి 'శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి' అని నామకరణం చేశారు. వారి సత్యవ్రతం సర్వజన విదితం. ఆయన నామధేయానికే 'సత్యం' అనే విశేషణాన్ని అలంకరించి 'శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి'గా ... శిష్య స్వామికి ప్రస్తుత పీఠాధిపతి నామకరణం చేయడం ముదావహం.

ఆద్యంతం నేత్రపర్వం

ఈ దీక్షా స్వీకారోత్సవం జరిగిన ప్రదేశ విశిష్టతను క్లుప్తంగా తెలుసుకుందాం. అంబికకు 'లలితా త్రిశతి'లో 'కామకోటి నిలయ' అనే పేరు ఉంది. ఇక్కడ ఆ తల్లి... గురురూపిణి, బ్రహ్మవిద్యా స్వరూపిణి. ఆమె ఆకాశరూపంలో వ్యాప్తి చెంది ఉంది. ఆమె 'ఈషణాత్రయా'న్ని (ధనేషణ, పుత్రేషణ, లోకేషణ) హరింపజేస్తుంది. శిష్య స్వాములకు అద్వైత ప్రతిపాదకాలైన మహా వాక్యాల ఉపదేశం ఆ దేవాలయంలోని పంచగంగ సరస్సు తీరంలో జరిగింది. కంచి కామకోటి పీఠంలో నాలుగు మహావాక్యాలను బోధించడం ఒక విశిష్టత. గురుశిష్యుల కలయిక సమయంలో... పక్షులు తమ కిలకిలారవంతో... ఆ రూపంలో విహరిస్తున్న దేవతలుగా కనిపించడం అపూర్వ సాక్ష్యం. అలాగే శిష్యుని శిరస్సుపై సాలగ్రామాన్ని గురుస్వామి ఉంచి అభిషేకించినప్పుడు... అన్నవరంలో కుంభవృష్టి కురవడాన్ని యాదృచ్ఛికంగా భావించలేం. శిష్య స్వామి సన్యాస దీక్ష కార్యక్రమం సందర్భంగా... కనీసం 10 వేల మంది ఆ సరస్సు దగ్గర ఆశీనులయ్యారు. కాంచీపుర వీధుల నిండా భక్తజన సందోహం కనిపించింది. శ్రీ శంకర విజయేంద్ర సరస్వతికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రార్థనలు అందజేసి, ఈ దీక్షా కార్యక్రమం మహత్తును కొనియాడారు. శ్రీ స్వామివారిని గుజరాత్ రాష్ట్ర పర్యటనకు ఆహ్వానించారు. అనేకమంది ప్రముఖులు హాజరైన ఈ వేడుకకు... తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి భక్తునిగా రావడం విశేషం. "బాసర అమ్మవారికి అమూల్యమైన సేవలు అందించిన శిష్య స్వామి... పీఠాన్ని అధిష్ఠించడం తెలంగాణ ప్రజలందరికీ సంతోషదాయకం, గర్వకారణం" అని తన ఆనందాన్ని వ్యక్తపరచిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధన్యులు.

• లంక వేంకట సుబ్రహ్మణ్యం
పూర్వ శ్రీకార్య నిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

పుష్కర సరస్వతి

సమాచారం

నదులను దేవతలుగా భావించి, పూజించే సంస్కృతి మనది. మన జీవన అవసరాలను తీర్చే నదులకు కృతజ్ఞతలు తెలుపుకొనే సంప్రదాయాన్ని పుష్కరాల రూపంలో పూర్వులు నిర్దేశించారు. తదనుగుణంగా ఒక్కొక్క రాశిలో బృహస్పతి ప్రవేశించినప్పుడు... ఒక్కొక్క నదికి పుష్కరాలు జరుగుతాయి. పన్నెండు ప్రధాన నదులకు... పన్నెండేళ్ళకు ఒక్కోసారి పుష్కరాలు వస్తాయి. ఆ పుష్కర నదుల్లో సరస్వతి ఒకటి. మిగిలిన నదుల్లా కాకుండా అంతర్వాహినిగా ప్రవహించడం ఈ నది ప్రత్యేకత. ఋగ్వేదంలో, పురాణాల్లో సరస్వతీ నది ప్రస్తావన ప్రముఖంగా ఉంది. పవిత్రమైన సప్త నదుల్లోనూ సరస్వతికి విశిష్ట స్థానం ఉంది. అందుకే, స్నానం చేసినప్పుడు... *గంగే చ యమునే చైవ గోదావరీ సరస్వతీ... నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు...* అంటూ ఈ నదులను తలచుకోవడం పుణ్యప్రదమని చెప్పారు పెద్దలు. బృహస్పతి మిధున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు వస్తాయి. ఈ ఏడాది మే 15 నుంచి 26వ తేదీ వరకూ పన్నెండు రోజుల పాటు సరస్వతీ నదికి పుష్కరాలు జరగబోతున్నాయి.



ఎక్కడ?: సరస్వతీ నది పుట్టిన చోటుగా పరిగణించే ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బదరీనాథ్ సమీపంలో ఉన్న మానా గ్రామంలో పుష్కర స్నానాల కోసం ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సరస్వతీ నది... అలకనంద నదికి ఉపనది. కేశవ ప్రయాగ దగ్గర అలకనందలో కలుస్తుందంటారు. అలాగే సరస్వతీ నది అంతర్వాహినిగా... ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో, గుజరాత్‌లోని సోమనాథలోని త్రివేణీ సంగమాల్లో, రాజస్థాన్‌లోని పుష్కర్‌లో కలుస్తుందనే విశ్వాసం ఉంది. ఆ ప్రాంతాల్లో కూడా పుష్కరాలను నిర్వహిస్తున్నారు.

కాళేశ్వరంలో ప్రతిష్ఠాత్మకంగా...

తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం... సరస్వతీ నది పుష్కరాలకు సిద్ధమవుతోంది. గోదావరి, ప్రాణహిత నదులతో సరస్వతి కలిసే త్రివేణీ సంగమంలో పుష్కర స్నానాల కోసం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 15 నుంచి 26 వరకు జరిగే పుష్కరాల్లో భాగంగా... శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో నిత్యం వివిధ హోమాలను నిర్వహిస్తారు. అలాగే ప్రధాన ఘాట్ వద్ద నదీ హారతి కార్యక్రమం ఉంటుంది. శ్రీ మాధవానంద సరస్వతి, శ్రీ పరిపూర్ణానంద స్వామి, శ్రీ సచ్చిదానంద సరస్వతి, శ్రీ విద్యాశంకర భారతి, ఆచార్య సంవిదానంద సరస్వతి మహరాజ్, శ్రీ జగద్గురు విద్యారణ్య భారతి, శ్రీ యోగానంద సరస్వతి తదితర ఆధ్యాత్మిక ప్రముఖులు ఈ పుష్కరాలకు హాజరై ప్రార్థనలు చేస్తారు, అనుగ్రహభాషణలు చేసి, భక్తులకు ఆశీస్సులు అందజేస్తారు. పుష్కరాల కోసం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలతో సహా పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ మహా సరస్వతి అమ్మవారి ఆలయం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంతో పాటు సమీప ఆలయాల సందర్శించుకోవచ్చు.

గీతాసారం

సమత్వమే యోగం

మానవుల బుద్ధి నిశ్చయాత్మకంగా ఉండాలని, అలా లేనివారి బుద్ధి బహు శాఖలుగా (అనేక భేదాలతో) ఉంటుందని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. "సమత్వమే యోగం" అని కూడా అన్నాడు. జీవితంలో మనం ఎదుర్కొనే సుఖం-దుఃఖం, గెలుపు- ఓటమి, లాభం-నష్టం లాంటి ధ్రువాల కలయిక ఇది. ఈ ధ్రువాలను అధిగమించే మార్గం కర్మయోగం. అది చివరకు నిశ్చయాత్మకమైన బుద్ధిగా మారుతుంది. సమతుల్యత లేని బుద్ధి మన మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తుంది. సుఖం, విజయం, లాభం పొందినప్పుడు... మనశ్శాంతి దానికదే కలుగుతుందని మనం అనుకుంటాం. కానీ కర్మయోగం ద్వారా వచ్చే నిశ్చయాత్మకమైన బుద్ధి... ద్వంద్వాలను అధిగమించడానికి సాయపడుతుందని, అదే మనకు మనశ్శాంతిని ఇస్తుందని కృష్ణుడు చెబుతున్నాడు.

అస్థిరమైన బుద్ధి వివిధ పరిస్థితులను, ఫలితాలను, వ్యక్తులను భిన్నంగా చూస్తుంది. మనం పనిచేసే కార్యాలయంలో మనం కింది ఉద్యోగులకు ఒక కొలమానాన్ని, మన పై అధికారులకు మరొక కొలమానాన్ని వర్తింపజేస్తాం. కుటుంబాల్లో భిన్నమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు వివిధ ప్రమాణాలను అనుసరిస్తాం. మనకు ఇష్టమైన వారి కోసం ఒక నియమం, ఇతరుల కోసం మరొక నియమం పాటించడాన్ని గమనించే పిల్లల్లో... సమత్వం అభివృద్ధి చెందడం కష్టమవుతుంది. దైనందిన జీవితంలో మనం కులం, మతం, మూఢనమ్మకాల లాంటి వాటి ప్రభావానికి గురవుతూ ఉంటాం. ఎదుగుతున్న దశలో... మన మనస్సుల మీద వాటి ముద్ర పడుతుంది. అవి మనల్ని విభజిస్తాయి. ఈ విభజనలు అన్ని వైపుల నుంచి మనల్ని ప్రభావితం చేస్తాయి. బుద్ధి అస్థిరంగా ఉన్నప్పుడు... మన తప్పులను గుర్తించడానికి ఒక కొలమానం, ఇతరుల తప్పులు ఎంచేటప్పుడు మరొక కొలమానం అనుసరిస్తాం. మనం సాయం కోరుతున్నప్పుడు ఒకలా సాయం చేస్తున్నప్పుడు మరోలా ఉంటాం. దీన్ని నివారించడానికి, కర్మయోగ మార్గాన్ని అనుసరించాలి. అప్పుడు నిశ్చయాత్మకమైన బుద్ధి కలుగుతుందని, మనశ్శాంతికి పునాది అయిన సమత్వాన్ని సాధించే యోగ్యత పొందుతారని శ్రీకృష్ణుడు ఉపదేశిస్తున్నాడు.



కె.శివప్రసాద్



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి

ప్రజలకు నష్టం కలగకుండా ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

» సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి

తిరుపతి, మే 8 (ఆంధ్రజ్యోతి): 'పహల్గాం ఘటన సందర్భంగా ఒక వర్గాన్ని వ్యతిరేకిస్తూ దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టడం సరైంది కాదు. ఈ ఘటనలో పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అయితే ప్రతిదాడిలో ప్రజలకు నష్టం జరగకుండా ఉగ్రవాదాన్ని నాశనం చేయాలి. అందుకు మా మద్దతు ఉంటుంది. అదే విషయాన్ని ప్రధాని నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలోనూ సీపీఎం స్పష్టత ఇచ్చింది' అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి అన్నారు. తిరుపతిలో మూడు రోజుల పాటు జరిగే సీపీఎం రాష్ట్ర సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు సమావేశంలో ఎంఏ బేబి మాట్లాడుతూ దేశ ప్రజలందర్నీ కుల, మతాలకు అతీతంగా ఒకతాటిపై నిలబెట్టాల్సిన బాధ్యత ఎర్రజెండాపై ఉందన్నారు. పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ... 'దేశంలో ప్రజాసంక్షేమం కరువైంది. లేబర్ కోడ్ వంటి ప్రజా వ్యతిరేక చట్టాలను తెచ్చి ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నారు' అని మండిపడ్డారు. ఉగ్రవాదానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా అన్ని కులాలు, మతాలు, ప్రాంతాల ను ఐక్యంచేసి పోరాడాలని రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

నూతన కౌలు చట్టాన్ని తేవాలి: సీపీఐ

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కౌలు రైతుల సంక్షేమం కోసం సమగ్రమైన నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలని సీపీఐ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఇతర నేతలు జల్లి విల్సన్, ముప్పాళ్ల నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబుని కలసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో అకాల వర్షాలకు తడిసి రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధర ప్రకారమే కొనుగోలు చేయాలని, వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన పంటలకు అందించే పరిహారాన్ని పెంచాలని కోరారు. 'అన్నదాత' పథకాన్ని సొంత భూమి లేని కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని కోరారు. ఇంకా పలు అంశాలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఆర్టీటీ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

జస్టిస్ పర్వతరావుకు హైకోర్టు ఘన నివాళి

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎస్.పర్వతరావుకు హైకోర్టు ఘన నివాళులర్పించింది. ఈమేరకు గురువారం మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం తమ ప్రసంగాలలో జస్టిస్ పర్వతరావు అందించిన న్యాయసేవలను గుర్తు చేసుకున్నారు. పలు కీలక తీర్పులు ఇచ్చారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ చల్లా కోదండరామ్, జస్టిస్ విజయలక్ష్మి, అడిషనల్ సొలిసిటర్ జనరల్ ధనంజయ, అడిషనల్ అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, ప్రభుత్వ న్యాయవాదులు, రిజిస్ట్రార్లు, కోర్టు ఉద్యోగులు, జస్టిస్ పర్వతరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీలో ఎల్జీ అడుగు

» శ్రీసిటీలో మంత్రి లోకేశ్ శంకుస్థాపన

» ఏపీలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం



కొబ్బరికాయ కొట్టి ఎల్జీ యూనిట్ నిర్మాణానికి శ్రీకారంచుట్టిన మంత్రిలోకేశ్

సత్యవేడు/అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారుతోంది. ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్జీ.. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో భారీ పరిశ్రమ స్థాపించడానికి శ్రీకారం చుట్టింది. తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఆ కొరియా సంస్థ రూ. 5 వేల కోట్లకుపైగా పెట్టుబడితో పరిశ్రమను నిర్మిస్తోంది. దీనికి గురువారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సృష్టించే ప్రతి ఉద్యోగం, ప్రతి ఆవిష్కరణ ద్వారా ఏపీని ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్‌గా మార్చేందుకు తమ ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. ఇవాళ తాము ఎల్జీ యూనిట్‌కు మాత్రమే కాకుండా, ఏపీ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నామని అన్నారు. రాష్ట్రంతో పాటు దేశ పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక పురోగతిలో ఈ శంకుస్థాపన ఓ మైలురాయి అని అభివర్ణించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడ్డాక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానంతో ఏర్పాటవుతున్న తొలి పరిశ్రమ ఎల్జీయేనని చెప్పారు. ఏపీని ఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రపంచ స్థాయి కేంద్రంగా మార్చాలనే తమ ఆశయాన్ని ఎల్జీ సంస్థ ముందుకు తీసుకువెళుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా మారుతోందన్నారు. మేడిన్ ఆంధ్రా నుంచి మేడ్ ఫర్ ది వరల్డ్ వరకూ రాష్ట్ర జైత్రయాత్ర కొనసాగుతుందన్నారు. ఏపీ భవిష్యత్తుపై చంద్రబాబు నిబద్ధతతకు ఈ పరిణామాలు అద్దంపడుతున్నాయని చెప్పారు. భారత్‌లో కొరియా రాయబారి లీ సియాంగ్ మాట్లాడుతూ, గతంలో సీఎం చంద్రబాబు సహకారంతో ఏపీలో తమ దేశానికి చెందిన కియా కంపెనీ ఏర్పాటైందని, ఇపుడు ఎల్జీ వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్న సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హొంగ్ జు జియోన్, ఆ సంస్థ హోమ్ సొల్యూషన్స్ సీఈవో జేచియోల్ లియు, ఎకో సొల్యూషన్స్ సీఈవో జే సంగ్‌లీ, సత్యవేడు, శ్రీకాళహస్తి, నగరి, చంద్రగిరి ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం, బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, పులివర్తి నాని, సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ జి.శ్రీనివాసులు, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్ అభిషిక్త కిశోర్, కాన్సులేట్ జనరల్ (ఏపీ, తెలంగాణ) చుక్కపల్లి సురేష్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

సంప్రదాయం పాటించిన కొరియన్లు

భూమిపూజ కార్యక్రమం సందర్భంగా ఎల్జీ పరిశ్రమ కొరియన్ ప్రతినిధులు షూస్ ధరించే భూమిపూజ జరుగుతున్న ప్రదేశానికి వచ్చారు. అది గమనించిన మంత్రి లోకేశ్ ఆ షూస్ తీసేయాలని వారికి విజ్ఞప్తి చేశారు. హిందూ సంప్రదాయాన్ని పాటిస్తూ కొరియన్ ప్రతినిధులు తమ షూస్ తీసేసి భూమిపూజలో పాల్గొన్నారు.

రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో కొత్త అధ్యాయం: సీఎం చంద్రబాబు

ఎల్జీ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ రాష్ట్రానికి రావడం చాలా సంతోషాన్నిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో ఇది కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించనుందని తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ సంస్థ రూ. 5,800 కోట్ల పెట్టుబడితో 2,500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనుందన్నారు. ఏపీ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తయారుకావడానికి ఇది ప్రారంభమన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు 100 శాతం ప్రోత్సాహకాలు కల్పిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

దేశంలో మూడో ప్రాజెక్ట్

శ్రీసిటీలో ప్రారంభమయ్యే ప్లాంట్‌కు ఎల్జీకి మూడోది. దేశంలో నోయిడా, పుణెల్లో ఆ సంస్థకు మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. శ్రీసిటీలో ఎల్జీకి 247 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడ నిర్మిస్తున్న ప్లాంట్‌లో ఏటా 15 లక్షల ఏసీలు, 8 లక్షల రిఫ్రిజిరేటర్లు, 8.5 లక్షల వాషింగ్ మెషీన్లు, 20 లక్షల ఏసీ కంప్రెసర్లు ఉత్పత్తి కానున్నాయి. వచ్చే ఏడాది ఆఖరుకు ఇక్కడ ఉత్పత్తి ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. 2029 నాటికి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.

మావోయిస్టు జగన్‌పై వందకుపైగా కేసులు

ఆయనపై 20 లక్షల రివార్డు

» ఘటనా స్థలంలో 2 ఏకే 47లు, 303 రైఫిల్, 98 వేల నగదు స్వాధీనం

» మీడియాతో అల్లూరి ఎస్పీ అమిత్ బర్దర్

రంపచోడవరం, మే 8(ఆంధ్రజ్యోతి): 'అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్లో మృతి చెందిన ఇద్దరు మావోయిస్టు నేతల్లో ఒకరు కాకూరి పండన్న ఎలియాస్ జగన్. ఆయన తలపై 20 లక్షల రివార్డు ఉంది. ఆయనపై 100కు పైగా కేసులున్నాయి' అని ఆ జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు. గురువారం ఎన్‌కౌంటర్ ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం రంపచోడవరంలో మీడియాతో మాట్లాడారు. 'మావోయిస్టుల కదలికలపై సమాచారం రావడంతో విస్తృతంగా గాలింపు చేపట్టాం. వై.రామవరం మండలం దుమకొండ-గంగకొండ అటవీ ప్రాంతానికి చేరుకునేసరికి పోలీసులపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు సాగించిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మరణించిన వారిలో ఒకరు కాకూరు పండన్న ఎలియాస్ జగన్‌గా గుర్తించాం. ఏవోబీ పరిధిలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ ఈయన అనేక నేరాలకు పాల్పడ్డారు. వాటిలో 100కు పైగా కేసుల్లో ఈయన కీలక నిందితుడిగా ఉన్నారు. జగన్ స్పెషల్ జోనల్ కమిటీ(ఎస్‌జడ్‌సీ) సభ్యుడిగా కొనసాగుతున్నారు. మరో మావోయిస్టును వాగపొడియామి అలియాస్ రమేశ్‌గా గుర్తించామన్నారు. ఈయనపై 30కి పైగా కేసులున్నాయి. రూ.5 లక్షల మేర రివార్డు ఉంది. ఘటనా స్థలంలో రెండు ఏకే 47 తుపాకీలు, ఒక 303 రైఫిల్, తుపాకీ గుళ్ల మ్యాగ్జైన్‌లు, చిన్నకత్తి, రూ.98 వేల నగదు, కిట్ బ్యాగ్‌లు, 3 జతల కళ్లద్దాలు, మావోయిస్టు సాహిత్యం, యూనిఫాం, ఇతర వస్తువులు ఉన్నాయి. ఈ ఘటనపై వై.రామవరం పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశాం' అని ఎస్పీ తెలిపారు. కాగా, జగన్, రమేశ్ మృత దేహాలకు శుక్రవారం రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మృతుల బంధువులు వస్తే వారికి భౌతిక కాయాలను అప్పగించే అవకాశం ఉంది.

ఏపీ నుంచి గుజరాత్‌కు విద్యుత్

» ఏఎంఎన్ఎస్‌కు పునరుత్పాదక విద్యుత్ సరఫరా ప్రారంభం

» ఆర్సెలార్ సీఈవో ఆదిత్య మిట్టల్ వెల్లడి

న్యూఢిల్లీ, మే 8: పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ మరో ఘనత సాధించింది. మన రాష్ట్రంలో నిర్మించిన తన 1 గిగావాట్ ఏఎం గ్రీన్ ఎనర్జీ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు నుంచి గుజరాత్‌కు విద్యుత్ సరఫరాను ఆర్సెలార్ విట్టల్ ప్రారంభించింది. సుమారు రూ. 5,900 కోట్లకు పైగా పెట్టుబడితో ఏపీలో నిర్మించిన తన సొంత సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టు నుంచి గుజరాత్‌లోని ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ (ఏఎంఎన్ఎస్) ఇండియా ప్రాజెక్టుకు తాజాగా సరఫరా మొదలు పెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తమ అతిపెద్ద పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు నుంచి ఏఎంఎన్ఎస్‌కు క్లీన్ ఎనర్జీని అందించడం ప్రారంభమైంది అని ఆర్సెలార్ మిట్టల్ సంస్థ గురువారం తెలిపింది. ఈ విద్యుత్ సరఫరాతో ఏఎంఎన్ఎస్ నుంచి ఏటా 1.5 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఆర్సెలార్ మిట్టల్ సీఈవో ఆదిత్య మిట్టల్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టే తమ తొలి అతి పెద్ద పునరుత్పాదక ప్రాజెక్టు అని వెల్లడించారు. 18 నెలల్లో దానిని విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ఏపీలో 2,400 ఎకరాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో 15 లక్షల విద్యుత్ ప్యానల్స్‌ను, 700 ఎకరాల్లో 91 విండ్ టర్బయిన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి నుంచి ఉత్పత్తి అయ్యే 2.5 కిలోవాట్ హవర్స్‌తో కోటి కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చన్నారు.

జగన్.. జనం నిన్ను నమ్మరు

» విద్యుత్ సంస్థలపై1.29 లక్షల కోట్ల రుణ భారం: మంత్రి గొట్టిపాటి

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): 'విద్యుత్తు చార్జీల విషయంలో ప్రజలకు మేలు చేశానంటూ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెబుతున్న మాటలను రాష్ట్ర ప్రజలు విశ్వసించరు. సెకీ నుంచి యూనిట్ విద్యుత్తు రూ.2.49కు కొనుగోలు చేశామని జగన్ చెబుతున్నా... వాస్తవ ధర యూనిట్ రూ.7.90 అని ప్రజలకు బాగా అర్థమైంది' అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం తాడేపల్లిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సెకీ కంటే యాక్సిస్ ధరే తక్కువని ప్రజలు గ్రహించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్తు సంస్థలపై ఏకంగా రూ.1,29,000 కోట్ల రుణ భారాన్ని వేశారు. విద్యుదుత్పత్తి సంస్థలలో ఉత్పత్తిని తగ్గించేసి కమీషన్ల కోసం పీక్ అవర్‌లో యూనిట్ విద్యుత్తును సగటున రూ.9.30 చొప్పున కొనుగోలు చేసి జనం సొమ్మును లూటీ చేశారు. అవినీతి పత్రికను అడ్డం పెట్టుకుని కూటమి ప్రభుత్వంపై జగన్ విష ప్రచారం చేస్తున్నారు' అని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

కేంద్రానికి ఆర్‌బీఐ బంపర్ బొనాంజా!

- ఈసారి రూ.3.50 లక్షల కోట్ల వరకు డివిడెండ్ అందించే అవకాశం
- కోటక్ మహీంద్రా బ్యాంక్ అంచనా



న్యూఢిల్లీ: భారత ప్రభుత్వానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరోసారి బంపర్ బొనాంజా ప్రకటించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్రానికి ఆర్‌బీఐ రూ.3.5 లక్షల కోట్ల వరకు డివిడెండ్ చెల్లించే అవకాశం ఉందని కోటక్ మహీంద్రా బ్యాంక్ అంచనా వేయగా.. ఈ మొత్తం రూ.3 లక్షల కోట్ల స్థాయిలో ఉండవచ్చని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ భావిస్తోంది. ఈసారి ఆర్‌బీఐ నుంచి రూ.2.56 లక్షల కోట్ల డివిడెండ్ లభించవచ్చన్న ప్రభుత్వ బడ్జెట్ అంచనా కంటే అధికమిది. అంతక్రితం ఆర్థిక సంవత్సరానికి (2023-24) గాను ఆర్‌బీఐ అందరి అంచనాలకు మించి రూ.2.1 లక్షల కోట్ల మిగులు నిధులను కేంద్రానికి బదిలీ చేసింది. ఈసారి నిధుల బదిలీ గతసారితో పోలిస్తే కనీసం 50 శాతం మేర పెరగవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

ఫారెక్స్ మార్కెట్ కార్యకలాపాల ద్వారా కమీషన్లు, విదేశీ కరెన్సీ ఆస్తులు, ప్రభుత్వ సెక్యూరిటీలపై వడ్డీ ఆదాయం, కరెన్సీ ముద్రణ రుసుము రూపంలో ఆర్‌బీఐకి ఆదాయం సమకూరుతుంది. అందులో నుంచి అవసరమైన కేటాయింపులు జరిపిన అనంతరం మిగిలిన నిధులను ఆర్‌బీఐ కేంద్రానికి డివిడెండ్ రూపంలో బదిలీ చేస్తుంది. ఈనెలాఖరుకల్లా ఆర్‌బీఐ డివిడెండ్‌ను ప్రకటించనుంది.

వృద్ధి మందగమనం నేపథ్యంలో ఈ ఏడాది పన్ను వసూళ్లు బడ్జెట్ లక్ష్యం కంటే తగ్గడంతో పాటు మార్కెట్ ఒడుదుడుకుల కారణంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం (డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా కేంద్రం అనుకున్న మేరకు నిధులు సమీకరించలేకపోవచ్చు. ఆ ఆదాయ లోటును ఆర్‌బీఐ డివిడెండ్ భర్తీ చేయనుంది. ఈసారి స్థూల పన్ను వసూళ్లు బడ్జెట్ అంచనా కంటే రూ.లక్ష కోట్లు, డిజిన్వెస్ట్‌మెంట్ ఆదాయం రూ.40,000 కోట్ల మేర తగ్గవచ్చని కోటక్ బ్యాంక్ ఆర్థికవేత్త ఉపాసన భరద్వాజ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్రవ్య లోటును లక్ష్యం మేరకు (జీడీపీలో 4.4 శాతానికి) కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ బంపర్ చెల్లింపులు తోడ్పడనున్నాయని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌కు చెందిన గౌర సేన్ గుప్తా పేర్కొన్నారు.

కెనరా బ్యాంక్ లాభం రూ.5,070 కోట్లు


బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు

క్యూ4లో 28 శాతం వృద్ధి

రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.4 డివిడెండ్

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను బ్యాంక్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.5,070.19 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.3,951.76 కోట్లు)తో పోల్చితే లాభం 28 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.37,429.90 కోట్ల నుంచి రూ.40,256.19 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో ప్రొవిజనింగ్స్ తగ్గటం, కీలకేతర ఆదాయాలు పెరగటం ఎంతగానో కలిసివచ్చిందని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు వెల్లడించారు. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం 33 శాతం వృద్ధితో రూ.3,757.23 కోట్ల నుంచి రూ.5,002.66 కోట్లకు పెరిగింది. స్టాండ్‌ఎలోన్ ఆదాయం కూడా రూ.34,025.18 కోట్ల నుంచి రూ.37,352.80 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలంలో బ్యాంక్ రుణ వృద్ధి రేటు 11 శాతం పెరిగినప్పటికీ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 1.44 శాతం తగ్గుదలతో రూ.9,442 కోట్లుగా నమోదైందని కెనరా బ్యాంక్ పేర్కొంది. దీంతో నికర వడ్డీ మార్జిన్ 0.25 శాతం తగ్గి 2.80 శాతానికి చేరుకుందని తెలిపింది. మరోవైపు మార్చి త్రైమాసికంలో వడ్డీయేతర ఆదాయం 21.74 శాతం వృద్ధితో రూ.6,351 కోట్లుగా నమోదైంది. రైటాఫ్ చేసిన ఖాతాల నుంచి రికవరీలు 30 శాతం పెరుగుదలతో రూ.2,471 కోట్లకు చేరుకోవటం ఇందుకు కారణమని బ్యాంక్ పేర్కొంది. ఇదే సమయంలో ట్రెజరీ ఆదాయం కూడా 15 శాతం వృద్ధితో రూ.995 కోట్లకు చేరుకున్నాయి. మరోవైపు మొండి బకాయిల (ఎన్‌పీఏ) కోసం చేసిన కేటాయింపులు కూడా రూ.2,483 కోట్ల నుంచి రూ.1,831 కోట్లకు తగ్గినట్లు తెలిపింది. మార్చి త్రైమాసికంలో బ్యాంక్ స్థూల ఎన్‌పీఏలు 4.23 శాతం నుంచి 2.94 శాతానికి తగ్గగా నికర ఎన్‌పీఏలు 1.27 శాతం నుంచి 0.70 శాతానికి తగ్గాయి. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.17,539.62 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.15,278.57 కోట్లుగా ఉంది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 200 శాతం (రూ.4) డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

ఈ ఏడాది రుణ వృద్ధి లక్ష్యం 11 శాతం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 10-11 శాతం రుణ వృద్ధి రేటును సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ సత్యనారాయణ రాజు వెల్లడించారు. ఇదే సమయంలో డిపాజిట్ వృద్ధి రేటును కూడా 9 శాతానికి పైగా, ఎన్ఐఎం 2.75-2.8 శాతం మధ్యన కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బ్యాంక్ క్యాపిటల్ అడిక్వసీ రేషియో (సీఏఆర్) 16.39 శాతంగా ఉందని ఆయన చెప్పారు.

రూ.25 లక్షల కోట్లకు గ్లోబల్ వ్యాపారం

మార్చి ముగిసే నాటికి బ్యాంక్ గ్లోబల్ వ్యాపారం 11.32 శాతం వృద్ధితో రూ.25,30,215 కోట్లకు చేరుకుంది. గ్లోబల్ డిపాజిట్లు రూ.14,56,883 కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ డిపాజిట్లు 9.56 శాతం పెరిగి రూ.13,31,137 కోట్లుగా ఉన్నాయి. బ్యాంక్ రిటైల్ రుణ పోర్టుఫోలియో 42.80 శాతం వృద్ధితో రూ.2,23,366 కోట్లకు, గృహ రుణ విభాగం 13.57 శాతం వృద్ధి చెంది రూ.1,06,167 కోట్లకు చేరుకున్నట్లు కెనరా బ్యాంక్ తెలిపింది.

రూ.5 లక్షల కోట్ల నష్టం

సెన్సెక్స్ 412 పాయింట్లు పతనం

ముంబై: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగిన నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు అప్రమత్తమై అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 411.97 పాయింట్లు కోల్పోయి 80,334.81 వద్దకు జారుకుంది. ఆరంభంలో స్వల్ప లాభాల్లో ప్రారంభమైన సూచీలు మధ్యాహ్నం వరకు పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. మధ్యాహ్నం నుంచి ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లలో లాభాల స్వీకరణకు దిగటంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ట్రేడింగ్ చివర్లో సెన్సెక్స్ 759 పాయింట్లు పతనమై 80,000 దిగువకు పడిపోయినప్పటికీ.. వెంటనే తేరుకుంది. నిఫ్టీ విషయానికొస్తే, ఇంట్రాడేలో 264.2 పాయింట్ల వరకు క్షీణించిన సూచీ.. చివరికి 140.60 పాయింట్ల నష్టంతో 24,273.80 వద్ద స్థిరపడింది. అమ్మకాల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.418.50 లక్షల కోట్లకు (4.93 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 నష్టపోయాయి.

- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 81 పైసల నష్టంతో రూ.85.58 వద్ద ముగిసింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. రూపాయికి రెండున్నర ఏళ్లకు పైగా కాలంలో ఇదే అతిపెద్ద ఒక్కరోజు క్షీణత.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	500
వరంగల్	492	గోదావరి	500
చిత్తూరు	563	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	విజయవాడ	134
వరంగల్	135	గుంటూరు	132
కరీంనగర్	135	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	107
కర్నూలు	135	నెల్లూరు	112
విశాఖపట్నం	131	అనంతపురం	112
గోదావరి	134		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,600 ▲	91,300 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	98,000 ▼
విశాఖపట్నం	1,00,340 ▼	91,300 ▲	1,11,000 ▲
రాజమండ్రి	99,020 ▲	89,850 ▼	99,300 ▼
ప్రొద్దుటూరు	97,500 ▼	89,700 ▼	97,400 ▼
ముంబై	97,030 ▼	88,880 ▼	95,225 ▼

బ్యాంకులు పారాహుషార్

సైబర్ సెక్యూరిటీ కట్టుదిట్టం

న్యూఢిల్లీ: భారత-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో బ్యాంకులు కూడా అప్రమత్తమయ్యాయి. తమ వెబ్‌సైట్లు, సర్వర్ల మీద పాక్ సైబర్ కేటుగాళ్ల (హ్యాకర్లు) దాడి చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాయి. వీటికి తోడు పాక్ సరిహద్దులకు సమీపంలో ఉన్న శాఖల్లో భద్రతను మరింత పటిష్ఠం చేశాయి. అలాగే ఆ ప్రాంతాల్లోని ఏటీఎంలను నగదుతో నింపేశాయి. 'మా సైబర్ భద్రతా వ్యవస్థను బలోపేతం చేశాం. ఎలాంటి సైబర్ దాడి జరిగినా వెంటనే స్పందించేందుకు 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేశాం. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర చెప్పారు.

ఎక్స్ఛేంజీలూ అప్రమత్తం: స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ కూడా తమ సైబర్ భద్రతా చర్యలను ముమ్మరం చేశాయి. విదేశాల నుంచి ఎవరూ తమ వెబ్‌సైట్లను ఓపెన్ చేయకుండా చర్యలు చేపట్టాయి. బీఎస్ఈ అయితే మార్కెట్ పార్టిసిపెంట్స్ అందరూ తమ వ్యవస్థను ఎవరూ హ్యాక్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

కియా నుంచి కారెన్స్ క్లావిస్



న్యూఢిల్లీ: దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం కియా.. తన పాపులర్ కారు కారెన్స్‌లో ప్రీమియం వెర్షన్ 'కారెన్స్ క్లావిస్'ను గురువారం ఆవిష్కరించింది. భారత్ నుంచే అంతర్జాతీయ మార్కెట్లోకి ఈ కారును విడుదల చేసినట్లు కియా ఇండియా హెడ్ హర్దీప్ సింగ్ బ్రార్ వెల్లడించారు. దేశీయ మార్కెట్లో ఎంపీవీ, ఎస్‌యూవీ 7 సీట్ల విభాగాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ కొత్త మోడల్‌ను తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. ప్రీమియం ఫీచర్లు, మూడు వరుసల్లో సీటింగ్ సహా మరికొన్ని ప్రత్యేకమైన ఫీచర్లతో కారెన్స్ క్లావిస్‌ను రూపొందించినట్లు ఆయన తెలిపారు. మాన్యువల్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్స్‌తో పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో ఈ కారు అందుబాటులో ఉండనుంది. ఈ కారు బుకింగ్స్‌ను కియా ఇప్పటికే ప్రారంభించగా ధరను మాత్రం నెలాఖరులో ప్రకటించనుంది. కారెన్స్ విడుదల చేసిన మూడేళ్లలోనే 2 లక్షల యూనిట్లను విక్రయించినట్లు కియా ఇండియా ఎండీ, సీఈఓ గ్వాంగు లీ తెలిపారు.

వెల్స్ ఫార్గో చెన్నై జీసీసీ మూసివేత

చెన్నై: అమెరికా ఆర్థిక సేవల కంపెనీ వెల్స్ ఫార్గో చెన్నైలోని తన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను మూసివేయనుంది. భారత కార్యకలాపాల దశల వారీ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఈ కేంద్రాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) చివరి త్రైమాసికానికల్లా పూర్తిగా మూసివేయాలని కంపెనీ నిర్ణయించింది. అందులో పనిచేస్తున్న సిబ్బందిని బెంగళూరు లేదా హైదరాబాద్‌లోని తన కార్యాలయాలకు బదిలీ కావాలని కోరింది. బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలోని వెల్స్ ఫార్గో కార్యాలయాల్లో దాదాపు 10,000 మంది పని చేస్తున్నారు. అందులో ఎంత మంది చెన్నై కార్యాలయంలో పనిచేస్తున్నారన్న విషయాన్ని మాత్రం కంపెనీ వెల్లడించలేదు.

'ఏఎం గ్రీన్'కు కోల్ ఇండియా క్లీన్ పవర్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఏఎం గ్రీన్ అమ్మోనియా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కింద సీఐఎల్, ఏఎం గ్రీన్ అమ్మోనియా ఏర్పాటు చేసే అమ్మోనియా ప్లాంట్లకు దశల వారీగా 4,500 మెగావాట్ల పవన, సౌర విద్యుత్ సరఫరా చేస్తుంది. ఇందులో 2,500 నుంచి 3,000 మెగావాట్ల సౌర విద్యుత్, 1,500 నుంచి 2,000 మెగావాట్ల పవన విద్యుత్ ఉంటుంది.

- పియాజియో వెహికల్స్.. ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి అప్రిలియా ట్యూనో 457 బైక్‌ను విడుదల చేసింది. 457 సీసీ ట్విన్ సిలిండర్, 6 గేర్లతో కూడిన ఈ బైక్ ధర రూ. 3,96,149 (ఏపీ ఎక్స్‌షోరూమ్).
- ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ వేదాంతు ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా తిరుపతిలో కొత్త లెర్నింగ్ సెంటర్‌ను ప్రారంభించింది. అత్యాధునిక సాంకేతికత, డేటా ఆధారిత బోధన పద్ధతులతో తరగతులు నిర్వహించనున్నట్లు వేదాంతు ప్రకటించింది.
- సప్లయ్ చెయిన్ సంస్థ సేఫ్ఎక్స్‌ప్రెస్.. విజయవాడలో అల్ట్రా మోడ్రన్ లాజిస్టిక్స్ పార్క్‌ను ప్రారంభించింది. గన్నవరం మండలంలోని నవరగూడెం వద్ద 3.5 లక్షల చదరపు అడుగుల్లో దీన్ని ఏర్పాటు చేసింది.

నేటి మ్యాచ్ — వేదిక: లఖ్‌నవూ
లఖ్‌నవూ x బెంగళూరు — రా.7.30 నుంచి



ఐపీఎల్‌పై నీలినీడలు

అర్ధంతరంగా నిలిచె..

పాక్ దాడుల నేపథ్యంలో పంజాబ్-ఢిల్లీ మ్యాచ్ రద్దు
10.1 ఓవర్లపాటు సాగిన ఆట


భద్రతా సిబ్బంది సూచనతో స్టేడియంను వీడుతున్న ప్రేక్షకులు

ధర్మశాల: ఐపీఎల్ చరిత్రలోనే ఎన్నడూ చూడని అరుదైన ఘటన ఇది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, పంజాబ్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మ్యాచ్ భద్రతా కారణాల రీత్యా మధ్యలోనే ఆగింది. గురువారం రాత్రి జమ్మూ, పఠాన్‌కోట్‌లపై పాక్ దాడులకు తెగబడింది. దీంతో ముందు జాగ్రత్తగా ధర్మశాలలో బ్లాక్ అవుట్ ప్రకటించగా, ఇక్కడే జరుగుతున్న మ్యాచ్‌ను కూడా అర్ధంతరంగా రద్దు చేశారు. వాస్తవానికి పంజాబ్ ఇన్నింగ్స్ 10.1 ఓవర్లపాటు సజావుగానే సాగింది. ఆ తర్వాత ఒక్కసారిగా స్టేడియంలోని ఓ ఫ్లడ్ లైట్ ఆఫ్ అయ్యింది. మొదట ఏదైనా సమస్య వచ్చిందేమోనని అంతా భావించారు. కానీ కాసేపటికే మరో రెండు ఫ్లడ్‌లైట్లను ఆపేయడంతో స్టేడియంలో చీకటి నెలకొంది. అప్పటికే ఆటగాళ్లతో పాటు అంపైర్లు కూడా మైదానం వీడారు. అలాగే స్టేడియంలోని ప్రేక్షకులను కూడా బయటికి వెళ్లాల్సిందిగా అధికారులు కోరారు. ఈ క్రమంలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా స్థానిక పోలీసులు, ఆర్మీ సిబ్బంది పర్యవేక్షించారు. మరోవైపు పటిష్ఠ భద్రత మధ్య ఇరు జట్ల ఆటగాళ్లను స్టేడియం నుంచి హోటళ్లకు తరలించారు.

ఈ మ్యాచ్ ఆగే సమయానికి పంజాబ్ 10.1 ఓవర్లలో 122/1 స్కోరుతో ఉంది. ప్రియాన్ష్ ఆర్య (34 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 70), ప్రభ్‌సిమ్రన్ (28 బంతుల్లో 7 ఫోర్లతో 50 నాటౌట్) అర్ధసెంచరీలు సాధించారు.

ఓపెనర్ల జోరు: వర్షం కారణంగా ఈ మ్యాచ్ గంట ఆలస్యంగా ఆరంభమైంది. అయితే టాస్ గెలిచిన పంజాబ్ బ్యాటింగ్‌కే మొగ్గు చూపింది. కెప్టెన్ శ్రేయాస్ నిర్ణయాన్ని ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య వమ్ము చేయలేదు. డీసీ బౌలర్లను చెడుగుడు ఆడేస్తూ పరుగుల వరద పారించారు. ఆర్య ఇన్నింగ్స్ తొలి రెండు బంతులను ఫోర్లుగా మలచగా.. అటు ప్రభ్ మూడో ఓవర్‌లో మూడు ఫోర్లు రాబట్టాడు. ఇక చమీర ఓవర్‌లో ఆర్య మరింతగా చెలరేగడంతో 6,4,4తో 18 రన్స్ సమకూరాయి. అయితే ఆరో ఓవర్‌లో పేసర్ నటరాజన్ కేవలం నాలుగు పరుగులే ఇచ్చినా అప్పటికే పవర్‌ప్లేలో 69 స్కోరుతో పటిష్ఠంగా నిలిచింది. ఆ తర్వాత ఆర్య ఓ సిక్సర్‌తో 25 బంతుల్లోనే తన అర్ధసెంచరీని పూర్తి చేశాడు. కుల్దీప్‌ను కూడా వదలకుండా తను పదో ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదగా.. ప్రభ్ ఓ ఫోర్‌తో వరుసగా నాలుగో ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. పదో ఓవర్‌లోనే స్కోరు 122కి చేరిన వేళ.. పేసర్ నటరాజన్ ఈ ప్రమాదకర జోడీని విడదీశాడు. 11వ ఓవర్‌తో తొలి బంతికే ఆర్యను అవుట్ చేశాడు. ఆ వెంటనే శ్రేయాస్ క్రీజులోకి రావడం.. ఫ్లడ్‌లైట్లను ఆపివేయడం జరిగింది. కాసేపటికే అంపైర్లు, ఆటగాళ్లు మైదానం వీడారు.

సాంకేతిక కారణమన్న బీసీసీఐ

బీసీసీఐ మాత్రం స్టేడియం ఉన్న ప్రాంతంలో విద్యుత్ సమస్య కారణంగా ఓ ఫ్లడ్‌లైట్‌లో లోపం తలెత్తిందని, అందుకే మ్యాచ్‌ను రద్దు చేశామని ప్రకటించింది.


ప్రియాన్ష్ (70)
ప్రభ్‌సిమ్రన్ (50 నాటౌట్)

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) తివారి (బి) నటరాజన్ 70, ప్రభ్‌సిమ్రన్ (నాటౌట్) 50, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 10.1 ఓవర్లలో 122/1; వికెట్ పతనం:** 1-122; **బౌలింగ్:** స్టార్క్ 2-0-23-0, చమీర 2-0-27-0, అక్షర్ 2-0-25-0, నటరాజన్ 1.1-0-4-1, కుల్దీప్ 2-0-29-0, మాధవ్ తివారి 1-0-14-0.

లీగ్ కొనసాగేనా?

పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ఐపీఎల్ కొనసాగింపుపై సందిగ్ధత నెలకొంది. గురువారం ధర్మశాలలో మ్యాచ్ ఇన్నింగ్స్ మధ్యలోనే ఆగిపోవడం పరిస్థితి తీవ్రతను చాటిచెబుతోంది. అలాగే లీగ్‌లో విదేశీ ఆటగాళ్లు కూడా ఎక్కువగానే ఉన్నారు. వారి భద్రతను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే వారు తమ ఆందోళనను బీసీసీఐకి తెలియజేశారు. ఇదే విషయమై బోర్డు అత్యవసరంగా సమావేశమైంది. సరిహద్దులో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ.. మ్యాచ్‌ల కోసం ఆటగాళ్లంతా వివిధ ప్రాంతాలకు ప్రయాణించడం ఏమేరకు క్షేమకరమనేది బోర్డు ఆలోచిస్తోంది. కొన్ని నగరాల్లో విమానాశ్రయాలు మూసివేయడంతో సదరు జట్ల ఆటగాళ్లను మ్యాచ్‌ల వేదికలకు తరలించడం ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. ఈ పరిస్థితుల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించడం సబబేనా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరి.. బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

ధర్మశాల నుంచి అహ్మదాబాద్‌కు

పంజాబ్, ముంబై మ్యాచ్ వేదిక తరలింపు

ప్రత్యేక రైలులో ఆటగాళ్లను ఢిల్లీ చేరుస్తాం: బీసీసీఐ

పంజాబ్ కింగ్స్-ముంబై ఇండియన్స్ మధ్య వచ్చే ఆదివారం జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్ వేదిక మారింది. ధర్మశాలలో నిర్వహించాల్సిన ఆ మ్యాచ్‌ను అహ్మదాబాద్ తరలించినట్టు గుజరాత్ క్రికెట్ సంఘం కార్యదర్శి అనిల్ పటేల్ గురువారం వెల్లడించాడు. పాకిస్థాన్‌పై భారత సైన్యం దాడుల నేపథ్యంలో ధర్మశాల విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. దాంతో మ్యాచ్‌ను అక్కడనుంచి తరలిస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. అహ్మదాబాద్‌లో ఆ మ్యాచ్ ఆదివారం మధ్యాహ్నం జరగనుంది. ఇక..ధర్మశాల విమానాశ్రయాన్ని మూసివేయడంతో పంజాబ్, ఢిల్లీ జట్లు అక్కడ నుంచి.. ఢిల్లీకి ఎలా చేరుకుంటాయన్నది ఉత్కంఠగా మారింది. అయితే, ధర్మశాల నుంచి 85 కిలోమీటర్ల దూరంలోనున్న పఠాన్‌కోట్‌కు శుక్రవారం రోడ్డు మార్గం ద్వారా జట్ల ఆటగాళ్లు, సహాయ సిబ్బంది చేరుకుంటారని బీసీసీఐ వెల్లడించింది. పఠాన్‌కోట్ నుంచి వీళ్లందరినీ ప్రత్యేక రైలులో ఢిల్లీకి తరలిస్తామని తెలిపింది. ఆదివారం ఢిల్లీ వేదికగా గుజరాత్, ఢిల్లీ జట్లు తలపడనున్నాయి.

స్పోర్ట్స్

అలా సమాచారం.. ఇలా నిర్ణయం!


బీసీసీఐకి రోహిత్ షాక్

న్యూఢిల్లీ: నెల రోజుల్లో భారత జట్టు సుదీర్ఘమైన ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. 2025-27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్‌కు ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌లు ఆడడం ద్వారా శ్రీకారం చుట్టనుంది. ఈ సిరీస్‌కు తానే సారథ్యం వహించాలన్న ఆకాంక్షను రోహిత్ శర్మ పలు సందర్భాలలో వ్యక్తంజేశాడు. కానీ బుధవారంనాడు అనూహ్యంగా రోహిత్.. టెస్ట్‌ల నుంచి రిటైరవుతున్నట్టు ప్రకటించి అటు బీసీసీఐకి ఇటు తన అభిమానులకి షాకిచ్చాడు. అయితే, రోహిత్ అనూహ్య నిర్ణయం వెనక పెద్ద తతంగమే నడిచినట్టు జాతీయ మీడియా కథనం. ఆ కథనాల ప్రకారం.. వచ్చేవారం జాతీయ సెలెక్షన్ కమిటీ ఇంగ్లండ్ టూర్‌కు జట్టును ఎంపిక చేయనుంది. అయితే, సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ కొత్త కెప్టెన్ నేతృత్వంలోనే ఇంగ్లండ్‌తో తలపడాలని పట్టుదలగా ఉన్నాడు. ఈ సమాచారం ఎలాగోలా రోహిత్ చెవిన పడింది. అంతే.. అప్పటికప్పుడే టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పాలనుకున్న రోహిత్ ఈ విషయాన్ని బీసీసీఐకి ఈ-మెయిల్ ద్వారా చేరవేశాడు. దీంతో ఇంత అనూహ్యంగా నిర్ణయం ఎందుకు తీసుకున్నాడంటూ బోర్డు పెద్దలు కూడా షాక్ తిన్నారు. బోర్డుకు ఈమెయిల్ చేసిన కొద్దిసేపటికే సోషల్‌మీడియా ద్వారా తన వీడ్కోలు నిర్ణయాన్ని రోహిత్ వెల్లడించాడు. కాగా..అదే సమయంలో ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఉన్న అజిత్ అగర్కార్ చాలాసేపు సెల్‌ఫోన్లో మాట్లాడుతూ కనిపించాడు. అతడు అంత సుదీర్ఘ సమయం ఫోన్లో సంభాషించింది రోహిత్‌తోనేనట. ఇక..రోహిత్ నిర్ణయాన్ని స్వాగతించిన పలువురు మాజీ క్రికెటర్లు, ఐసీసీ..టెస్ట్‌ల్లో అతడు అందించిన సేవలను కొనియాడారు.

వ్యక్తిగతంగా విమర్శలా?

భారత వ్యాఖ్యాతలపై హిట్‌మ్యాన్ గరం

న్యూఢిల్లీ: భారత క్రికెట్ వ్యాఖ్యాతలపై కెప్టెన్ రోహిత్ శర్మ ఫైర్ అయ్యాడు. ఓ ఆటగాడిని లక్ష్యంగా చేసుకొని ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డాడు. ఆటను వదిలి మసాలా వేయడానికి ఎక్కువగా పాకులాడుతున్నారని చురకంటించాడు. మనోళ్ల వ్యాఖ్యానంతో పోలిస్తే ఆస్ట్రేలియా వ్యాఖ్యాతలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారన్నాడు. 'కామెంటేటర్ల వ్యాఖ్యలు వింటే బాధేస్తుంది. పేలవ ఫామ్ గురించి విమర్శలు చేయడంలో తప్పులేకపోయినా.. దానికీ ఓ హద్దు ఉందనే స్పృహ కామెంటేటర్లలో ఉండాలి. ఏదో మనసులో పెట్టుకొని అదే పనిగా విమర్శలు చేయడం తగదు. కొందరైతే ఆట గురించి విశ్లేషించకుండా, ఆటగాడి వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతుంటారు. భారత్‌లో వ్యాఖ్యాతలు ఏదో ఒక అజెండాతోనే వ్యాఖ్యానం చేస్తున్నట్టు అనిపిస్తుంది. ఇది సరికాదు' అని హితవు పలికాడు.

శ్రీకాంత్‌కు ఆయుష్ షాక్




తైపీ: భారత యువ షట్లర్లు ఆయుష్ షెట్టి, ఉన్నతి హుడా తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో జోరు కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో వారు సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. గురువారం హోరాహోరీగా జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో 20 ఏళ్ల ఆయుష్ 21-16, 15-21, 21-17తో సీనియర్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్‌కు షాకిచ్చాడు. తొలి రౌండ్‌లో.. ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ రన్నరప్ లీ చియాను కంగుతినిపించిన ఆయుష్..క్వార్టర్స్‌లో ఏడో సీడ్ బ్రియాన్ యంగ్ (కెనడా)తో అమీతుమీ తేల్చుకుంటాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఉన్నతి 21-12, 21-17తో స్థానిక క్రీడాకారిణి లిన్ యున్‌పై నెగ్గింది.

పాక్ లీగ్‌కు 'సిందూర్' ఎఫెక్ట్!

టోర్నీని వీడే యోచనలో విదేశీ క్రికెటర్లు

కరాచీ: భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ప్రభావం పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)పైనా పడింది. ఈ కారణంగా పలు మ్యాచ్‌లను రీషెడ్యూల్ చేయాలని పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిర్ణయించింది. రావల్పిండి క్రికెట్ కాంప్లెక్స్‌పై భారత్ డ్రోన్లతో దాడి చేసినట్టు ఓ వీడియో చక్కర్లు కొడుతోంది. అయితే గురువారం రాత్రే ఇక్కడ కరాచీ కింగ్స్-పెషావర్ జల్మీ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సిన మ్యాచ్‌ను వాయిదా వేశారు. ఇక.. రావల్పిండిలో గురువారం నుంచి శనివారం వరకు జరిగే మ్యాచ్‌లను రీషెడ్యూల్ చేయాలని పీసీబీ నిర్ణయించింది. అయితే ఇదే వేదికపై నిర్వహిస్తారా? లేక తరలిస్తారా? అనే విషయంలో స్పష్టత లేదు. అలాగే భారత సైన్యం ప్రతీకార దాడులతో పీఎస్ఎల్‌లో ఆడుతున్న విదేశీ ఆటగాళ్లలో ఆందోళన నెలకొంది. వెంటనే లీగ్‌ను వీడి తమ స్వదేశాలకు వెళ్లే యోచనలో క్రికెటర్లున్నట్టు సమాచారం.



నవ్వించడమే సింగిల్ లక్ష్యం



\- శ్రీవిష్ణు

'మొదటి నుంచి చివరి వరకూ ప్రేక్షకుల్ని నవ్వించాలనే లక్ష్యంతో తీసిన సినిమా 'సింగిల్'. కథ, స్ర్కీన్‌ప్లే కొత్తగా ఉంటుంది. ఇంటర్వెల్, క్లైమాక్స్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది. ఈ కథ ఆద్యంతం హాస్యంతో నవ్విస్తుంది. వ్యంగ్యం, వినోదం కలబోసిన సినిమా ఇది' అని శ్రీవిష్ణు అన్నారు. ఆయన కథానాయకుడిగా కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించారు. శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా శ్రీవిష్ణు మీడియాతో ముచ్చటించారు.

● ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే ప్రేమకథా చిత్రమిది. ముక్కోణపు ప్రేమకథలతో ఇప్పటివరకూ చాలా సినిమాలు వచ్చాయి. కానీ ఇందులో దర్శకుడు సరికొత్త కోణంలో కథను ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. యువతకు చాలా బాగా నచ్చుతుంది. పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు. కుటుంబంతో కలసి ఎంజాయ్ చేసేలా ఉంటుంది.

● గీతా ఆర్ట్స్‌లో సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నా. కార్తీక్ రాజు కథ చెప్పినప్పుడు మంచి ఎంటర్‌టైనర్ అవుతుందనిపించింది. వెన్నెల కిశోర్ ముఖ్య భూమిక పోషించారు. ఈ సినిమాలో నా బాడీ లాంగ్వేజ్ కొత్తగా ఉంటుంది. సినిమాను పూర్తిగా హైదరాబాద్‌లో చిత్రీకరించాం. ఈ మధ్యకాలంలో హైదరాబాద్‌ని ఇంత కొత్తగా ఎవరూ చూపించలేదు. విశాల్ చంద్రశేఖర్ హై ఎనర్జిటిక్ సాంగ్స్ ఇచ్చారు. వేల్‌రాజు సినిమాటోగ్రఫీలో హైదరాబాద్‌ని కొత్తగా చూడబోతున్నారు. కేతిక శర్మ, ఇవానా నటన ప్రేక్షకులను అలరిస్తుంది. వారి పాత్రల్లోని భిన్న ఛాయలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతాయి.

చిరునవ్వులు చిందిస్తూ...



నాగార్జున, ధనుశ్ ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ప్రధాన పాత్రధారుల ఫస్ట్‌లుక్ పోస్టర్లు, ఫస్ట్ సింగిల్ 'పోయిరా మామా' సినిమాపై అంచనాలను పెంచేశాయి. తాజాగా, ఈ సినిమా నుంచి ధనుశ్, రష్మిక కలసి ఉన్న స్టిల్‌ను విడుదల చేశారు మేకర్స్. చిరునవ్వులు చిందిస్తున్న ఈ ఇద్దరి లుక్ ప్రస్తుతం అందర్నీ ఆకట్టుకుంటోంది. జూన్ 20న సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.
















యుద్ధ బీభత్సం!



కరాచీ పోర్టు వద్ద చెలరేగిన మంటలు

పాకిస్థాన్‌కు చావు దెబ్బ!

(మొదటిపేజీ తరువాయి)

దిగింది. అరేబియా సముద్రంలో ఉన్న ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి క్షిపణి దాడులకు శ్రీకారం చుట్టింది. పాక్ కీలక నేవీ స్థావరాలపై క్షిపణుల వర్షం కురిపించింది. భారీ విధ్వంసం సృష్టించింది. ఫలితంగా, పాకిస్థాన్ తీర ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. రక్షణ శాఖ వర్గాల కథనం ప్రకారం.. అరేబియా సముద్రంలో ఐఎన్ఎస్ విక్రాంత్‌తోపాటు 26 భారతీయ యుద్ధ నౌకలు ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి సమయంలో కరాచీ, ఓమ్రారా పోర్టులపై ఐఎన్ఎస్ విక్రాంత్ క్షిపణుల వర్షం కురిపించింది. ఆ సమయంలో కరాచీ నగరమంతా ఆకాశంలో నల్లగా పొగ కమ్మేసింది. పోర్టులో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. పది నుంచి 12 నౌకలు పూర్తిస్థాయిలో ధ్వంసమైనట్లు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. కరాచీ పోర్టులోని కీలక ప్రాంతాలు కూడా మంటల్లో అంటుకున్నాయని, దాంతో, స్థానికులు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారని వివరించాయి. దాడుల్లో రెండు పోర్టులు తీవ్ర స్థాయిలో ధ్వంసమయ్యాయని, పాకిస్థాన్ రక్షణ సామర్థ్యాన్ని ఇది తీవ్రంగా దెబ్బతీస్తుందని స్థానిక వర్గాలు తెలిపాయి. అదే సమయంలో.. ఇదే అదనుగా స్వతంత్ర దేశాన్ని కోరుతున్న బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ రంగంలోకి దిగింది. పాకిస్థాన్‌లోని క్వెట్టాపై విరుచుకుపడింది. అక్కడి పాకిస్థాన్ ఆర్మీ స్థావరాలపై బలూచ్ దళాలు వరుస దాడులు చేశాయి. ఈ క్వెట్టా నగరం బలూచిస్థాన్‌కు రాజధాని కూడా కావడం విశేషం. వరుస పేలుళ్లతోపాటు కొద్ది సమయంపాటు ఇరు వర్గాల మధ్య కాల్పులు కూడా చోటుచేసుకున్నాయి. అనంతరం, క్వెట్టా నగరాన్ని బలూచ్ లిబరేషన్ ఆర్మీ స్వాధీనం చేసుకుంది. ఫలితంగా.. అక్కడి పాక్ ఆర్మీ క్వెట్టా నుంచి పలాయనం చిత్తగిస్తోందని బలూచ్ వర్గాలు తెలిపాయి. ఇదే జరిగితే.. పాకిస్థాన్ మరోసారి మళ్లీ రెండు ముక్కలు అయ్యేందుకు అవకాశం ఉందని తెలుస్తోంది.

(మొదటిపేజీ తరువాయి)

కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుందని, వాటన్నిటినీ మధ్యలోనే అడ్డుకుని కూల్చేశామని వివరించాయి. హమాస్ తరహాలోనే పాకిస్థాన్ ఆర్మీ కూడా వ్యవహరిస్తోందని మండిపడింది. నెల కిందట పాక్ ఆక్రమిత కశ్మీరులో ఐఎస్ఎస్, హమాస్ ఉగ్రవాదుల మధ్య సమావేశం జరిగిన విషయాన్ని ఉటంకించింది. పాక్ డ్రోన్లు, రాకెట్లను భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ధ్వంసం చేస్తుండడంతో అక్కడ భారీ పేలుళ్లు జరుగుతున్నాయా అన్నట్లు పెద్దఎత్తున శబ్దాలు వస్తున్నాయి. అలాగే, కుప్వారా, బారాముల్లాల్లోని నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ భారీ ఎత్తున గుళ్ల వర్షం కురిపిస్తోంది. అయినా, అక్కడ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని అధికార వర్గాలు తెలిపాయి.

బుధవారం రాత్రి నుంచే..

ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రస్థావరాలపై భారత్ జరిపిన దాడులతో రగిలిపోతున్న దాయాది దేశం భారత్‌లోని 15 ప్రధాన నగరాల్లోని ఆర్మీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్రయత్నించింది. జమ్మూకశ్మీర్ నుంచి గుజరాత్ దాకా.. ఉత్తర, పశ్చిమ రాష్ట్రాల్లోని 15 నగరాలపై బుధవారం అర్ధరాత్రి దాటాక చైనాకు చెందిన మిస్సైళ్లు, డ్రోన్లను ప్రయోగించింది. కానీ.. పాక్ ప్రతీకార దాడులను ముందే ఊహించి అప్రమత్తంగా ఉన్న భారతసైన్యం ఆ దాడులను దీటుగా తిప్పికొట్టింది. ఎస్-400 సుదర్శన్ చక్ర ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్స్‌ను ఉపయోగించి.. భారత్‌వైపు దూసుకొస్తున్న క్షిపణులను గాల్లోనే పేల్చేసింది. పాక్ క్షిపణులను ఇంటిగ్రేటెడ్ కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థల సాయంతో వాటిని నిర్వీర్యం చేసినట్టు భారత ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఇవి పాకిస్థాన్ దాడులేనని నిరూపించేందుకు.. పలు ప్రాంతాల్లో కూలిన క్షిపణుల శిథిలాలను సేకరిస్తున్నట్టు పేర్కొంది. ఇక. పాకిస్థాన్ దాడులకు ప్రతిగా మన సైన్యం లాహోర్, కరాచీ, రావల్పిండి సహా పాకిస్థాన్‌లోని తొమ్మిది నగరాల్లో గగనతల రక్షణ, రేడార్ వ్యవస్థలే దాడులు జరిపింది. ఈ దాడుల్లో సియాల్‌కోట్, లాహోర్‌తోపాటు మరో నగరంలో హెచ్‌క్యూ-9 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ లాంచర్లు పూర్తిగా ధ్వంసమైనట్టు సమాచారం. ఈ దాడులను కూడా భారత ప్రభుత్వం తన ప్రకటనలో ధ్రువీకరించింది. "గురువారం ఉదయం భారత సైన్యం పాకిస్థాన్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలను, రేడార్లను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపింది" అని స్పష్టం చేసింది. మరీ ముఖ్యంగా.. లాహోర్‌లోని గగనతల రక్షణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైనట్టు సమాచారం ఉందని వెల్లడించింది. పాక్ చేసిన దాడుల తీవ్రత, స్థాయికి సమంగానే తమ ప్రతిస్పందన ఉందని భారత్ తేల్చిచెప్పింది. మరోవైపు.. జమ్మూకశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కాల్పులను తీవ్రతరం చేసిందని.. కుప్వాడా, బారాముల్లా, యూరీ, పూంచ్, మెంధార్, రాజౌరీ సెక్టార్లలో మోర్టార్ షెల్లింగ్, ఫైరింగ్‌కు పాల్పడుతోందని తెలిపింది. ఇక.. సరిహద్దు గ్రామాల్లో సాధారణ పౌరులే లక్ష్యంగా బుధవారం నుంచి పాక్ జరుపుతున్న కాల్పుల్లో మృతుల సంఖ్య 16కు పెరిగిందని వెల్లడించింది. కాగా.. సరిహద్దుల్లో ఉద్రిక్తవాతావరణం నేపథ్యంలో పంజాబ్, హరియాణా, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీ ప్రభుత్వాలు పూర్తిగా అప్రమత్తమయ్యాయి. ఎమర్జెన్సీ ప్రోటోకాల్స్‌ను అమలు చేస్తున్నాయి. అందులో భాగంగా.. పలు జిల్లాల్లో పోలీసు, ప్రభుత్వ సిబ్బంది సెలవులను రద్దుచేశాయి. పాఠశాలలను మూసివేశాయి. ఎల్‌వోసీ వెంబడి వందలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. భద్రతను కట్టుదిట్టం చేశాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్‌లోని 21 విమానాశ్రయాలను శనివారం దాకా మూసివేశారు. అటు బంగ్లాదేశ్‌తో సరిహద్దులను కలిగి ఉన్న పశ్చిమ బెంగాల్‌లో కూడా ప్రభుత్వ ఉద్యోగుల సెలవులను రద్దు చేశారు. గతంలో మంజూరు చేసిన సెలవులను కూడా ఉపసంహరించి.. ఉద్యోగులంతా విధులకు హాజరు కావాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు.



జమ్మూ గగనతలంలో పాకిస్థాన్ రాకెట్

అన్నీ అబద్ధాలే..

పహల్గాంలో ఏప్రిల్ 22న ఉగ్రదాడికి కుట్రపన్నడం ద్వారా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దాయాది దేశమే తెరలేపిందని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ గుర్తుచేశారు. భారత్ ఆ దాడికి ప్రతిస్పందించిందని.. ఉద్రిక్తతలను ఇంకా పెంచాలనుకోవట్లేదని.. పాక్ గనక ఇంకా ఉద్రిక్తతలను పెంచేందుకు ప్రయత్నిస్తే, అందుకు భారతదేశ ప్రతిస్పందన అదేస్థాయిలో ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి.. గురువారం సాయంత్రం కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత యుద్ధ విమానాలను తాము కూల్చేశామంటూ పాకిస్థాన్ చేసిన ప్రకటనను తోసిపుచ్చారు. పాక్ పుట్టినప్పటి నుంచే అబద్ధాలు ఆడడం మొదలుపెట్టిందని ఎద్దేవా చేశారు. "1947లో జమ్మూకశ్మీర్ తమదేనని ప్రకటించుకున్న పాకిస్థాన్ సాధారణ వ్యక్తులకు కాక.. ఏకంగా ఐక్యరాజ్యసమితికే అబద్ధాలు చెప్పింది. ఈ (పాక్ అబద్ధాల) ప్రయాణం 75 సంవత్సరాల క్రితమే మొదలైంది" అని ఆయన వ్యాఖ్యానించారు. నీలం-జీలం ఆనకట్టను, తమ దేశంలోని మతప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని భారత్ దాడులకు పాల్పడుతోందంటూ పాక్ చేస్తున్న ఆరోపణ.. పూర్తిగా అబద్ధమని ఆయన తేల్చిచెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారతదేశం.. పాక్, పీవోకేలోని ఉగ్ర స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుందని స్పష్టం చేశారు. భారత్‌లోని ఆనకట్టల వంటి మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపే ఉద్దేశంతో పాక్ ఈ ఆరోపణలు చేస్తుంటేగనక.. పర్యవసానాలకు పూర్తి బాధ్యత ఆ దేశానిదేనని హెచ్చరించారు. అలాగే.. పాకిస్థాన్ ఉగ్రవాదులకు కేంద్రస్థానమన్న సంగతి ప్రపంచం మొత్తానికీ తెలుసని మిస్రీ వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడానికి, వారికి ఆశ్రయం ఇవ్వడానికి మతప్రదేశాలను ముసుగుగా పాక్ వాడుకుంటోందని మండిపడ్డారు. "ఒసామాబిన్ లాడెన్ ఎక్కడ దొరికాడో.. ఎవరు అతణ్ని అమరవీరుడని పిలుస్తారో నేను ప్రత్యేకంగా గుర్తుచేయనక్కర్లేదు. ఐక్యరాజ్య సమితితోపాటు వివిధ దేశాలు నిషేధించిన ఎంతో మంది ఉగ్రవాదులకు పాకిస్థానే నివాసస్థానం. పాక్ విదేశాంగ శాఖ మాజీ మంత్రి, రక్షణ మంత్రి సైతం తమ దేశంలో ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చినట్టు ఇటీవలే ఒప్పుకున్న విషయం తెలిసిందే" అని ఆయన పేర్కొన్నారు. పహల్గాం దాడి తమ పనేనని టీఆర్ఎఫ్ ప్రకటించినా.. పాక్ మాత్రం ఐరాసలో ఆ విషయాన్ని ఒప్పుకోవట్లేదని గుర్తుచేశారు. పాక్ జాతీయ పతాకంతో చుట్టిన శవపేటికల్లో పౌరుల మృతదేహాలను ఉంచి, అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించడం విచిత్రంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. "మాకు తెలిసినంతవరకూ అక్కడ చనిపోయింది ఉగ్రవాదులే. ఉగ్రవాదులకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరపడం బహుశా పాకిస్థాన్ సంప్రదాయమేమో" అని వ్యంగ్యంగా అన్నారు. జమ్మూకశ్మీర్‌లో సాధారణ పౌరులే లక్ష్యంగా పాక్ కాల్పులు జరుపుతోందని మిస్రీ మండిపడ్డారు. "జమ్మూ కశ్మీర్‌లో పాకిస్థాన్ సిక్కులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడింది. పూంచ్‌లో ఒక గురుద్వారాపై దాడి చేసింది. అందులో ముగ్గురు చనిపోయారు. పూంచ్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో పాక్ జరిపిన కాల్పుల్లో 16 మంది చనిపోయారు. చాలా మంది గాయపడ్డారు" అని ఆయన పేర్కొన్నారు. కాగా.. పాక్ గనక భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటే తామూ అదేవిధంగా స్పందిస్తామని సోఫియా ఖురేషీ తేల్చిచెప్పారు.



చిమ్మ చీకట్లో..

డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో.. జమ్ము, చండీగఢ్, మొహాలీ, అమృత్‌సర్, పఠాన్‌కోట్ తదితర ప్రాంతాల్లో బ్లాకవుట్ చర్యలు చేపట్టారు. అలాగే, ప్రజలు ఎవరూ బయటకు రాకుండా ఇళ్లల్లోనే ఉండిపోవాలని సూచించారు. దీంతో గురువారం రాత్రి ఆ ప్రాంతాలన్నీ చిమ్మ చీకట్లలో మునిగిపోయాయి. శత్రు దేశాలు రాకెట్లు దూసుకొస్తున్న సమయంలో.. సరిహద్దు ప్రాంతాల్లో లైట్లన్నీ ఆర్పేయాలని సూచిస్తారు. దీనినే బ్లాకవుట్ అంటారు. ఆ సమయంలో ఇళ్లల్లోనూ, బయటా మొత్తం లైట్లు ఆర్పేయడంతో అక్కడ చిమ్మచీకట్లు నెలకొంటాయి.

పాక్‌లో భారీ పేలుళ్లు.. భయాందోళనలు..

లాహోర్‌లోని వాల్టన్ ఎయిర్‌పోర్టు సమీపంలో జరిగిన భారీ పేలుళ్లు స్థానిక ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించాయి. అంతకుముందు.. కరాచీలోని షరాఫీ గోత్ ప్రాంతంలో ఒక పేలుడు సంభవించింది. ఆ రెండు ప్రధాన నగరాల్లోనే కాదు.. రావల్పిండి, గుర్జన్‌వాలా, చక్వాల్, అటోక్, బహావల్‌పూర్, మియాన్‌వాలి, ఛోర్ నగరాలపై భారత్ 12 హెరాన్ డ్రోన్లతో దాడి చేసినట్టు పాకిస్థాన్ డీజీ ఐఎస్‌పీఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ పేర్కొన్నారు. "బుధవారం రాత్రి భారత్ పాక్‌లోని పలు ప్రాంతాలకు డ్రోన్లు పంపడం ద్వారా మరోసారి దాడులకు పాల్పడింది. వాటిలో ఒకటి లాహోర్‌లోని సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఆ దాడిలో నలుగురు సైనికులు గాయపడ్డారు. భారతదేశం ఇలాగే డ్రోన్లను మా గగనతలంలోకి పంపిస్తే అందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారు" అని ఆయన హెచ్చరించారు.

కరాచీ పోర్టు తగలబడిన వేళ..

నాడు బంగ్లా విముక్తి సమయంలో భారత్ దాడి

పశ్చిమ తీరంలో పాక్ నేవీని ఖతం చేసిన మన 'కిల్లర్ స్క్వాడ్రన్'

- స్టైక్స్ క్షిపణులు, బాంబులతో పాక్ ఆయువుపట్టుపై దెబ్బ
- ఇప్పుడూ కరాచీ లక్ష్యంగా దాడులు

న్యూఢిల్లీ, మే 8: అరేబియా తీరంలోని కరాచీ పోర్టు పాకిస్థాన్‌కు ఆయువు పట్టు. దాన్ని ఏమాత్రం దెబ్బతీసినా, స్వాధీనం చేసుకున్నా.. గట్టి దెబ్బతగిలినట్టే. ఈ క్రమంలోనే గురువారం రాత్రి కరాచీ పోర్టును భారత్ టార్గెట్ చేసింది. ఇంతకు ముందు బంగ్లాదేశ్ విముక్తి సమయంలోనూ కరాచీపై భారత్ భారీస్థాయిలో దాడులు చేసింది. ప్రస్తుత దాడులు.. నాటి పరిస్థితిని గుర్తుకు తెస్తున్నాయి.


1971లో బంగ్లాదేశ్ విముక్తి పోరాటానికి మద్దతు ప్రకటించడంతో.. భారత్‌లోని తొమ్మిది ఎయిర్‌బేస్‌లపై పాకిస్థాన్ దాడి చేసింది. దీనితో భారత్ నేరుగా యుద్ధ రంగంలోకి దిగింది.. ఆపరేషన్ ట్రైడెంట్ చేపట్టింది. తూర్పు పాకిస్థాన్‌గా ఉన్న బంగ్లాదేశ్ ప్రాంతానికి ప్రస్తుత పాకిస్థాన్‌కు ఉన్న నౌకాపరమైన అనుసంధానాన్ని తెగ్గొట్టేందుకు.. కీలకమైన కరాచీ పోర్టుపై దృష్టిపెట్టింది. దీనిపై అప్పటి వెస్టర్న్ నావల్ కమాండ్ వైస్ అడ్మిరల్ ఎస్ఎన్ కోహ్లీకి ఆదేశాలు వెళ్లాయి. 1971 డిసెంబర్ 4న పశ్చిమ తీరంలోని ముంబై, ఓఖా స్థావరాల్లోని 25వ మిస్సైల్ బోట్ స్క్వాడ్రన్ నుంచి 'కరాచీ స్ట్రైక్ గ్రూప్' పేరిట రెండు యుద్ధ నౌకలు, నాలుగు మిస్సైల్ బోట్లు బయలుదేరాయి. పెట్యా క్లాస్‌కు చెందిన కట్చాల్, కిల్టన్ యుద్ధ నౌకలు, ఐఎన్ఎస్ నిర్ఘాట్, నిపట్, వీర్ మిస్సైల్ బోట్లు కరాచీ పోర్టుపై దాడికి వెళితే.. మరో మిస్సైల్ బోట్‌ను ద్వారక వద్ద సిద్ధంగా ఉంచారు. మిస్సైల్ బోట్లలో రష్యన్ తయారీ స్టైక్స్ క్షిపణులను సిద్ధంగా ఉంచారు. కరాచీకి 110 కిలోమీటర్ల దూరంలోకి చేరుకున్న ఈ స్క్వాడ్రన్.. సముద్రంలో గస్తీ కాస్తున్న పాక్ యుద్ధ నౌకలు పీఎన్ఎస్ ఖైబర్, పీఎన్ఎస్ ముహాఫిజ్‌లను, పాక్ ఆర్మీకి ఆయుధాలను తరలిస్తున్న ఓ వాణిజ్య నౌకను ధ్వంసం చేశాయి. మరికాస్త లోపలికి చొచ్చుకెళ్లి.. కెమరీ చమురు రిఫైనరీపై క్షిపణి దాడి చేశాయి. ఆ వెనకాలే ఆపరేషన్ పైథాన్ పేరిట వచ్చిన ఐఎన్ఎస్ వినాశ్, తల్వార్, త్రిశూల్ యుద్ధ నౌకలు.. పీఎన్ఎస్ ఢక్కా యుద్ధ ట్యాంకర్‌ను ధ్వంసం చేశాయి. కరాచీ పోర్టుపై క్షిపణులు, బాంబుల వర్షం కురిపించాయి. ఈ దాడిలో కరాచీ పోర్టు తగలబడిపోయింది. పోర్టులో ఉన్న ఎంవీ హర్మట్టన్, ఎంవీ గల్ఫ్ నౌకలు దెబ్బతిన్నాయి. పాకిస్థాన్ నుంచి తూర్పు పాకిస్థాన్ (బంగ్లాదేశ్)కు ఆయుధాలు, ఇతర రవాణా నిలిచిపోయింది. దీనితో తూర్పు పాకిస్థాన్‌లోని ఆర్మీ లొంగిపోక తప్పలేదు.



కరాచీ పోర్ట్ మూసివేస్తే పాక్ కథ ముగిసినట్లే

- 70 శాతం ఎగుమతులు, దిగుమతులు బంద్
- ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం

న్యూఢిల్లీ, మే 8: పాకిస్థాన్ వాణిజ్య రాజధాని అయిన కరాచీ దాయాది దేశానికి అత్యంత కీలక నగరం. అరేబియా సముద్ర తీరంలో ఉన్న కరాచీ పోర్టు నుంచి 70 శాతం ఎగుమతులు, దిగుమతులు జరుగుతుంటాయి. ప్రైవేట్ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టడంతో ఈ నగరం పరిశ్రమల పరంగా కూడా అభివృద్ధి చెందింది. అనేక ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక, అంతర్జాతీయ సంస్థలకు ఇది కీలక నగరంగా మారింది. పాకిస్థాన్ జీడీపీలో 20 శాతం ఈ నగరం నుంచే వస్తుంది. స్టాక్ మార్కెట్‌కు కూడా ఇదే ప్రధాన నగరం. కరాచీ పోర్టును మూసివేస్తే పాకిస్థాన్ త్రివిధ దళాలకు చమురుతో పాటు ఆహారధాన్యాలు, ఔషధాలు, కీలక ఆయుధాల సరఫరా నిలిచిపోతుంది. వాణిజ్య కార్యకలాపాలు స్తంభించే ప్రమాదం ఉంది. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.





పాక్ క్షిపణులపై సుదర్శన చక్రం



భారత్‌లోని 15 నగరాల్లో ఉన్న సైనిక స్థావరాలపై పాకిస్థాన్ బుధవారం రాత్రి క్షిపణులు, డ్రోన్లతో పెద్దఎత్తున దాడి చేసింది. అయితే ఆ దాడుల్ని సమర్థంగా అడ్డుకున్నామని భారత రక్షణ శాఖ ప్రకటించింది. మన 'ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ అండ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్'ను ఉపయోగించి పాక్ క్షిపణుల్ని, డ్రోన్లను కూల్చివేసినట్లు తెలిపింది. పాక్ దాడుల్ని అడ్డుకునేందుకు భారత్ వద్ద ఉన్న ఈ వ్యవస్థలు ఏమిటి అనేది పరిశీలిద్దాం...

యూఏఎస్ అంటే అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ (డ్రోన్లు). ఎక్కడో ఉన్న ఆపరేటర్ వీటిని నియంత్రిస్తూ దాడి చేయిస్తాడు. అంటే వేరేచోటి నుంచి వీటికి సిగ్నల్స్ అందుతుంటాయి. ఇలాంటి రేడియో ఫ్రీక్వెన్సీ సిగ్నల్స్‌ను, డ్రోన్ కంట్రోల్ సిగ్నల్స్‌ను పసిగట్టే సిగ్నల్ ఇంటెలిజన్స్ వ్యవస్థలు భారత్ వద్ద ఉన్నాయి. వీటి ద్వారా డ్రోన్ల ఉనికిని, కదలికల్ని కనిపెడతారు. అలాగే డ్రోన్లు పనిచేయకుండా స్తంభింపజేయగల జామింగ్, స్పూఫింగ్ వ్యవస్థలు కూడా మన వద్ద ఉన్నాయి. వీటిని ఉపయోగించినా డ్రోన్ ముందుకు వస్తుంటే దానిని కూల్చివేయడానికి గన్స్, లేజర్ బేస్డ్ సిస్టమ్స్ ఉన్నాయి. హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఈ యాంటీ డ్రోన్ వ్యవస్థల్ని రూపొందించింది. ఇవి కాకుండా డీఆర్‌డీవో డ్రోన్ డిటెక్షన్ అండ్ డిస్ట్రక్షన్ సిస్టమ్స్‌ను కూడా భారత్ తన పశ్చిమ సరిహద్దులో మోహరించింది. వీటివల్లే పాక్ డ్రోన్లను అడ్డుకోగలిగింది. ఇక పాక్ క్షిపణుల్ని అడ్డుకోవడంలో భారత్ దేశీయంగా రూపొందించిన ఆకాశ్ క్షిపణులు, భారత్-ఇజ్రాయెల్ సంయుక్తంగా రూపొందించిన బరాక్ 8 క్షిపణులు కీలక పాత్ర పోషించగా రష్యా నుంచి ఇటీవల కొనుగోలు చేసిన ఎస్-400 క్షిపణి వ్యవస్థ అత్యంత ప్రధాన పాత్ర నిర్వహించినట్లు రక్షణ నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఎస్-400 చాలా శక్తిమంతమైనది. భారత సైన్యం ఇటీవల మూడు ఎస్-400 రెజిమెంట్లను రష్యా నుంచి కొనుగోలు చేసింది. ఈ వ్యవస్థకు భారత్ 'సుదర్శన్ చక్ర' అని పేరు పెట్టింది.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి

ఎస్-400 సత్తా ఇదీ...

రష్యన్ ఎస్-400 బాలిస్టిక్ క్షిపణుల్ని, క్రూజ్ క్షిపణుల్ని, శత్రు విమానాల్ని గుర్తించి ధ్వంసం చేయగలదు. ఏకంగా 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఇది గుర్తించి దెబ్బతీయగలదు. ఈ క్షిపణి వ్యవస్థను వాహనాల్లో ఎక్కడికైనా సులభంగా తీసుకవెళ్లవచ్చు. అందువల్ల వీటిని ఎక్కడైనా సులభంగా మోహరించవచ్చు. ఈ వ్యవస్థలో నాలుగు రకాల క్షిపణులు ఉంటాయి.

1) 40 ఎన్6ఈ... ఇది 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాంబర్ విమానాలను, అవాక్స్ విమానాలను ధ్వంసం చేయగలదు.
2) 48ఎన్6... ఇది 250 కిలోమీటర్ల దూరంలోని విమానాలను, బాలిస్టిక్ క్షిపణులను ధ్వంసం చేస్తుంది.
3) 9ఎం96ఈ2... ఇది 120 కిలోమీటర్ల రేంజ్ కలిగి తక్కువ ఎత్తులో ఉన్న లక్ష్యాలను అతి వేగంగా కూల్చగలదు.
4) 9ఎం96ఈ... ఇది 40 కిలోమీటర్ల రేంజ్ కలిగి వేగంగా వచ్చే విమానాల్ని, క్షిపణుల్ని అత్యంత కచ్చితత్వంతో కూలుస్తుంది.

పాక్ ఎయిర్ డిఫెన్స్‌పై గురి

మన యుద్ధ విమానాలకు ముప్పు తప్పించే లక్ష్యం



పాకిస్థాన్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలపై భారత్ గురిపెట్టింది. లాహోర్, రావల్పిండి, కరాచీ సహా ఏకంగా తొమ్మిది నగరాల్లోని పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలపై దాడులు చేసింది. చైనా నుంచి దిగుమతి చేసుకున్న హెచ్‌క్యూ 9, ఎల్‌వై 80 వంటి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు పాక్ వద్ద ఉన్నాయి. భారత యుద్ధ విమానాలు, క్షిపణులను అడ్డుకుని కూల్చివేయడం ఈ వ్యవస్థల లక్ష్యం. అందువల్ల భారత్ వ్యూహాత్మకంగా వీటిపై గురిపెట్టింది. సైనిక పరిభాషలో ఇటువంటి ఆపరేషన్లను 'సియాడ్' (సప్రెషన్ ఆఫ్ ఎనిమీ ఎయిర్ డిఫెన్సెస్) అంటారు. మన యుద్ధ విమానాలకు శత్రు ఎయిర్ డిఫెన్స్ నుంచి ముప్పు ఏర్పడినప్పుడు గానీ, లేదా శత్రు భూభాగంలో త్వరలో భారీ దాడులు చేయాలని భావించినప్పుడు గానీ ఈ సియాడ్ దాడులు చేస్తారు. భారత్ ఇంత పెద్దఎత్తున అనేక పాక్ నగరాల్లో సియాడ్ దాడులు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో రాడార్లు ప్రధానమైనవి. ఇవి యుద్ధ విమానాలు, క్షిపణులపైకి రాడార్ సిగ్నల్స్‌ను పంపి వాటి ఆచూకీని కనిపెడతాయి. ఆ తర్వాత క్షిపణులు వెళ్లి వాటిని అడ్డుకుని ధ్వంసం చేస్తాయి. అయితే ఈ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల నుంచి వెలువడే రాడార్ సిగ్నల్స్ ఎదుటి విమానాల్ని కనిపెట్టేందుకే కాదు, తమ ఆచూకీ ఎదుటివారు తెలుసుకునేందుకూ ఉపయోగపడతాయి. ఇలా శత్రు ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల నుంచి వెలువడే రాడార్ సిగ్నల్స్‌ను కనిపెట్టి దాడి చేసే రుద్రమ్, కేహెచ్-31పీ అనే క్షిపణులు భారత్ వద్ద ఉన్నాయి. వీటిలో కేహెచ్-31పీ రష్యన్‌ది కాగా రుద్రమ్ క్షిపణి దేశీయంగా రూపొందించినది. వీటితో పాటు ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేసిన హరోప్ కామికాజ్ డ్రోన్లను కూడా గురువారం నాటి దాడుల్లో ఉపయోగించారు. ఇవి రాడార్ సిగ్నల్స్‌ను కనిపెట్టి ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ వద్దకు చేరుకోవడంతోపాటు దానిపై ఆకాశంలో ఎగురుతూ అకస్మాత్తుగా దాడి చేస్తాయి. భారత్ ఇలాంటి 25 పైగా డ్రోన్లను పాక్‌పైకి పంపినట్లు సమాచారం. వీటన్నింటినీ కూల్చివేసినట్లు పాక్ ప్రకటించినప్పటికీ లాహోర్‌లోని పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలపై ఈ డ్రోన్ దాడి చేయడం వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. లాహోర్‌లో చేసిన దాడిలో లక్ష్యాన్ని గురి తప్పకుండా ఛేదించినట్లు భారత రక్షణ శాఖ సైతం ఒక ప్రకటనలో వెల్లడించింది.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి



కర్ణాటక, కేరళలో చదివి.. ఉగ్రవాదం వైపు..

- పహల్గాం దాడి సూత్రధారి షేక్ సజ్జద్ అహ్మద్‌పై పోలీసుల ఆరా



బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడి సూత్రధారి షేక్ సజ్జద్ గుల్ అలియాస్ సజ్జద్ అహ్మద్ షేక్ కర్ణాటక, కేరళలో ఉన్నత విద్యాభ్యాసం చేసినట్లు తెలిసింది. లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ అనుబంధ టీఆర్ఎఫ్‌లో సజ్జద్ కీలకమని తెలుస్తోంది. బెంగళూరు, కేరళల్లో విద్యాభ్యాసం తర్వాత కశ్మీరులో సొంతంగా డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను తెరిచి, అక్కడి నుంచే ఉగ్రవాదులకు సరుకులు రవాణా చేసేవాడని తెలిసింది. ఆ సంబంధాలతోనే లష్కరే తోయిబా ద్వారా పాక్ చేరుకుని ఐఎస్ఐ కోసం పనిచేస్తున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలోనే సజ్జద్ గురించి ఆ రాష్ట్రాల పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

కాందహార్ సూత్రధారి రవూఫ్ హతం!

- జైషే అధినేత మసూద్‌కు రవూఫ్ సోదరుడు

పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసి పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారం తీసుకున్న భారత్‌కు మరో భారీ విజయం కూడా లభించింది. జైషే మహ్మద్ అధినేత మసూద్ అజర్ తమ్ముడు, కాందహార్ విమానం హైజాక్ మాస్టర్ మైండ్ అబ్దుల్ రవూఫ్ అజర్ ఈ దాడుల్లో మరణించాడు. భారత సైన్యం, వాయుసేన సంయుక్తంగా మంగళవారం అర్ధరాత్రి తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల శిక్షణ, ఆయుధ శిబిరాలు, ప్రధాన కార్యాలయాలపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో మరణించిన 10 మంది మసూద్ అజర్ కుటుంబసభ్యుల్లో రవూఫ్ అజర్ కూడా ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం కాగా, అధికార వర్గాలను ఉటంకిస్తూ న్యూస్ 18 మీడియా సంస్థ దీనిపై ఓ కథనం ప్రచురించింది. ఆపరేషన్ సిందూర్‌లో నేలమట్టమైన బహావల్‌పూర్‌లోని జైషే ప్రధాన స్థావరం మర్కజ్ సుబాన్ కాంప్లెక్స్‌పై జరిపిన దాడిలో రవూఫ్ అజర్ మరణించాడు.

నేపాల్‌లో అపహరించి.. కాందహార్‌లో దింపి..

1999లో నేపాల్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఐసీ-814 విమానాన్ని హైజాక్ చేసిన రవూఫ్ అజర్ దాన్ని అఫ్ఘానిస్థాన్‌లోని కాందహార్‌లో దింపి ప్రయాణికులను అడ్డుపెట్టుకుని భారత్‌తో చర్చలు జరిపాడు. భారతీయ జైళ్లలో ఉన్న తన సోదరుడు మసూద్ అజర్, అల్‌కాయిదా ముఖ్య నేత ఒమర్ సయీద్ షేక్ సహా పలువురు ఉగ్రవాదులను విడుదల చేయాలని డిమాండ్ పెట్టాడు. అప్పటి బీజేపీ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రి జశ్వంత్ సింగ్ జైళ్లలోని ఉగ్రవాదులను తన వెంటపెట్టుకుని పోయి కాందహార్‌లో వారిని హైజాకర్లకు అప్పగించారు.

పాక్‌ను ఆర్థిక దిగ్బంధం చేయాలి

- అఖిలపక్ష భేటీలో టీడీపీపీ నేత శ్రీకృష్ణదేవరాయలు

న్యూఢిల్లీ, మే 8(ఆంధ్రజ్యోతి): మిత్రదేశాలు, అగ్రదేశాలతో మాట్లాడి పాకిస్థాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలు ఆర్థిక ఆంక్షలు విధించేలా చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష సమావేశంలో కోరినట్లు తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌పై గురువారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష భేటీకి టీడీపీ తరఫున ఆయన హాజరయ్యారు. ఆపరేషన్ సిందూర్‌ను టీడీపీ ఈ సందర్భంగా ప్రశంసించింది. పాక్‌పై పోరులో మనం నైతికంగా, వ్యూహాత్మకంగా సరైన దిశలో ఉన్నామని పేర్కొంది. భేటీ అనంతరం ఏపీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లావు మాట్లాడారు. సైన్యానికి మద్దతుగా ఉండాలని సీఎం చంద్రబాబు చెప్పిన విషయాన్ని అఖిలపక్షభేటీలో ప్రస్తావించానన్నారు. భద్రతాపరంగా సున్నితమైన విశాఖపట్నంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. పాక్‌పై పోరులో మనం నైతికంగా, వ్యూహాత్మకంగా సరైన దిశలో ఉన్నామని పేర్కొనట్లు తెలిపారు. రాష్ట్రాలు, పార్టీలకు అతీతంగా సైన్యానికి మద్దతివ్వాలని, మరింత బలం చేకూర్చేలా వ్యవహరించాలని, పాక్‌పై పోరాటంలో భిన్న వ్యాఖ్యలు చేస్తూ వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయకూడదని అఖిలపక్ష భేటీలో తీర్మానించినట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌ను అన్ని రాజకీయ పక్షాలు అభినందించాయని పేర్కొన్నారు. పౌరులకు ఇబ్బంది కలగకుండా ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయడంపై హర్షం వ్యక్తం చేశాయని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌పై మీడియా సమావేశానికి వచ్చిన ఇద్దరు మహిళా అధికారులను అందరూ ప్రశంసించారని పేర్కొన్నారు. పాక్ మన దేశ పౌరులపై జరుపుతున్న కాల్పులకు గట్టిగా బదులివ్వాలని, బాధితులకు తక్షణమే ఆరోగ్య సేవలు అందించాలన్న దానిపై చర్చించినట్లు తెలిపారు. ఇక, పాక్‌పై పోరులో భారత ప్రభుత్వ చర్యలకు, సైన్యానికి వైసీపీ మద్దతుగా ఉంటుందని అఖిలపక్ష సమావేశంలో తెలిపినట్లు ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. సరిహద్దు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వైద్య సదుపాయాలు కల్పించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.

డ్రోన్ దాడి జరిగితే.. పిడుగుపాటు అని కవరింగ్!

రావల్పిండిలో భారీ నష్టం.. పాకిస్థాన్ సూపర్ లీగ్ రద్దు

- లాహోర్‌లోని వాల్టన్‌లో.. నలుగురు సైనికులకు గాయాలు
- లాహోర్‌కు నష్టం జరగలేదు: ఖవాజా
- ప్రతీకారం తీర్చుకుంటాం: షెహబాజ్

(సెంట్రల్ డెస్క్)

"భారత్ డ్రోన్లతో దాడి చేసింది. ఆ దాడిని ప్రత్యక్షంగా చూశాను. ఏం జరిగిందో చూడాలని అటువైపు వెళ్తుండగా పోలీసులు, సైనికులు అడ్డుకున్నారు. ఏమైంది? పెద్ద శబ్దం వచ్చింది? అని ప్రశ్నిస్తే.. వర్షాల కారణంగా భారీ పిడుగు పడిందని చెప్పారు. నేను కళ్లారా డ్రోన్లను చూశాను. ఇంత దారుణంగా ఏమార్చడం సిగ్గుచేటు". రావల్పిండికి చెందిన ఓ యువకుడు సోషల్ మీడియాలో ఓ వీడియోలో తన ఆవేదనను వెల్లడించాడు. ఇదే ప్రాంతానికి చెందిన మరో యువకుడు కూడా ఓ న్యూస్ చానల్ మాట్లాడుతూ పాక్ సైన్యం తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించాడు. భారత్‌తో యుద్ధం మరింత ముదురుతుందేమోననే భయాందోళనలు ప్రజల్లో నెలకొన్నాయి. పౌరులు ముందుజాగ్రత్తగా ఏటీఎంలలో, బ్యాంకుల లోంచి నగదును డ్రా చేసుకుంటూ.. నిత్యావసరాలను నిల్వ చేసుకుంటున్నారు. లాహోర్‌లోని డీహెచ్ ఫేస్-8, ఆస్కారీ-11 నుంచి ప్రజలను ఖాళీ చేయాలని స్థానిక అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాంతాలు లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థకు సమీపంలో ఉంటాయి. భారత్ 'ఆపరేషన్ సిందూర్' రెండో రోజు పాక్‌లోని లాహోర్, కరాచీ, రావల్పిండి, గుజ్రాన్‌వాలా, బహావల్‌పూర్, సియాల్‌కోట్, సింధ్ తదితర ప్రాంతాల్లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, మిలటరీ స్థావరాలను టార్గెట్‌గా చేసుకుంది. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ నిర్వీర్యమైనట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాల వైపు దూసుకొచ్చిన భారత డ్రోన్లను సమర్థంగా కూల్చేశామని పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్) డైరెక్టర్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో చెప్పారు. భారత్ డ్రోన్ దాడుల్లో ముగ్గురు పౌరులు మృతిచెందారని, లాహోర్‌లోని వాల్టన్ వద్ద నలుగురు ఆర్మీ జవాన్లు గాయపడ్డారని, సైనిక స్థావరాలకు స్వల్పంగా నష్టం వాటిల్లిందని వెల్లడించారు. 29 భారత డ్రోన్లను కూల్చివేశామని ప్రకటించారు. తాము భారత్‌లోని 15 ప్రాంతాలపై దాడి చేశామని చెప్పడం నిజం కాదని, తాము దాడి చేస్తే ప్రపంచానికి తెలుస్తుందన్నారు. కాగా, పాకిస్థాన్‌కు చెందిన ఆర్మీ మాజీ మేజర్, ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు (ఎంపీ) తాహిర్ ఇక్బాల్ 'దేవుడా.. నువ్వే దిక్కు. పాకిస్థాన్‌ను కాపాడు. భారత్ నుంచి రక్షించు' అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. కాగా, భారత్ డ్రోన్ దాడిలో లాహోర్‌లోని రక్షణ వ్యవస్థకు ఎలాంటి నష్టం జరగలేదని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వెల్లడించారు. పాకిస్థాన్ రక్షణ వ్యవస్థ సురక్షితంగా ఉందని చెప్పారు. భారత్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు.


రావల్పిండిలోని క్రికెట్ స్టేడియం వద్ద ధ్వంసమైన భవనాలు



లాహోర్‌లో కుప్పకూలిన ఓ భవంతి

ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాక్ సైన్యం

'ఆపరేషన్ సిందూర్' తొలిరోజు దాడిలో మృతి చెందిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాక్ ఆర్మీ అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై విమర్శలు రాగా.. "మా సైన్యాధికారి కుమారుడు(7) కూడా భారత్ దాడిలో చనిపోయాడు. అందుకే ఆర్మీ వచ్చింది" అని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. కాగా.. భారత్ దాడిలో మరణించిన వారికి ఆత్మశాంతి కలగాలని కోరుతూ.. పాకిస్థాన్ సుప్రీంకోర్టు నివాళులర్పించడం గమనార్హం.



భారీ నష్టం?

ఎల్‌వోసీ సమీపంలోని ఖంజో, సర్ఫరాజ్ లెఘారీ గ్రామాలు, చక్వాల్‌లోని ధమన్ తదితర ప్రాంతాల్లో మసీదులు ధ్వంసమయ్యాయని, పౌరుల ఇళ్లు దెబ్బతిన్నాయని పాక్ మీడియా పేర్కొంది. రావల్పిండిలో నష్టం ఎక్కువగా ఉంటుందని తెలిపింది. ఈ ప్రాంతాల్లోని దళాలు డ్రోన్లను కూల్చివేసినట్లు వివరించింది. దీంతో రావల్పిండి నుంచి పాక్ సూపర్ లీగ్ క్రికెట్ ఆటగాళ్లను ఇతర ప్రాంతాలకు తరలించి, లీగ్‌ను రద్దు చేశారని వివరించింది. భారత్ దాడుల ముప్పు నేపథ్యంలో ఓడరేవుల వద్ద హైఅలర్ట్ కొనసాగుతోంది. పడవలు, నౌకలను సముద్రంలోకి వెళ్లనివ్వడం లేదు. కరాచీ, లాహోర్, ఇస్లామాబాద్, సియాల్‌కోట్ విమానాశ్రయాల్లో రాకపోకలను నిలిపివేశారు.

గగన్‌యాన్ వ్యోమగామి యుద్ధానికి సిద్ధం

- అజిత్ కృష్ణన్‌ను వెనక్కి పిలిపించిన వాయుసేన



న్యూఢిల్లీ, మే 8: ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొనడంతో గగన్‌యాన్ వ్యోమగామి అజిత్ కృష్ణన్‌ను వాయుసేన తిరిగి తన యూనిట్‌కు పిలిపించింది. దేశ తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ కోసం ఎంపికైన నలుగురు వైమానిక దళ అధికారుల్లో గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్ ఒకరు. ఢిల్లీలో జరిగిన గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్ వద్ద ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తనకు ఐఏఎఫ్ నుంచి పిలుపొచ్చిందని ధ్రువీకరించారు. 2027లో నిర్వహించే గగన్‌యాన్ మిషన్ కోసం అజిత్‌తోపాటు వాయుసేనకు చెందిన అంగద్ ప్రతాప్, శుభాంశు శుక్లా, ప్రశాంత్ బి నాయర్ ఎంపికయ్యారు. 2003లో ఐఏఎఫ్‌లో చేరిన అజిత్‌కు ఎస్‌యూ-30, ఎంకేఐ, మిగ్-29 తదితర యుద్ధ విమానాల్లో దాదాపు 2,900 గంటలు ప్రయాణించిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఆయన వాయుసేనలో ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్, టెస్ట్ పైలట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

75 ఏళ్లుగా.. బలూచీల పోరు

- భారత్ దాడులతో క్రియాశీలమైన బీఎల్ఏ దళాలు
- అర్ధరాత్రి నుంచి పాక్‌పై దాడులు
- పాక్‌లో అతిపెద్ద భూభాగం బలూచిస్థాన్‌దే
- జనాభా మాత్రం 7-8 శాతం వరకే

(సెంట్రల్ డెస్క్)

బలూచిస్థాన్..! పాకిస్థాన్‌లో ఉన్నా.. అక్కడి పౌరులకు స్వేచ్ఛ లేదు.. విద్య, వైద్యం అందని దుస్థితి..! పాకిస్థాన్‌లో 44% విస్తీర్ణం ఉన్న బలూచిస్థాన్ ప్రాంతాన్ని పాక్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. అక్కడి ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తున్నాయి. దీంతో.. స్వతంత్ర దేశంగా ప్రకటించాలంటూ.. అక్కడి పౌరులు 75 ఏళ్లుగా పోరాడుతున్నారు. ఇప్పుడు పాక్‌పై భారత్ దాడి నేపథ్యంలో.. బలూచీలు తమ కలను సాకారం చేసే దిశలో ముందుకు సాగుతున్నారు.

ఇదీ బలూచిస్థాన్ కథ

బ్రిటిష్ వారు 1947 ఆగస్టు 15న భారత్-పాకిస్థాన్‌లను విభజించి, స్వాతంత్ర్యం ప్రకటించినా.. బలూచిస్థాన్ ప్రాంతం స్వతంత్రంగా ఉండేది. 'ఖాన్ ఆఫ్ కలాత్' అనే రాజు పాలనలో ఈ ప్రాంతం కొనసాగింది. అయితే.. 1948 మార్చిలో పాకిస్థాన్ ప్రభుత్వం సైనిక చర్యను చేపట్టి.. ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకుంది. పాకిస్థాన్‌లో విలీనం చేసుకుంది. పాకిస్థాన్ విస్తీర్ణంలో బలూచిస్థాన్ వాటా 44శాతంగా ఉంటుంది. అయితే.. పాక్ జనాభాలో బలూచీల వాటా 7-8% మాత్రమే. పాక్ దురాక్రమణ నుంచి ఈ ప్రాంత ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు. తమ దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా బలూచీలను పాకిస్థాన్ భావించేది. ఈ ప్రాంతాన్ని పాకిస్థాన్ ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకోలేదు. ఇక్కడి ప్రజలకు విద్య, వైద్య సదుపాయాలు లేవు. ఈ ప్రాంతంలోని వనరులను పాకిస్థాన్, చైనా దోచుకుంటున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన యువకులను పాక్ సైన్యం అపహరిస్తోంది. అలా అదృశ్యమయ్యే వారి జాడ నేటికీ తెలియలేదంటే.. బలూచీల దుర్భర పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

బీఎల్ఏ ఆవిర్భావం.. దాడులు ముమ్మరం

2000 సంవత్సరంలో బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) ఆవిర్భవించింది. స్వతంత్ర బలూచిస్థాన్ దేశం కోసం గెరిల్లా యుద్ధాలతో పాకిస్థాన్ సైన్యంపై దాడులు చేసేది. క్రమంగా బీఎల్ఏ బలం పుంజుకుంది. పాకిస్థాన్ సైనికులు, వారి కార్యాలయాలు, కంటోన్మెంట్ ప్రాంతాలు, పోలీస్‌స్టేషన్లు, ప్రభుత్వ భవనాలను టార్గెట్‌గా చేసుకుని, దాడులు జరుపుతోంది. ప్రస్తుతం బీఎల్ఏ చీఫ్‌గా బషీర్ జైబ్ వ్యవహరిస్తున్నారు. 2018 వరకు ఆయన సోదరుడు అస్లాం బలూచ్ ఈ పదవిలో ఉండేవారు. ఆయన మరణం తర్వాత బషీర్ జైబ్ బాధ్యతలను స్వీకరించాక.. బీఎల్ఏ మరింతగా పుంజుకుంది. గెరిల్లా పోరుతోపాటు.. అధునాతన ఆయుధాల వినియోగం, ఐఈడీల ప్రయోగాలు పెరిగాయి. ఆయన నేతృత్వంలోని బీఎల్ఏ.. గ్వాదర్ పోర్టు వద్ద చైనా ఇంజనీర్లు, వారి వాహనాలపై ఐఈడీ దాడులు చేస్తోంది. తాజాగా మంగళ, బుధవారాల్లోనూ బలూచిస్థాన్‌లో ఐఈడీలు పేల్చి, 21 మంది సైనికులను హతమార్చింది. ఇటీవల క్వెట్టా-పెషావర్ మధ్య నడిచే జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసి, సంచలనం సృష్టించింది. స్వతంత్ర దేశంగా బలూచిస్థాన్‌ను సాధించడానికి పోరాటాలను ముమ్మరం చేసింది. ముఖ్యంగా పాకిస్థాన్‌లో చైనా ప్రాజెక్టులు, సీపీఈసీ రోడ్డు ప్రణాళిక పాలిట బీఎల్ఏ ముప్పుగా పరిణమించింది. దీంతో ఈ ఉద్యమాన్ని అణిచివేయాలంటూ పాకిస్థాన్‌పై చైనా నుంచి తీవ్ర ఒత్తిడి ఉంది.





...సిద్ధమా!?

నిరంతరం అప్రమత్తంగా ఉండండి: మోదీ

న్యూఢిల్లీ, మే 8: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. బుధవారం కశ్మీరులో సరిహద్దు వెంట జనావాసాలపై గుళ్ల వర్షం కురిపించిన పాకిస్థాన్.. గురువారం ఇరు దేశాల సరిహద్దుల్లో అటు చివరి నుంచి ఇటు చివరికి భారతసైనిక స్థావరాలపై దాడులకు విఫలయత్నం చేసింది. ఫలితంగా రాబోయే రోజుల్లో కశ్మీరు నుంచి కచ్ వరకూ సరిహద్దుల వెంట ఉండే ప్రజల ప్రాణాలను కాపాడడం తక్షణ కర్తవ్యంగా మారింది. ఇప్పటికే జమ్మూకశ్మీరు సరిహద్దు గ్రామాల్లో వేలాదిమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాబోయే రోజుల్లో రాజస్థాన్, గుజరాత్ సహా సరిహద్దు రాష్ట్రాల్లోని ప్రజలను తరలించాల్సిన అనివార్య పరిస్థితులు తలెత్తుతాయా!? అనే సందేహాలూ వెలువడుతున్నాయి. ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు రాకుండానే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇక, ఇరు దేశాల దాడుల నేపథ్యంలో బుధవారం నుంచి సోషల్ మీడియాలో రకరకాల విశ్లేషణలూ వెలువడుతున్నాయి. వీటిలో నిజాలూ అర్ధ నిజాలూ అసత్యాలూ ఉంటున్నాయి. వీటిని ఆదిలోనే అడ్డుకోవాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడుతోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో పాకిస్థాన్ ప్రతి దాడి చేస్తే ముందుగా సైనిక స్థావరాలపైనే గురిపెట్టే అవకాశం ఉంది. గురువారం పాక్ గురి పెట్టిందీ వీటిపైనే! వాటిని కాపాడుకోవడం తప్పనిసరి. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ కేంద్రంలోని వివిధ శాఖల కార్యదర్శులతో గురువారం సమావేశమయ్యారు. జాతీయ స్థాయిలో సన్నద్ధత, వాటి ప్లానింగ్, వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయంపై ఈ ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. యుద్ధ సన్నద్ధత.. దేశ భద్రత.. ప్రథమ ప్రాధాన్యాలని స్పష్టం చేశారు. ఎక్కడ ఎప్పుడు ఏమి జరిగినా క్షణాల్లో సమాచారం చేరిపోవాలని, ఇందుకు శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా రంగం సిద్ధం చేయాలని నిర్దేశించారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు తక్కువ సమయంలోనే కోలుకుని తిరిగి యథా ప్రకారం కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా మంత్రిత్వ శాఖలు తమ కార్యకలాపాలను సమగ్రంగా సమీక్షించుకోవాలని, అత్యవసర వ్యవస్థలు నిరంతరాయంగా పనిచేసేలా చూసుకోవాలని నిర్దేశించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే తీరు, అంతర్గత కమ్యూనికేషన్ ప్రొటోకాల్స్‌పై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. దేశవ్యాప్తంగా పౌర రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలన్నారు. ఫేక్‌న్యూస్, తప్పుడు సమాచార వ్యాప్తిని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని నిర్దేశించారు. సైనిక స్థావరాలు వంటి కీలక వ్యవస్థల భద్రతకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రాల్లోని అధికార యంత్రాంగంతోపాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న క్షేత్ర స్థాయి సంస్థలతో ఎప్పటికప్పుడు సమన్వయం కీలకమని కార్యదర్శులకు ప్రధానిసూచించారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆయా మంత్రిత్వ శాఖలు ప్రధాని మోదీకి వివరించాయి. సమావేశంలో క్యాబినెట్ సెక్రటరీ, పీఎంవో సీనియర్ అధికారులు, రక్షణ, హోం, విదేశాంగ, విద్యుత్తు, ఆరోగ్యం, టెలి కమ్యూనికేషన్లు, సమాచార ప్రసార శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.



100 మందిని హతమార్చాం

పాక్‌లోని ఉగ్రస్థావరాలపై మెరుపు దాడులు.. 9 స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడి చేశాం

ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోంది..

పూర్తి వివరాలను ఇప్పుడే వెల్లడించలేం

అఖిలపక్ష సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, మే 8: పాక్‌లోని ఉగ్రస్థావరాలపై జరిపిన క్షిపణి దాడుల్లో 100 మంది దాకా ముష్కరులు హతమయ్యారని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీరులోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత బలగాలు మెరుపు దాడులతో విరుచుకుపడ్డాయని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ పేరిట నిర్వహించిన ఈ దాడుల గురించి వివరించేందుకు గురువారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "పాక్, పీవోకేల్లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు నిర్వహించాం. దాదాపు 100మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాం. దీనికి సంబంధించిన మరింత సమాచారం అందాల్సి ఉంది. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుందన్న ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడే వెల్లడించలేం. ఉద్రిక్తతలను పెంచాలన్న ఉద్దేశం మాకు లేదు. కానీ, పాక్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే మాత్రం.. వెనక్కి తగ్గేదే లేదు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంది" అని చెప్పారు. అలాగే ప్రధాని మోదీ సందేశాన్ని రాజ్‌నాథ్ చదివి వినిపించారు. "భారతీయులందరూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విలేకరులతో మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్ వివరాలు, ప్రభుత్వ ఉద్దేశాలను రక్షణ మంత్రి ప్రతిపక్ష నేతలకు వివరించారు. అయితే, ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో సాంకేతిక అంశాలను వెల్లడించలేదు. ప్రతిపక్షాలు అత్యంత పరిణతితో వ్యవహరించాయి. ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ అంశంలో రాజకీయాలకు తావులేదు' అని రిజిజు పేర్కొన్నారు. విపక్ష నేతలు పలు విలువైన సలహాలు, సూచనలు కూడా ఇచ్చారని తెలిపారు. దేశ భద్రత, భారతీయులందరినీ సురక్షితంగా ఉంచడం, ప్రత్యేకించి సరిహద్దు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై కొంత ఆందోళన వ్యక్తం చేసినా.. ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని చెప్పారు. యావత్ దేశం కేంద్రానికి, భద్రతా బలగాలకు అండగా ఉన్నాయన్న సందేశం ఇచ్చారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన మన బలగాలకు విపక్ష నేతలు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



అఖిలపక్షం సందర్భంగా రాజ్‌నాథ్‌తో రాహుల్, ఖర్గే

ఐక్యంగా నిలబడతాం: రాహుల్

"ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిపక్షాలు ప్రభుత్వానికి అండగా ఉంటాయి. దేశం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, కొనసాగుతోందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు" అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో తాము కేంద్రానికి అండగా నిలుస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తెలిపారు. ఇది సున్నితమైన అంశమైనందున, దేశ భద్రత దృష్ట్యా కొన్ని ప్రశ్నలు అడగరాదని రక్షణ మంత్రి చెప్పారన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతున్నందున పూర్తి వివరాలు ఇప్పుడే తెలియజేయలేమని కూడా రాజ్‌నాథ్ చెప్పారని ఖర్గే వివరించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రపంచానికి స్పష్టమైన సందేశం ఇచ్చినట్లవుతుందని రాహుల్ ప్రభుత్వానికి సూచించారని తెలిపారు. అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ రాకపోవడంపై ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ నుంచి ఖర్గే, రాహుల్ హాజరుకాగా, డీఎంకే, శివసేన, మజ్లిస్, ఎన్సీపీ, ఎస్పీ, ఆప్, సీపీఎం, జేడీయూ, ఎల్జేపీ నేతలు హాజరవగా.. కేంద్ర ప్రభుత్వం తరఫున మంత్రులు అమిత్ షా, నిర్మల, జైశంకర్, జేపీ నడ్డా పాల్గొన్నారు. మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత బలగాలు, ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. అలాగే పహల్గాంలో అమాయకులను పొట్టనపెట్టుకున్న టీఆర్ఎఫ్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. ఐరాస భద్రతా మండలి టీఆర్ఎఫ్‌ను అంతర్జాతీయ ఉగ్ర సంస్థగా ప్రకటించాలని కోరారు. పాక్ మద్దతిస్తున్న ఉగ్రవాదులు భారత్‌లో జిహాద్ పేరిట హత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పూంచ్, ఉరీల్లో పాక్ బలగాల కాల్పుల్లో ప్రాణ, ఆస్తినష్టం జరిగిన కుటుంబాలకు పరిహారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కాగా, ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భద్రతా బలగాలను అభినందిస్తూ పార్లమెంటు ప్రజా పద్దుల కమిటీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. పీఏసీ తొలిసమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు అధ్యక్షుడు కేసీ వేణుగోపాల్ తెలిపారు.

ఐఎన్ఎస్ విక్రాంత్ సముద్రంలో శత్రుదుర్భేద్య దుర్గం

పాకిస్థాన్‌పై పోరులో కీలకం

న్యూఢిల్లీ, మే 8: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో అరేబియా సముద్రంలోకి ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధవాహక నౌకను వారం కిందటే భారత నౌకాదళం తరలించింది. అరేబియా సముద్రం తీర ప్రాంతంలోనే పాకిస్థాన్‌లోని కరాచీ నగరం ఉంది. పాకిస్థాన్ మీద దాడికి సిద్ధంగా ఉన్న ఐఎన్ఎస్ విక్రాంత్.. గురువారం కరాచీ మీద నిప్పులు కురిపించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, ఐఎన్ఎస్ విక్రాంత్ విశేషాలు.. ఐఎన్ఎస్ విక్రాంత్ బరువు 45 వేల మెట్రిక్ టన్నులు. పొడవు 262 మీటర్లు. దానిపై ఒకేసారి 30 మిగ్ 29కే యుద్ధవిమానాలను నిలుపవచ్చు. ఒక్కో మిగ్ 800 కి.మీ.ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. గగనతల నిఘా కోసం ఉపయోగించే కామోవ్-31 హెలికాప్టర్లను, యాంటీ సబ్‌మెరైన్ మిషన్ కోసం వాడే హాల్ ధ్రువ్ హెలికాప్టర్లను ఐఎన్ఎస్ విక్రాంత్ మీద మోహరిస్తారు. ఇక విక్రాంత్ రక్షణ కోసం దానిపై ఉపరితలం నుంచి గగనతలానికి దూసుకెళ్లే బరాక్-8 క్షిపణులు, ఈఎల్/ఎం-2248 ఎంఎఫ్-స్టార్ వంటి అత్యాధునిక రాడార్లు ఉంటాయి. ఐఎన్ఎస్ విక్రాంత్‌ను శత్రు దుర్భేద్యంగా మార్చే 'కారియర్ బాటిల్ గ్రూప్' దాని వెంటే అంగరక్షకుల్లా ఉంటాయి. ఈ గ్రూప్‌లో కల్వరి క్లాస్ జలాంతర్గాములు, కోల్‌కతా క్లాస్ డిస్ట్రాయర్లు, తల్వార్ క్లాస్ ఫ్రిగేట్లు ఉంటాయి. వీటన్నింటితో ఐఎన్ఎస్ విక్రాంత్.. సముద్రంలో ఓ భారీ కోటలా ముందుకు కదులుతుంది.



నిప్పులు చిమ్మే క్షిపణులు

కల్వరి క్లాస్ జలాంతర్గాముల్లో ఐఎన్ఎస్ కల్వరి, ఐఎన్ఎస్ వగీర్ సబ్‌మెరైన్లుంటాయి. వీటిలో శత్రునౌకలను ధ్వంసం చేసే క్షిపణులుంటాయి. ఒక క్షిపణి 3 వేల కిలోల బరువైన నౌకను కూడా తుత్తునియలు చేయగలదు. ఇక కోల్‌కతా క్లాస్ డిస్ట్రాయర్లలో బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ మిసైల్స్, 32 బరాక్-8 మిసైల్స్‌తో కూడిన ఐఎన్ఎస్ కోల్‌కతా, ఐఎన్ఎస్ చెన్నై యుద్ధనౌకలుంటాయి. ఇవి పాకిస్థాన్‌లోని నౌకాశ్రయాలను, చమురు డిపోలను, యుద్ధనౌకలను లక్ష్యంగా నిప్పులు కురిపించగలవు. తల్వార్ క్లాస్ ఫ్రిగేట్లలో ఐఎన్ఎస్ తల్వార్, ఐఎన్ఎస్ తేగ్, ఐఎన్ఎస్ త్రికాండ్ యుద్ధనౌకలుంటాయి. వీటిలో దాడికి సిద్ధంగా 8 బ్రహ్మోస్ క్షిపణులుంటాయి. వేగంగా కదులుతూ, తీరప్రాంతాల్లో దాడులు జరిపేందుకు, దాడికి అవసరమైన సహకారం అందించేందుకు ఫ్రిగేట్లు ఉపయోగపడుతాయి.

ఆ 'డ్రోన్లు' బెంగళూరులో తయారైనవే!

ఆపరేషన్ సిందూర్‌తో అరంగేట్రం

న్యూఢిల్లీ, మే 8: పాక్‌లో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కోసం భారత సైన్యం అత్యాధునిక ఆయుధాలను ఉపయోగించింది. వీటిలో స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణులు, హ్యామర్ బాంబులతో పాటు స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆత్మాహుతి డ్రోన్లు కూడా ఉన్నాయి. ఇజ్రాయెల్‌కు చెందిన ఎల్బిట్ సిస్టమ్స్ సహకారంతో బెంగళూరుకు చెందిన ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్ లిమిటెడ్(ఏడీటీఎల్) అభివృద్ధి చేసిన స్కై-స్ట్రైకర్ సూసైడ్ డ్రోన్లు ఈ ఆపరేషన్ సందర్భంగా అరంగేట్రం చేశాయి. శత్రు శిబిరాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించి విరుచుకుపడేందుకు వీలుగా వీటిని రూపొందించారు. ఈ లాయిటరింగ్ మ్యూనిషన్లు 5 కిలోల వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలవు. సుదూర లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉన్న ఈ డ్రోన్లు 100 కిలోమీటర్ల పరిధిలో ఆకాశంలో తిరుగుతూ, లక్ష్యాన్ని నేరుగా ఢీకొట్టి విధ్వంసం సృష్టిస్తాయి. కామికేజ్ డ్రోన్లుగా పిలిచే ఈ ఆత్మహుతి డ్రోన్ల తయారీ ఖర్చు కూడా చాలా తక్కువే. ఇటువంటి 100 యూఏవీల కొనుగోలు కోసం 2021లో ఒప్పందం చేసుకొని భారత సైన్యంలో ప్రవేశపెట్టారు.

భారత్, పాక్ దాడులు ఆపేయాలి

» నేను ఏదైనా సాయం చేయగలిగితే చేస్తా: ట్రంప్

వాషింగ్టన్/లండన్, మే 8: భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఇరుదేశాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం ఆపాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకు నేనేదైనా సాయం చేయగలిగితే.. తప్పకుండా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. బుధవారం ఓవల్ ఆఫీసులో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. 'భారత్, పాక్ మధ్య పరిస్థితులు భయంకరంగా ఉన్నాయి. రెండు దేశాల నుంచి గురించి నాకు బాగా తెలుసు. ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని, పరస్పర దాడులు ఆపేయాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. తనకు రెండు దేశాలతో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. అంతకుముందు భారత్ దాడికి కొద్ది గంటల తర్వాత ట్రంప్ మాట్లాడుతూ భారత్, పాక్ దశాబ్దాలుగా పోరాడుతున్నాయని, 'ఏదో జరగబోతోంది' అనే విషయం ప్రజలకు తెలుసన్నారు. రెండు దేశాలకు ఏమైనా సందేశం ఇస్తారా? అని అడగ్గా.. 'లేదు, ఇది చాలా త్వరగా ముగుస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. మరోవైపు భారత్, పాక్ మధ్య ఘర్షణపై యూకే పార్లమెంట్ చర్చించింది. ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పార్టీలకు అతీతంగా సభ్యులు కోరారు. బుధవారం హౌస్ ఆఫ్ కామన్స్‌లో చర్చను ప్రారంభించిన యూకే విదేశాంగ మంత్రి హమిష్ ఫాల్కనర్ మాట్లాడుతూ భారత్, పాక్ సహనం పాటించాలన్నదే తమ స్థిరమైన సందేశమని అన్నారు.

లాహోర్ వీడండి.. తమ పౌరులకు అమెరికా సూచన

పాకిస్థాన్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలను భారత్ ధ్వంసం చేయడంతో తమ పౌరులను అమెరికా అప్రమత్తం చేసింది. లాహోర్ వీడాలని సూచించింది. లేదంటే సురక్షిత స్థావరాల్లో తలదాచుకోవాలని సూచించింది. దీనికి సంబంధించి లాహోర్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

ఆ న్యాయమూర్తిని అభిశంసించండి!

» జస్టిస్ యశ్వంత్ వర్మ విషయంలో రాష్ట్రపతి, ప్రధానికి సీజేఐ లేఖ

న్యూఢిల్లీ, మే 8 : న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీగా నగదు బయటపడిన వ్యవహారంలో ఆయనపై చర్యలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సిద్ధమవుతున్నారు. జస్టిస్ వర్మను అభిశంసించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరినట్టు సమాచారం. ఢిల్లీలోని న్యాయమూర్తి నివాసంలో డబ్బు కట్టలు కనిపించడం నిజమేనంటూ సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఇప్పటికే తేల్చింది. సీజేకు తన నివేదికను అందించింది. ఆ నివేదికను జస్టిస్ వర్మకు పంపి, దానిపై వివరణను ఆయన కోరారు. వైదొలగడమే మంచిదని ఆయనకు సూచించినట్టు కూడా వార్తలు వచ్చాయి. అందుకు జస్టిస్ వర్మ నిరాకరించినట్టు సమాచారం. ఇలాంటి సందర్భంలో సదరు జడ్జిపై ఇన్‌హౌస్ ప్రొసీజర్‌ను నడిపి అభిశంసించడంలో అతి ముఖ్య ఘట్టానికి సీజే శ్రీకారం చుట్టారని తెలిసింది. ఇందులోభాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీకి సీజే లేఖ రాశారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఆరోపణలు ఎదుర్కొన్న న్యాయమూర్తి తప్పిదం తీవ్రమైనది కాదని కమిటీ నిర్ధారిస్తే ఇన్ హౌస్ ప్రొసీజర్‌లో సీజే మందలిస్తారు. అదేగనుక న్యాయమూర్తి చర్యను కమిటీ తీవ్రంగా పరిగణిస్తే అప్పుడు చీఫ్‌జస్టిస్ ఎదుట రెండు దారులు ఉంటాయి. న్యాయమూర్తిగా వైదొలగాలని లేక స్వచ్ఛందంగా పదవీవిరమణ చేయాలని సదరు జడ్జికి సూచిస్తారు. అందుకు ఆ న్యాయమూర్తి నిరాకరిస్తే ఆయనకు న్యాయబాధ్యతలేవీ ఇవ్వొద్దంటూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఆదేశాలు జారీచేస్తారు. కమిటీ నివేదికలోని అంశాల తీవ్రతను రాష్ట్రపతి, ప్రధాని దృష్టికి తీసుకెళ్లి అభిశంసించాల్సిందిగా కోరతారు.

నూతన పోప్‌గా రాబర్ట్ ప్రివోస్ట్

» చరిత్రలో తొలిసారి ఓ అమెరికన్ ఎన్నిక



వాటికన్‌సిటీ, మే 8: నూతన పోప్‌గా అమెరికాకు చెందిన 69 ఏళ్ల రాబర్ట్ ప్రివోస్ట్ ఎన్నికయ్యారు. ఆయన్ను పోప్ లియో-14గా పిలవనున్నారు. 133 మంది కార్డినల్‌లు శతాబ్దాల నాటి సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అత్యంత రహస్యంగా సమావేశమై నూతన పోప్‌ను ఎన్నుకున్నారు. దీనికి సూచికగా వాటికన్‌లోని ప్రాచీన సిస్టన్ చాపెల్ చర్చి పొగగొట్టం నుంచి తెలుపు రంగు పొగ వెలువడింది. పోప్‌గా ఓ అమెరికన్ ఎన్నిక కావడం చరిత్రలో ఇదే తొలిసారి. నూతన పోప్ ఎన్నిక ఖరారుతో ప్రజల హర్షధ్వానాలతో సెయింట్ పీటర్స్ స్కేర్ మార్మోగిపోయింది. అత్యున్నత కార్డినల్ నూతన పోప్ పేరును ప్రకటించారు. అనంతరం నూతన పోప్ తొలిసారి ప్రజలకు బహిరంగంగా కనిపించారు. అమెరికాలోని షికాగోలో జన్మించిన రాబర్ట్ ప్రివోస్ట్‌కు పెరూ పౌరసత్వం కూడా ఉంది. ఆర్చ్‌బిషప్‌గా ఎన్నో ఏళ్ల పాటు ఆయన పెరూలో సేవలందించారు. 2023లో పోప్ ఫ్రాన్సిస్ ఆయన్ను వాటికన్‌కు పిలిపించి ఓ కీలక పదవి అప్పగించారు. ఈ ఏడాది జనవరిలో కార్డినల్‌గా నియమితులయ్యారు.

అడవిలో రక్తపుటేరులు

మందుపాతర పేల్చిన మావోయిస్టులు.. ముగ్గురు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల మృతి

» ఒక ఆర్ఎస్సైకి తీవ్ర గాయాలు

» ఎదురుకాల్పుల్లో 8 మంది నక్సల్స్ మృతి అని ప్రచారం



మృతులు శ్రీధర్, సందీప్, పవన్‌కళ్యాణ్ (ఫైల్)

ములుగు/వాజేడు/వరంగల్ క్రైం/ఘట్‌కేసర్/మంచిర్యాల/ హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో రక్తపుటేరులు పారుతున్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు, లంకపల్లి అడవుల్లో తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు కూంబింగ్ చేస్తుండగా.. మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ముగ్గురు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లు.. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన సందీప్, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన పవన్‌కల్యాణ్, కామారెడ్డి జిల్లా పాల్వంచకు చెందిన శ్రీధర్ అక్కడికక్కడే మృతిచెందారు. అనంతరం మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఆర్ఎస్సై రణధీర్‌కు బుల్లెట్ గాయమైనట్టు తెలిసింది. పోలీసుల మృతదేహాలను ప్రత్యేక హెలికాప్టర్‌లో ములుగుకు, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. గాయపడ్డ ఎస్సైను హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. కానిస్టేబుళ్ల మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం గురువారం సాయంత్రం హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు తరలించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న డీజీపీ జితేందర్, గ్రేహౌండ్స్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. మరణించిన కమాండోల కుటుంబాలకు అండగా ఉంటామని డీజీపీ ప్రకటించారు. కాగా మందుపాతరపేలిన తర్వాత మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని, 8మంది మావోయిస్టులు మృతిచెందారని.. వీరిలో మావోయిస్టుపార్టీ అగ్రనేతలు చంద్రన్న, బండిప్రకాశ్ ఉన్నట్టు ప్రచారం జరిగింది. దీన్ని పోలీసులు ధ్రువీకరించలేదు. బండి ప్రకాశ్(60) అలియాస్ క్రాంతి అలియాస్ ప్రభాత్‌ది మంచిర్యాల జిల్లా మందమర్రి.

6 నెలలు కాల్పుల విరమణ పాటిస్తాం..!

» మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరిట లేఖ

రాష్ట్రంలో ఆరు నెలలు కాల్పుల విరమణ పాటించనున్నట్టు మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట గురువారం లేఖ విడుదలైంది. శాంతిచర్చలు జరపాలని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు జగన్ పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ, ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలనే డిమాండ్ దేశవ్యాప్తంగా వస్తోందన్నారు. సీపీఐ(ఎం), ఇతర వామపక్షాలు ఇప్పటికే ఈ డిమాండ్‌తో కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు.



భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించే ప్రసక్తే లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి, దేశాన్ని దెబ్బకొట్టాలని చూసే వారికి, ఉగ్రమూకలకు నూకలు చెల్లినట్లేనని హెచ్చరించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి నెక్లెస్‌రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాను భుజానపెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

'సిందూర్' కోసం 30 మంది పోటీ!

హైదరాబాద్, మే 8: ఆపరేషన్ సిందూర్.. ఇప్పుడు దేశవ్యాప్తంగా తారక మంత్రంలా వినిపిస్తున్న పేరు. పహల్‌గామ్‌లో టూరిస్టులపై పాశవికంగా దాడి చేసి హతమార్చిన ఉగ్రవాదులకు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సైనిక చర్య జరిపి గట్టి బుద్ధి చెప్పింది కేంద్రప్రభుత్వం. మహిళలకు సిందూరం ఎంతో పవిత్రం కనుక దానిని దూరం చేసినందుకు ప్రతీకారం తీర్చుకుంది. 'మేమంతా మీ వెంటే' అంటూ భారతీయ చిత్ర పరిశ్రమ సైతం ప్రభుత్వానికి మద్దతు తెలిపింది. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్' టైటిల్‌కు చిత్ర పరిశ్రమలో మంచి డిమాండ్ ఏర్పడింది. 'ఆపరేషన్ సిందూర్', 'మిషన్ సిందూర్', 'సిందూర్.. ద రివెంజ్'.. ఇలా సిందూర్ అనే పదం వచ్చేలా రకరకాల టైటిల్స్‌తో రెండు రోజుల్లో 30 మంది నిర్మాతలు ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌కు దరఖాస్తులు పెట్టుకోవడం విశేషం. ఈ సంఖ్య శుక్రవారానికి 50 వరకూ పెరగవచ్చని అంటున్నారు. 'ఒక వ్యక్తి ఎన్ని టైటిల్స్‌కి అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ ఎవరు ముందు దరఖాస్తు పెట్టారో వారికే ఒక టైటిల్ ఇచ్చే పద్ధతి ఉంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఏ నిర్మాతైనా 'సిందూర్' టైటిల్‌తో సినిమా తీస్తే కచ్చితంగా అది పెద్ద న్యూస్ అవుతుంది' అన్నారు.

రాజ్ కసిరెడ్డికి ఝలక్

- ఏసీబీ కోర్టు రిమాండ్ ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరణ
- ఆయన తండ్రి వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్ కొట్టివేత



అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం వ్యవహారంలో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. తన కుమారుడికి జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ఆయన తండ్రి ఉపేందర్ రెడ్డి వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. ఉపేందర్‌రెడ్డి వ్యాజ్యంపై బుధవారం ధర్మాసనం విచారణ జరిపింది. సీఐడీ తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. రాజ్ కసిరెడ్డి అరెస్టు విషయంలో సీఐడీ అధికారులు చట్టనిబంధనల మేరకే నడుచుకున్నారని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో నిర్ణయాన్ని వాయిదా వేసిన ధర్మాసనం.. గురువారం వెల్లడించింది. 'రిమాండ్ రిపోర్టును నిందితుడికి అందజేసినట్లు ఏసీబీ న్యాయాధికారి రిమాండ్ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. రిమాండ్ రిపోర్టుపై కసిరెడ్డి సంతకం కూడా ఉంది. నిబంధనలను అధికారులు అనుసరించారు. రిమాండ్ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం' అని కోర్టు పేర్కొంది.

అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వలేం

- పిటిషన్ల విచారణ పరిధిని తేల్చడం వరకే మా అధికారం
- కాకాణి గోవర్ధన్‌రెడ్డికి స్పష్టం చేసిన హైకోర్టు



అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో దాఖలైన ముందస్తు బెయిల్ పిటిషన్ల విచారణపరిధిని తేల్చేవరకే తమ అధికారమని హైకోర్టు స్పష్టం చేసింది. నిందితులకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వలేమని తేల్చిచెప్పింది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది అభ్యర్థనను తోసిపుచ్చింది. వ్యాజ్యాలపై విచారణను జూన్ 16కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి, జస్టిస్ వి.సుజాతతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది.

ఆ పోలీసు అధికారులపై చర్యలొద్దు

- జెత్వాని కేసులో తదుపరి చర్యలు నిలుపుదల
- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): ముంబయి సినీనటి కాదంబరి జెత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరిన పోలీసు అధికారులపై తదుపరి చర్యలను నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. క్వాష్ పిటిషన్లపై విచారణను జూన్ 30కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు ప్రాసిక్యూషన్ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు ఇప్పటికే ముందస్తు బెయిల్ పొందారని తెలిపారు. ప్రస్తుత కేసులో వారికి నోటీసులు ఇచ్చి విచారణకు పిలవబోమని, తుది చార్జ్‌షీట్ దాఖలు చేయబోమని గతంలోనే హామీ ఇచ్చామని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో క్వాష్ పిటిషన్లపై అత్యవసరంగా విచారణ జరపాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వ్యాజ్యాలకు సంబంధించి కౌంటర్ వేయాల్సి ఉందని, విచారణను వేసవి సెలవుల తరువాతకి వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు స్పందిస్తూ... కౌంటర్ దాఖలు చేసేందుకు ఇప్పటికే ప్రాసిక్యూషన్‌కు వెసులుబాటు ఇచ్చారని, పిటిషనర్ల విషయంలో కేసు ఆధారంగా తదుపరి చర్యలపై స్టే విధించాలని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కేసు ఆధారంగా అధికారులపై తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

అసభ్యకర పోస్టులను కట్టడి చేయాల్సిందే

- పౌరులు హుందాగా జీవించే హక్కును కాపాడాలి: హైకోర్టు
- సజ్జల భార్గవ్‌రెడ్డి, ఇతరులకు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులకు ఆదేశం



సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, అనుచిత పోస్టులను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. 'అసభ్యకర, విద్వేషపూరిత వ్యాఖ్యల వల్ల అంతిమంగా సోషల్ మీడియా మాధ్యమాలే లబ్ధిపొందుతున్నాయి. అసభ్యకర, అనుచిత పదాలను గుర్తించి, పోస్టుల్లో వాటిని ఉపయోగించకుండా ఆదేశాలు జారీ చేయాలి. ఆయా పదాలు ఉపయోగించినప్పుడు ఖాతాను ఆటో బ్లాక్ చేసేలా సోషల్ మీడియా సంస్థలకు సూచనలు చేయాలి' అని పేర్కొంది. రాజ్యాంగం ప్రకారం ప్రతీ పౌరుడికి హుందాగా జీవించే హక్కు ఉందని, దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టంచేసింది. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వారి కుటుంబసభ్యులపై అసభ్యకర పోస్టులు పెట్టేలా వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులను ప్రోత్సహించారనే ఆరోపణలతో నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆ పార్టీ సోషల్ మీడియా పూర్వ ఇన్‌చార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి, సింగిరెడ్డి అర్జున్‌రెడ్డి, టి.సుమన్, రాహుల్‌రెడ్డి మరికొందరు వైసీపీ సానుభూతిపరులు పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ తీర్పును రిజర్వ్ చేశారు. తాజాగా ఆ తీర్పును వెల్లడించారు. 'బీఎన్ఎస్ సెక్షన్ 111 (వ్యవస్థీకృత నేరం) మినహా, పిటిషనర్లపై నమోదు చేసిన ఇతర సెక్షన్లు ఏడేళ్ల వరకు శిక్షకు వీలున్నవే. బీఎన్ఎస్ సెక్షన్ 111 వర్తింపజేయాలంటే పిటిషనర్లపై కనీసం రెండు చార్జిషీట్లు దాఖలై ఉండాలి. వారిపై నమోదైన కేసులు దర్యాప్తు దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో సెక్షన్ 111 కింద కేసు నమోదు చేయడం సరికాదని ప్రాథమికంగా అభిప్రాయపడుతున్నాం. పిటిషనర్లకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలి' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో ముడిపడిన కేసుల్లో భార్గవ్‌రెడ్డి, ఇతర నిందితులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను న్యాయమూర్తి కొట్టివేశారు. పిటిషనర్లపై రెండు వారాల పాటు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు.

జగన్ పత్రిక ఎడిటర్ ఇంట్లో పోలీసుల సోదాలు

- జగన్ పీఏ కేఎన్ఆర్ ఇంట్లో కూడా..

విజయవాడ, మే 8(ఆంధ్రజ్యోతి): జగన్ పత్రిక సంపాదకుడు ఆర్.ధనుంజయ రెడ్డి నివాసంలో విజయవాడ పోలీసులు సోదాలు జరిపారు. జగన్ వ్యక్తిగత సహాయకుడు కె.నాగేశ్వర రెడ్డి (కేఎన్ఆర్) ఇంటికీ వెళ్లారు. విజయవాడ వెటర్నరీ కాలనీలో పక్క పక్క వీధుల్లో వీరు నివాసం ఉంటున్నారు. మద్యం స్కామ్‌లో నిందితులైన మాజీ ఐఏఎస్ ధనుంజయ రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి అక్కడ ఉండే అవకాశముందన్న సమాచారంతో గురువారం ఈ సోదాలు నిర్వహించారు. విజయవాడ సెంట్రల్ ఏసీపీ దామోదర్ ఆధ్వర్యంలో పోలీసులు ముందుగా వారికి సెర్చ్ వారెంట్ ఇచ్చారు. నిందితుల గురించి కొన్ని ప్రశ్నలు అడిగారు. "వీళ్లిద్దరూ తరచూ మీ వద్దకు వస్తారని సమాచారం ఉంది. వీరి సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్‌లో ఉన్నాయి. ఒకవేళ వారు మళ్లీ మీ వద్దకు వస్తే మాకు తెలియజేయండి" అని స్పష్టం చేసి... అక్కడి నుంచి వెళ్లిపోయారు. మద్యం స్కామ్‌లో నిందితుల కోసం ఆరా తీసేందుకు పోలీసులు రాగా... దీనిని జగన్ రోత మీడియా 'పత్రికా స్వేచ్ఛపై దాడి'గా చిత్రీకరించడం గమనార్హం.



ఆదర్శ రైతు.. మంత్రి నిమ్మల



- ఎకరానికి 65 బస్తాల దిగుబడి

పొలంలో తాను పండించిన వరి పంటను ఆప్యాయంగా చూసుకుంటున్నది జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు. రాష్ట్ర మంత్రిగా ఊపిరిసలపని పనుల్లో ఉన్నా.. ఆయన వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయరు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం ఆగర్తిపాలెంలోని తన ఆరెకరాల వ్యవసాయ భూమిలో దాళ్వా సీజన్‌లో పీఆర్ 126 సన్నరకం (గ్రేడ్ ఏ) వంగడంతో సాగు చేసి, ఎకరానికి 65 బస్తాల దిగుబడి సాధించి, ఆదర్శ రైతుగా నిలిచారు. మంత్రిగా ఎంత బిజీగా ఉన్నా.. నియోజకవర్గానికి వారానికి రెండు రోజులు కేటాయిస్తారు. ఆ సమయంలోనే వీలైనప్పుడల్లా పొలానికి వెళతారు. నాట్లు వేయడం, కలుపు తీయడం, ఎరువులు చల్లడం, పురుగులమందు పిచికారి చేయడం.. ఇలా అన్ని పనులూ చేస్తారు.. దగ్గరుండి కూలీలతో చేయించుకుంటారు. అతి తక్కువ పెట్టుబడితో.. యాజమాన్య పద్ధతులు, శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలతో మంత్రి నిమ్మల అధిక దిగుబడి సాధించారని పాలకొల్లు ఏడీఏ పార్వతి, ఏడీ రాజశేఖర్ తెలిపారు.

- పాలకొల్లు అర్బన్, ఆంధ్రజ్యోతి

మద్యం స్కామ్‌లో ఈడీ కేసు

హవాలా గుట్టు తేల్చేందుకు రంగంలోకి..

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన రూ. వేల కోట్ల మద్యం ముడుపుల కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో హవాలా ఆర్థిక లావాదేవీల మూలాలను వెలికితీయడం కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. 33 మందిని నిందితులుగా చేరుస్తూ హైదరాబాద్‌లో కేసు నమోదుచేసింది. ఢిల్లీ మద్యం స్కామ్‌నూ మించిపోయిన ఈ దందాలో డబ్బులను హవాలా మార్గంలో దుబాయ్, ఆఫ్రికాకు తరలించారని అప్పట్లో వార్తలు వచ్చాయి. దీనిపై ఈడీ లోతుగా దృష్టి సారించనుంది. దీంతో లిక్కర్ స్కామ్ పాత్రధారులు, సూత్రధారులందరికీ ఉచ్చు బిగిసినట్టేనని భావిస్తున్నారు. ఈ పరిణామాలు తాడేపల్లి ప్యాలెస్‌ను వణికిస్తున్నాయి. స్కామ్ వివరాలు ఇవ్వాలంటూ ఈ నెల 6న విజయవాడ పోలీస్ కమిషనర్(లిక్కర్ కేసు సిట్ చీఫ్)కు ఈడీ అధికారులు రహస్య లేఖ రాశారు. సీఐడీలోని ఆర్థిక నేరాల విభాగం పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఏడాది సెప్టెంబరు 23న నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌తో(21/2024)పాటు ఇప్పటి వరకూ దర్యాప్తులో గుర్తించిన వివరాలు, నిందితుల బ్యాంకు అకౌంట్లు, ఆస్తుల వివరాలు, రిమాండ్ రిపోర్టులు, చార్జిషీట్లు(ఫైల్ చేసి ఉంటే), కుంభకోణానికి సంబంధించిన అదనపు డాక్యుమెంట్లు, సమాచారం ఏది ఉన్నా ఇవ్వాలని కోరారు. మనీలాండరింగ్ చట్టం కింద తాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేయబోతున్నామని లేఖలో ఈడీ పేర్కొంది. జగన్ హయాంలో(2019-24) ప్రభుత్వ మద్యం షాపుల్లో రూ.99వేల కోట్ల మద్యం విక్రయాలు జరిగితే రూ.690కోట్లు మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరగాయి. రూ.20,356 కోట్ల విలువైన మద్యం విక్రయాలను గోప్యంగా ఉంచారు. దీనిపై అందిన ఫిర్యాదులు ఈడీ అధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేశాయి. ఈడీ లేఖపై సిట్ వెంటనే స్పందించి కేసు డాక్యుమెంట్లు పంపింది.

ప్రతి అక్రమ లావాదేవీపైనా ఆరా..

మద్యం కుంభకోణంపై విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణలో వెలుగులోకి వస్తున్న వాస్తవాలను ఈడీ పరిశీలిస్తోంది. మరోవైపు ఈ స్కామ్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు చేసిన ఫిర్యాదులోని అంశాలను కూడా అధ్యయనం చేస్తోంది. ప్రతి నెలా రూ.60 కోట్ల చొప్పున వసూలు చేసిన మద్యం ముడుపులు ఎవరికి చేరాయి.. ఆ డబ్బును వైట్ మనీగా మార్చేందుకు ఎంచుకున్న అక్రమ మార్గాలు.. 2019 తర్వాత పుట్టుకొచ్చి 2024లో మూతబడిన షెల్ కంపెనీలు.. డిస్టిలరీస్ కొనుగోలు చేసిన వందల కిలోల బంగారం.. అట్టపెట్టెలు, రెడీమేడ్ దుస్తులు కొన్నట్లు చూపించిన బిల్లులు.. రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లోకి చేరి లాభాలు చూపించిన తీరు..ఏపీలో ఒక సిమెంటు కంపెనీకి చేరిన డబ్బులు.. ఇలా ప్రతి లావాదేవీనీ ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు.

తప్పించుకోలేరు..

నిజానికి ఇప్పటికే లిక్కర్ మాఫియా అక్రమాలన్నీ సిట్ దాదాపుగా తేల్చేసింది. 2019లో మద్యం పాలసీ రూపకల్పన నుంచి ఉత్పత్తి, సరఫరా, విక్రయాలతోపాటు ముడుపులు అందుకున్న వైనాన్ని పసిగట్టింది. పాలసీ రూపొందించినప్పటి నుంచి వేల కోట్ల రూపాయల వసూళ్ల వరకూ ప్రతి అడుగులోనూ చక్రం తిప్పిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(రాజ్ కసిరెడ్డి)తో పాటు 33మందిని నిందితులుగా చేర్చింది. ముడుపులిచ్చుకున్న మద్యం వ్యాపారుల నుంచి నోట్ల మూటలు తీసుకుని గమ్యానికి చేర్చిన వ్యక్తుల వరకూ పలువురిని విచారించింది. రాజ్ కసిరెడ్డితోపాటు ఐదుగురిని అరెస్టు చేసింది. వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి, ఓఎస్డీ సత్యప్రసాద్ తదితరుల వాంగ్మూలాలు నమోదు చేసింది. రాజ్ కసిరెడ్డి అనుచరులు ఇచ్చిన సమాచారంతో అంతిమ లబ్ధిదారు ఎవరో నిర్ధారణకు వచ్చింది. నాడు సీఎంవోలో ఐదేళ్లు చక్రం తిప్పిన సీఎం కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిలను విచారించి అత్యంత కీలక గుట్టును తీయబోతోంది. ఈ నేపథ్యంలో ఈడీ కూడా రంగంలోకి దిగడంతో సూత్రధారులు ఇక తప్పించుకోలేరని భావిస్తున్నారు.

సొమ్ములు షెల్ కంపెనీల్లోకి..

డిస్టిలరీలు, సప్లయర్ల నుంచి సేకరించిన మొత్తాన్ని రాజ్ కసిరెడ్డి వారానికో రోజు రహస్య ప్రాంతానికి చేర్చేవారు. దర్యాప్తు సంస్థలకు దొరక్కుండా వీపీఎన్, వీఓఐపీ, వాట్సాప్, సిగ్నల్ లాంటి వాటితో పాటు ఇంటర్నేషనల్ నెంబర్లు వాడి ఒక్కోసారి ఒక్కో ప్రాంతానికి డబ్బు చేర్చమనేవారు. ఆ డబ్బును షెల్ కంపెనీల్లోకి జమ చేయడం, బులియన్ ఖాతాల్లో వేయడం, మద్యం సిండికేట్ సభ్యులు, సన్నిహితులు, మిత్రులకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపార ఖాతాల్లోకి పంపడం చేసేవారు. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్‌లోని ఆర్గనైజ్డ్ హవాలా నెట్‌వర్క్‌ల ద్వారా షెల్ కంపెనీల్లోకి డబ్బులు చేరేవి. ఇందులో ఎక్కువగా గత వైసీపీ ప్రభుత్వంతో రాజకీయ, వ్యాపార సంబంధాలున్న వారివేనని సిట్ గుర్తించింది. తీసుకున్న ముడుపులను ఖాళీసీసాలు, మూతలు, అట్టపెట్టెలు నాలుగైదు రెట్లు అధిక ధరకు ఈ షెల్ కంపెనీలతో కొనుగోలు చేయించినట్టు బిల్లు చూపించి జమచేశారు. ఇలా కొంత చట్టబద్ధం చేసుకుని బంగారు నాణేలు, గిఫ్ట్ హ్యాంపర్లు, దుస్తులు కొన్నట్లు ఇన్వాయిస్‌లు చూపించారు. ఈ వివరాలను ఈడీ అధికారులకు సిట్ అందజేసింది. మరో వైపు సీబీఐ సైతం ఈ భారీ కుంభకోణంపై ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది.



ధనుంజయ్‌రెడ్డి



కృష్ణమోహన్‌రెడ్డి

మీ రక్షణ మీరే చూసుకోండి

- మధ్యంతర రక్షణ కల్పించడం కుదరదు
- లిక్కర్ స్కాంలో ఆ ముగ్గురికీ సుప్రీంలో చుక్కెదురు
- ముందస్తు బెయిల్‌కు నిరాకరణ.. కేసు విచారణ 13కి వాయిదా

న్యూఢిల్లీ, మే 8(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ఏపీలో జరిగిన మద్యం కుంభకోణం కేసు నిందితులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. వారికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. తదుపరి విచారణ వరకూ మీ రక్షణ అంశాన్ని మీరే చూసుకోవాలని, అప్పటివరకూ మధ్యంతర రక్షణ కల్పించడం కుదరదని స్పష్టం చేసింది. కేసు విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది. వీరి పిటిషన్‌పై జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. నిందితుల తరఫున న్యాయవాదులు వికాస్‌సింగ్, సిద్ధార్థ్ దవే, నాగముత్తు, ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాదులు ముకుల్ రోహత్గి, సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్ విచారణకు హాజరయ్యారు. హైకోర్టులో కేసు విచారణలో ఉండగానే నిందితులు సుప్రీం కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారని ముకుల్ రోహత్గి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌కు ఇప్పుడు విచారణ అర్హత లేదని తెలిపారు. పిటిషన్‌ను సవరించుకోడానికి నిందితులు చేసిన విజ్ఞప్తిని అనుమతించిన కోర్టు.. తదుపరి విచారణలోగా సవరించిన పిటిషన్ దాఖలు చేయాలని సూచించింది. అప్పటివరకైనా మధ్యంతర రక్షణ కల్పించాలని నిందితులు కోరగా.. కుదరదని స్పష్టం చేసింది.

'గ్రూపు-1'కేసులోనూ పీఎస్ఆర్‌కు రిమాండ్

- 22 వరకూ విధిస్తూ విజయవాడ కోర్టు ఉత్తర్వులు



విజయవాడ, మే 8(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూపు-1 పరీక్షా పత్రాల డిజిటల్ మూల్యాంకనం కేసులోనూ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులకు రిమాండ్ విధించారు. ఈ నెల 22 రిమాండ్ విధిస్తూ గురువారం విజయవాడ ఒకటో ఏజేసీజే కోర్టు న్యాయాధికారి దేవిక ఉత్తర్వులు జారీ చేశారు. ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో పీఎస్ఆర్ ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. గ్రూపు-1 డిజిటల్ మూల్యాంకనం కేసులోనూ ప్రధాన నిందితుడు కావడంతో విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు కోర్టులు పీటీ వారెంట్ వేసిన విషయం తెలిసిందే. దీనికి అనుమతి ఇవ్వడంతో జైలు నుంచి పీఎస్ఆర్‌ను కోర్టులో హాజరుపరిచారు. ఏపీపీఎస్సీకి సంబంధించిన ఫుట్‌నోట్స్ ఆయన వద్ద ఉందని, అందులో ఆయన సంతకాలు ఉన్నాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్ధిఖ్ కోర్టుకు తెలిపారు. ఈ ఫుట్‌నోట్స్ పీఎస్ఆర్ వద్ద ఉండడం వల్ల దర్యాప్తు అధికారికి లభించలేదని చెప్పారు. ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షల పత్రాలను కవిషన్ గుర్తించిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రమే మూల్యాంకనం చేయాలన్నారు. ఇందుకు విరుద్ధంగా కామ్‌సైన్ సంస్థకు మూల్యాంకనం బాధ్యతలు అప్పగించారని, రూ.1.14 కోట్లు చెల్లించారని, పేమెంట్ చెక్‌పై పీఎస్ఆర్ సంతకం చేశారని వివరించారు. పీఎస్ఆర్ తరఫున న్యాయవాది విష్ణువర్ధన్ వాదనలు వినిం చారు. అయితే మొదట కోర్టులో హాజరుపరచినప్పుడు పీఎస్ఆర్ సొంతగా వాదనలు వినిపించుకున్నారు. న్యాయాధికారి బెంచ్‌పైకి రికార్డులు వెళ్లాక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్ధిఖ్ వేరే కోర్టులో ఉండడంతో రావడం ఆలస్యమైంది. ఈలోపు పీఎస్ఆర్ మాట్లాడడం మొదలుపెట్టారు. పోలీసులు నమోదు చేసిన కేసు అక్రమమని వాదించారు. తనను కావాలని ఉద్దేశపూర్వకంగా ఇరికించారని చెప్పారు. ఏమైనా ఉంటే ట్రయల్‌లో చెప్పుకోవాలని న్యాయాధికారి సూచించారు. తర్వాత పీపీ వచ్చేవరకు పోలీసులు ఆయన్ను కక్షిదారుల వెయిటింగ్ హాలులోకి తీసుకెళ్లారు.

దర్యాప్తు అధికారి ఎక్కడున్నాడు?

పీఎస్ఆర్ వెయిటింగ్ హాలులో ఉన్నప్పుడు బయట కాపలా ఉన్న పోలీసులను పిలిచి కేసులో దర్యాప్తు అధికారి ఎవరని ప్రశ్నించారు. వారు నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్ పేరు చెప్పారు. ఇక్కడికి కోర్టు వచ్చాడా.. ఎక్కడున్నాడని ఆయన అడిగారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో మాట్లాడుతున్నారని వారు తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడికి దర్యాప్తు అధికారి తిలక్ బంధువా అని ఎస్కార్ట్ సిబ్బందిని అడిగారు. ఆ విషయం తమకు తెలియదని వారు సమాధానం ఇచ్చారు. సిబ్బంది ఏసీపీ తిలక్‌కు విషయం చెప్పడంతో, ఆయన పీఎస్ఆర్ వద్దకు వెళ్లి తానే దర్యాప్తు అధికారినని వివరించారు. తనను కస్టడీకి ఎప్పుడు తీసుకుంటారని పీఎస్ఆర్ ప్రశ్నించారు. తాము ఇంకా అంతవరకు వెళ్లలేదని, కేసు దర్యాప్తులో మాత్రమే ఉన్నామని తిలక్ సమాధానం ఇచ్చారు.

గ్రూప్-1 పేపర్లు దిద్దిన వెల్డర్!

- మూల్యాంకనం చేసినట్లు పేపర్‌పై సంతకం
- ఏపీపీఎస్సీ సిబ్బంది మెడకు 'పునఃపరిశీలన'

విజయవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 పరీక్షల పత్రాల మూల్యాంకనం కేసు దర్యాప్తులో విస్తుపోయే అంశాలు వెలుగు చూస్తున్నాయి. ఓ వెల్డర్ పేరునూ అక్రమాలకు వాడుకున్నారు. హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం పేరిట జరిగిన తంతులో గుంటూరు జిల్లా నంబూరుకు చెందిన ఒక వెల్డర్‌ను వివిధ పనులకు ఉపయోగించుకున్నారు. స్ట్రాంగ్‌రూంలో ఉన్న పేపర్లను తీసుకురావడం, వాటిని గోనెసంచుల్లో పెట్టి తిరిగి స్ట్రాంగ్‌రూంకు మోసుకెళ్లడం వంటి పనులు ఆయన చేశారు. నిబంధనల ప్రకారం ఏపీపీఎస్సీ గుర్తించి, ప్రభుత్వ వర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లతో మాత్రమే ఈ పేపర్లు మూల్యాంకనం చేయించాలి. ప్రతి పేపర్ వెనుక దాన్ని దిద్దిన ప్రొఫెసర్ పేరు, హోదా రాయాల్సి ఉంటుంది. అయితే ఆ స్థానంలో వెల్డర్‌తో, ప్రైవేటు టీచర్‌తో, గర్భిణి అయిన గృహిణితో సంతకాలు చేయించినట్టు పోలీసులు గుర్తించారు. ఆ చిరునామాలను పట్టుకుని విచారణకు వెళ్తే సంతకాలు చేసిన వారి అసలు హోదాలు బయటపడుతుండటంతో అధికారులు విస్తుపోతున్నారు. హాయ్‌ల్యాండ్‌లో నాడు జరిగిన వ్యవహారాల్లో పాత్ర ఉన్న వారందరినీ దర్యాప్తు అధికారి ఏబీజీ తిలక్ పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలు విచారిస్తున్నాయి. 2020 డిసెంబరులో గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించారు. డిజిటల్ మూల్యాంకనం అనంతరం ఫలితాలు విడుదల చేశారు. దీనిపై కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో డిజిటల్ మూల్యాంకనాన్ని రద్దు చేసి మాన్యువల్‌గా మూల్యాంకనం చేయించాలని కోర్టు ఆదేశించింది. అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాలతో కమిషన్ కార్యాలయం నుంచి గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలను అక్రమంగా హాయ్‌ల్యాండ్‌కు తరలించారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు సతీశ్ కూడా పాల్గొన్నారు. తనకు రోజుకు రూ.2వేలు చొప్పున ఇస్తున్నారని చెప్పి నందిగామ నుంచి మరో ఐదుగురిని కూడా అతను హాయ్‌ల్యాండ్‌కు తీసుకెళ్లినట్టు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. కాగా, నిబంధనల ప్రకారం ఒకసారి ప్రశ్నాపత్రాలను మూల్యాంకనం చేసిన తర్వాత వాటిని పునఃపరిశీలించాలి. దీన్నే రీచెక్ అంటారు. ఈ పనిని ఏపీపీఎస్సీ సిబ్బంది చేశారు. రెండోసారి మూల్యాంకనం చేయని పత్రాలపై పునఃపరిశీలన జరిగినట్టుగా కమిషన్ ఉద్యోగులు సంతకాలు చేసి, స్టాంపులు వేశారు. ఈ విధంగా చేసిన ఐదుగురికి సంకెళ్లు వేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు.

పోలీసులు విచారించారని ఆత్మహత్యాయత్నం

గ్రూపు-1 పరీక్ష పత్రాలను డిజిటల్ మూల్యాంకనం చేసిన కేసులో పాత్ర పోషించిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించారు. నాడు పరీక్షా పత్రాలు దిద్దినట్టు సంతకాలు చేసిన వారిలో మొత్తం 66మందిని ప్రత్యేక బృందం గుర్తించి, విచారిస్తోంది. ఇందులో భాగంగా నందిగామలో ఓ ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న సతీశ్‌ను పోలీసులు విచారించారు. మాన్యువల్‌గా మూల్యాంకనం చేసినట్టుగా పేపర్లపై సంతకాలు సంతకాలు చేసినవారిలో సతీశ్ కూడా ఒకరు. పది రోజుల క్రితం పోలీసులు ఆయన్ను విచారించి వాంగ్మూలం తీసుకున్నారు. అప్పట్లో ఏం జరిగిందో పోలీసులకు వివరించిన సతీశ్... కేసులో ఇరుక్కుంటానన్న భయంతో వారం క్రితం ఇంట్లో ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. హాయ్‌ల్యాండ్‌లో జరిగిన డిజిటల్ మూల్యాంకనంలో పాల్గొన్న సతీశ్‌ను విచారించి వాంగ్మూలం తీసుకున్నామని పోలీసులు ధ్రువీకరించారు.

ఎవడినీ వదలను



- వైసీపీ కార్యకర్తలపై కేసులు పెట్టిన పోలీసు అధికారులు ఎక్కడున్నా పిలిపిస్తా: జగన్

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): 'ఈసారిఅధికారంలోకి వస్తే జగన్ 2.0 మామూలుగా ఉండదు. వైసీపీ కార్యకర్తలపై పోలీసు అధికారులు ఎవడెవడైతే కేసులు పెట్టాడో.. అకారణంగా కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశాడో.. వాడు రిటైరయినా, విదేశాలకు వెళ్లిపోయినా, సప్త సముద్రాల అవతల ఉన్నా ఇక్కడకు పిలిపిస్తా. ఎవడినీ వదలిపెట్టను' అని వైసీపీ అధ్యక్షుడు జగన్ వ్యాఖ్యానించారు. గురువారం వైసీపీ కేంద్ర కార్యాలయంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. విత్తు ఏది నాటితే, పండు అదే వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రహించాలన్నారు.

మళ్లీ అదే అబద్ధం: రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో తెలీదు కానీ విశాఖలో ఉర్సాకు రూ.3,000 కోట్ల విలువ జేసే భూములు రూపాయికే చంద్రబాబు ఇచ్చేశాడని జగన్ మళ్లీ అబద్ధం చెప్పారు. కన్ను మూసుకుంటే సంవత్సరం అయిపోయిందని, మరో మూడేళ్లు కన్ను మూసుకుంటే అయిపోతుందన్నారు. ఈ మూడేళ్లూ చంద్రబాబు ప్రభుత్వం పోయేదానికి గట్టిగా కష్టపడదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆ తర్వాత చంద్రబాబుకు సినిమా చూపిద్దామన్నారు.

జెడ్ ప్లస్ భద్రత కోసం హైకోర్టుకు జగన్

తనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించేలా కేంద్ర హోం శాఖను ఆదేశించాలంటూ మాజీ సీఎం జగన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. తనకున్న ప్రాణహానిని తాజాగా, స్వతంత్రంగా మదింపుచేసి భద్రతను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత భద్రతాధికారులు, జామర్లు, ఇల్లు, కార్యాలయం వద్ద భద్రత, పనిచేసే బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సమకూర్చాలని లేదా సొంత వాహనాన్ని వినియోగించుకొనేందుకు అనుమతిచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై శుక్రవారం విచారణ జరుగనుంది.

నేడు గుంటూరు సీఐడీ ఆఫీసుకు సజ్జల, దేవినేని

- టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఎట్టకేలకు కదలిక





గుంటూరు, మే 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఆ కేసు నిందితుల్లో అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ నాయకుడు దేవినేని అవినాశ్‌కు సీఐడీ నుంచి పిలుపు వచ్చింది. ఆ దాడిలో వీరిద్దరూ తెరవెనుక కీలక పాత్ర పోషించారనేందుకు తగు ఆధారాలను సేకరించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. గతంలో అరెస్టయిన, విచారణకు హాజరైన నిందితులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా సజ్జలను ఏ-120గా చేర్చారు. 2021 అక్టోబరు 19న మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ అరాచక మూకలు దాడికి తెగబడ్డాయి. సమాచారం ఇచ్చినా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదు. వైసీపీ శ్రేణులకు విధ్వంసం సృష్టించాయి. టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై తూతూమంత్రంగా కేసు నమోదుచేసి పక్కనపడేసిన పోలీసులు.. టీడీపీ నేతలపైనే ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు పెట్టడం గమనార్హం. కూటమి ప్రభుత్వం వచ్చాక దీని దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. జగన్ ప్రభుత్వం ఈ దాడి పథకం ప్రకారమే జరిగిందని సీఐడీ ఇప్పటికే పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దీనికి సూత్రధారి సజ్జలేనని తేల్చారు. ఇందుకు సంబంధించిన సమగ్ర వివరాలు రాబట్టేందుకు శుక్రవారం ఉదయం 11 గంటలకు గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో హాజరు కావాలని ఆయనకు, దేవినేని అవినాశ్‌కు సీఐడీ నోటీసులు జారీ చేసింది. వారు కూడా వస్తున్నామని సమాచారం ఇచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.